# సువార్త అంటే ఏమిటి?

కీలకమైన ప్రశ్నలు

ఆర్.సి. స్ప్రౌల్

# సువార్త అంటే ఏమిటి?

క్రైప

# సువార్త అంటే ఏమిటి?

ఆర్.సి. స్ప్రౌల్

ALETHIA Publications

Originally published in English under the title:
What is the Gospel?
© 2020 by R.C. Sproul

Published by Ligonier Ministries
421 Ligonier Court, Sanford, FL 32771, U.S.A.
Ligonier.org

Translated by permission. All rights reserved.

This **Alethia Publications** edition published by arrangement with Ligonier Ministries.

First Indian Edition 2026.
ISBN: 978-81-998399-7-7
Telugu version © 2026 by Ligonier Ministries

All rights reserved.
No part of this publication may be reproduced in any form or by any means, Electronic or mechanical, including photocopying, recording, or any Information storage and retrieval system, without permission in writing from the publisher.

Translated and Published in India by
**ALETHIA Publications**.
Jail Road, 3rd Floor, A-3, Dhatrak Heights,
Nashik Road 422101,
Maharashtra, India.

**ALETHIA Publications** is the publishing division of
Alethia Publication & Training Pvt. Ltd.
alethiapublications@gmail.com

www.alethiabooks.com

Printed and bound in India.

# విషయసూచిక


**ఒకటి** దేవుని సువార్త . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 1

**రెండు** రక్షించే శక్తి . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 9

**మూడు** యేసు: ఏకైక రక్షకుడు. . . . . . . . . . . . . . . . . . . . . . . . 19

**నాలుగు** దైవ-మానవుడైన యేసు . . . . . . . . . . . . . . . . . . . . . 29

**ఐదు** పరిపూర్ణ త్యాగం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 37

**ఆరు** పునరుత్థానం, నీతిమంతులుగా తీర్చబడుట . . . . . . . . . . 47

**ఏడు** ఆపాదన . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 57

**ఎనిమిది** క్రీస్తు నీతి. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 65

**తొమ్మిది** జీవితాన్ని మార్చే సువార్త. . . . . . . . . . . . . . . . . . . . . 73

**పది** రక్షణార్థమైన విశ్వాసం . . . . . . . . . . . . . . . . . . . . . . . 79

**పదకొండు** క్రీస్తు, సిద్ధాంతం. . . . . . . . . . . . . . . . . . . . . . . . . 87

**పన్నెండు** సువార్తను ప్రకటించడం రచయిత గురించి. . . . . . . . . . . 95

అధ్యాయం -1

# దేవుని సువార్త

సువార్త అంటే ఏమిటి? బహుశా మనం జవాబు చెప్పాల్సిన ప్రశ్నలలో ఇంతకంటే ముఖ్యమైనది మరొకటి ఉండకపోవచ్చు. ఎందుకంటే మనం చెప్పే జవాబు మన నిత్య గమ్యాన్ని నిర్ణయించడానికి సహాయపడుతుంది. విచారం ఏంటంటే ఈ రోజు క్రైస్తవులమని చెప్పుకునే చాలామందికి సువార్త అంటే ఏమిటో తెలియదు. దాని సారాంశం ఏమిటి? శుభవార్త అంటే ఏమిటి, అది ఎందుకు శుభవార్త? యేసుక్రీస్తు సువార్తను విశ్వసించడం అంటే ఏమిటి? మనం సువార్త యొక్క మూలాన్ని మాత్రమే కాకుండా దాని అర్థాన్ని కూడా అర్థంచేసుకోవాలి. క్రైస్తవులమైన మనం సువార్తను సరిగా అర్థంచేసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే దాన్ని మనం సరిగా అర్థంచేసుకోకపోతే,

క్రీస్తులోని మన విశ్వాసం యొక్క సంపూర్ణతను సరిగా అర్థంచేసుకోవడం మనకు సాధ్యం కాదు.

సువార్త మన పాపాలనుండి మనం ఎలా రక్షించబడగలమో చెబుతుంది. ఒకవేళ దానిని తప్పుగా అర్థం చేసుకుంటే, గలతీ. 1:6–9లో పౌలు చెప్పినట్లుగా మనం శపించబడతాము. కానీ మనం దానిని సరిగ్గా అర్థంచేసుకుంటే, అప్పుడు మనం నిరీక్షణ కలిగి ఉండగలం. అందువల్ల, మనం ఎలా రక్షించబడతాము అనే దాని గురించి దేవుడు మనకు ఏమి చెబుతున్నాడో స్పష్టంగా వివరించడానికి మనం జాగ్రత్తగా లేఖనాలను పరిశోధించడం చాలా కీలకం.

ఫిబ్రవరి, 1998లో వాషింగ్టన్ డి.సి.లో జరిగిన ఒక క్రైస్తవ నాయకుల సమావేశం యొక్క లక్ష్యం ఇదే. ఈ సమావేశంలో పాల్గొన్నవారు క్రైస్తవ సమాజం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని అంగీకరించారు. 16వ శతాబ్దంలో ప్రొటెస్టెంట్ సంస్కరణల కాలంలో ఏర్పడిన ఐక్యత, 450 సంవత్సరాలుగా పటిష్టంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు విచ్ఛిన్నం కావడం ప్రారంభించిందని వారు గుర్తించారు. అనేక అంశాలపై క్రైస్తవ సంఘాలకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ, విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడడం అనే ప్రాథమిక సిద్ధాంతం విషయంలో వారు ఎల్లప్పుడూ ఐక్యంగా ఉన్నారు. చరిత్రలో క్రైస్తవులు దీనిని క్రొత్త నిబంధన సువార్తకు అత్యంత ఆవశ్యకమైనదిగా భావించారు.

దాదాపు ఇదే సమయంలో, ది అలయన్స్ ఆఫ్ కన్ఫెస్సింగ్ ఇవాంజెలికల్స్ అనే బృందం అత్యంత ముఖ్యమైన దైవశాస్త్రపరమైన అంశాన్ని చర్చించడానికి ఫిలదెల్ఫియాలో సమావేశమయ్యింది. దైవశాస్త్రపరంగా అత్యంత కీలకమైన అంశం “సువార్తే” అని ఈ బృందం ఏకీభవించింది. ఫిలదెల్ఫియాలోనూ వాషింగ్టన్ లోనూ

జరిగిన సమావేశాల ఫలితంగా, ముఖ్యంగా నీతిమంతులుగా తీర్చబడటం గురించిన మన అవగాహనలో బైబిల్ని విశ్వసించే సంఘాల ఐక్యతను పునరుద్ధరించడానికి ఒక ఉమ్మడి విశ్వాస ప్రమాణాన్ని రూపొందించారు.

ద గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్: ఆన్ ఇవాంజెలికల్ సెలబ్రేషన్ (“యేసు క్రీస్తు సువార్త: బైబిల్ని విశ్వసించేవారి వేడుక”) అని ఆ విశ్వాస ప్రమాణ పత్రానికి పేరు పెట్టారు. ఈ పత్రం రెండు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగం, ఆ సమావేశానికి హాజరైనవారు ఆమోదించిన ముఖ్యమైన అంశాలను వివరిస్తుంది. ఈ భాగం, క్లిష్టమైన దైవశాస్త్రపరమైన పదజాలాన్ని ఉపయోగించకుండా సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో సువార్తను వివరిస్తుంది. రెండవ భాగం, మరింత ఖచ్చితమైన దైవశాస్త్రపరమైన భాషలో, ‘వాక్యానుసారమైన విషయాలను వాక్య విరుద్ధమైన విషయాలను” వివరిస్తుంది. సువార్త సందేశాన్ని స్పష్టంగా వివరించడానికి ఈ పుస్తకం ఆ ‘‘వాక్యానుసారమైన విషయాలను వాక్య విరుద్ధమైన విషయాలను’ లోతుగా పరిశీలిస్తుంది.*

పై వివరణ ఆధారంగా, మనం ఆ విశ్వాస ప్రమాణాన్ని పరిశీలిద్దాం. ధృవీకరణ 1 ఇలా పేర్కొంటుంది:

> “సంఘానికి అప్పగించబడిన సువార్త మొదటిగా దేవుని సువార్త అని మేము ధృవీకరిస్తున్నాము (మార్కు. 1:14; రోమా. 1:1). దేవుడే దాని కర్త. ఆయన తన వాక్యంలో తన వాక్యం ద్వారా దానిని మనకు వెల్లడిచేస్తున్నాడు.

* పూర్తి ప్రకటనను మీరు ఈ వెబ్‌సైట్‌లో చదవవచ్చు: https://www.ligonier.org/learn/articles/gospel-jesus-christ-evangelical-celebration

సువార్తలోని అధికారం సత్యం కేవలం ఆయన పైనే ఆధారపడి ఉంటాయి.

అదే విధంగా, మొదటి వాక్య విరుద్ధమైన విషయం:

‘సువార్త సత్యం, దానికున్న అధికారం మానవ ఆలోచనల నుంచి, సృజనాత్మకత నుండి వస్తాయని చెప్పే భావాన్ని మేము తిరస్కరిస్తున్నాము (గలతీ. 1:1–11). సువార్త యొక్క సత్యం, అధికారం ఏదైనా ప్రత్యేక సంఘం మీదనో మానవ సంస్థ అధికారం పైనో ఆధారపడిందని చెప్పే వాదనను కూడా మేము తిరస్కరిస్తున్నాము.

ఈ మొదటి శీర్షిక (ఆర్టికల్) దేవుడే సువార్తకు రచయిత, యజమాని అని ధృవీకరిస్తున్నది. “యేసుక్రీస్తు దాసుడును, అపొస్తలుడుగా నుండుటకు పిలువబడినవాడును, దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకింపబడినవాడునైన పౌలు” అని రోమా పత్రికలో పౌలు అంటాడు (రోమా 1:1-2). పౌలు “దేవుని సువార్త” అనే పదబంధాన్ని ఉపయోగించాడు. దేవుని సువార్త గురించి అతడు మాట్లాడినప్పుడు, సువార్త సందేశం కేవలం దేవుని గురించి చెప్పినప్పటికీ, అది కేవలం దేవుని గురించి చెప్పే సందేశమే కాదని మనకు చూపిస్తున్నాడు. కానీ ఇక్కడ గ్రీకులో “యొక్క” అనే పదం సువార్త దేవునికి చెందినదని సూచిస్తుంది. ఇది ఆయన యొక్క ప్రకటన. ఇది ఆయన సందేశం. ఆయనే సువార్తకు మూలం, రచయిత.

మనం *రచయిత (author), అధికారం (authority)* అనే పదాల మధ్య దగ్గర సంబంధాన్ని కూడా గమనించవచ్చు.

దేవుడే మొట్టమొదటిగా సువార్తను ప్రకటించినవాడు. ఆయనే దాని మూల రచయిత. సువార్తకు యజమానిగా రచయితగా ఉన్న ఆయనే దానికి శాశ్వతమైన అధికారాన్ని ఇచ్చాడు. కాబట్టి క్రైస్తవులమైన మనం ప్రకటిస్తున్నది, *సువార్త* అని పిలుస్తున్నది పురాతన కాలంలో ఏదో ఒక మత బోధకుడు కనిపెట్టిన ఆలోచనను కాదు. పాత నిబంధనలోనే సువార్త ప్రకటించబడిన సూచనలు మనకు కనిపిస్తాయి. నిస్సందేహంగా క్రొత్త నిబంధనా సంఘం సువార్తను నేరుగా క్రీస్తు నుండి, ఆయన అపోస్తలుల నుండి పొందుకున్నది. సువార్తకు మొదటి గొప్ప అపోస్తలుడు క్రీస్తే అని మనం చెప్పవచ్చు. కానీ సువార్తను ప్రకటించినప్పుడు కూడా, ఆయన తండ్రి చిత్తాన్ని నెరవేరుస్తున్నాడు. ఈ ప్రకటన చేయడానికి కుమారుణ్ణి పంపింది తండ్రే. కుమారుడు తన సమకాలీనులకు ఈ సందేశాన్ని ప్రకటించటానికి ఆయనకు అధికారం ఇచ్చింది తండ్రే (యోహాను 5:19, 30).

16వ శతాబ్దపు సంఘసంస్కరణ సమయంలో ప్రధానమైన అంశాలలో ఒకటి మనం నీతిమంతులుగా తీర్చబడటం. సంఘసంస్కర్తలు *విశ్వాసం ద్వారా మాత్రమే (sola fide)* అనే సిద్ధాంతాన్ని సమర్థించారు, అంటే మనం క్రియల ద్వారా కాకుండా విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతాము. దీనిని తరచుగా సంస్కరణ యొక్క *పదార్థ (మూల) (material)* కారణం (cause) అని పిలుస్తారు. మనం ఎలా నీతిమంతులుగా తీర్చబడతాము అనే విషయం సువార్తకు చాలా ప్రాముఖ్యం. సంఘసంస్కరణ జరిగిన కాలంలో ఈ అంశానికి ఉన్న ప్రాముఖ్యత కారణంగానే ప్రొటెస్టెంట్లు బైబిల్ని *విశ్వసించేవారు (evangelicals)* అని పిలువబడ్డారు. ఇవాంజెలికల్ అనే పదం కొత్త నిబంధనలో సువార్తకు వాడిన *యువాంగెలియన్ (euangelion)* అనే

గ్రీకు పదం నుండి వచ్చింది. నీతిమంతులుగా తీర్చబడటం అనే సిద్ధాంతానికి సంబంధించిన వివాదంలో, ప్రమాదంలో ఉన్న ప్రధాన విషయం సువార్త సారమే అని వారు విశ్వసించారు. కాబట్టి ప్రొటెస్టెంట్ సంస్కర్తలను ఇవాంజెలికల్స్ అని పిలిచారు. అయితే ఆ మొత్తం వివాదమంతటికీ తెరవెనుక జరుగుతున్న నిరంతరం పోరాటం, అధికారం గురించినదే.

లూథర్ తన తల్లి సంఘ బోధల నుండి భిన్నంగా ఆలోచించడానికి ఎలా సాహసించాడు? పోపు, సంఘ కౌన్సిల్స్ పొరబడే అవకాశం ఉందని తన తీర్మానంలో లూథర్ బహిరంగంగా అంగీకరించమని ఒత్తిడి చేయబడ్డాడు. తన బోధ బైబిల్‌కు విరుద్ధంగా ఉందని నిరూపించగలిగితే, నీతిమంతులుగా తీర్చబడటం గురించిన తన వైఖరిని మార్చుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని అతడు అన్నాడు. లూథర్‌కు, అంతిమ అధికారం లేఖనం, కేవలం లేఖనం మాత్రమే. 1521లో డైట్ ఆఫ్ వార్మ్స్ వద్ద, లూథర్ విచారణలో ఉండగా తన బోధను ఉపసంహరించుకోవాలని అన్నప్పుడు సంక్షోభం తలెత్తింది. అతడు ఒక ప్రసిద్ధ ప్రకటనతో జవాబిచ్చాడు: "తరచుగా తమకు తామే విరుద్ధంగా మాట్లాడే పోపుల ద్వారా సభల ద్వారా కాదుగాని లేఖనం ద్వారా, స్పష్టమైన హేతుబద్ధమైన ఆలోచన ద్వారా నేను ఒప్పించబడితే తప్ప, నా మనస్సాక్షి దేవుని వాక్యానికి బందీగా ఉంది. మనస్సాక్షికి విరుద్ధంగా వెళ్లడం సరైనది కాదు, సురక్షితం కూడా కాదు. నేను దానిని ఉపసంహరించుకోలేను, ఉపసంహరించుకోను."

ఈ ప్రకటనలో సంస్కరణల యొక్క నిర్దిష్ట కారణం బహిరంగంగా వెల్లడించబడింది: లేఖనాలకు మాత్రమే విశ్వాసి యొక్క మనస్సాక్షిపై పూర్తి అధికారం ఉంది. అయితే రోమన్ కేథలిక్ సంఘం ఏమి చెప్పిందంటే, లేఖనం యొక్క అధికారం

సంఘం దానికిచ్చిన అధికారంపై ఆధారపడి ఉంటుంది. లేఖనం యొక్క ప్రాథమిక అధికారాన్ని ప్రకటించేది సంఘమే.

మొదటి ధృవీకరణ (affirmation) ప్రకారం, దేవుడే సువార్తకు రచయిత. ఆయన తన వాక్యం ద్వారా దానిని మనకు వెల్లడిచేశాడు. దాని అధికారం, యథార్థత ఆయనపై మాత్రమే ఆధారపడి ఉన్నాయి. దేవుని వాక్యం మాత్రమే మన మనస్సాక్షిని బంధించే అంతిమ, సంపూర్ణ అధికారాన్ని కలిగి ఉంది. అదేవిధంగా, ఆ విశ్వాస ప్రమాణంలో వాక్యవిరుద్ధమైన అంశాన్ని ఈ క్రింది విధంగా తిరస్కరించారు: “సువార్తలోని సత్యం లేదా దానికున్న అధికారం మానవ ఆలోచనల నుంచో సృజనాత్మకత నుంచో ఉద్భవించిందని చెప్పే భావాన్ని మేము తిరస్కరిస్తున్నాము (గలతీ. 1:1–11). సువార్త యొక్క సత్యం, అధికారం ఏదైనా ప్రత్యేక సంఘ అధికారంపైన, మానవ సంస్థ అధికారంపైన ఆధారపడిందని చెప్పే వాదనను కూడా మేము తిరస్కరిస్తున్నాము.” సువార్త యొక్క అధికారం కేవలం దేవునిపై మాత్రమే ఆధారపడి ఉంటుంది.

మనం సువార్తను ప్రకటించినప్పుడు, బోధించినప్పుడు దైవిక అధికారం కింద ఉండి ప్రకటిస్తాము. మానవులమైన మనం మన సొంత అధికారంతో ఎవరినైనా యేసుక్రీస్తును తమ రక్షకునిగా విశ్వసించమని పిలవలేము. బదులుగా, మనం సువార్తను ప్రకటించినప్పుడు, దేవుని నుండే వచ్చిన సందేశాన్ని అందించే దూతలుగా మాత్రమే ఉంటాము. రోమీయులకు రాసిన పత్రికకు ప్రారంభంలో పౌలు ఇదే చెబుతున్నాడు. సువార్త సారాంశాన్ని వివరించడం ప్రారంభించే ముందు, అతడు తనను తాను ఒక అపోస్తలునిగా, దేవునిచే పిలవబడిన వ్యక్తిగా, ఆయనచే ప్రత్యేకించబడిన వ్యక్తిగా, పరిచయం చేసుకున్నాడు. తాను

సొంతంగా ఆవిష్కరించిన సందేశాన్ని కాకుండా దేవుని సందేశాన్నే అతడు ప్రకటిస్తున్నాడు. పౌలు యొక్క అపోస్తలత్వపు అధికారం ఆ సందేశానికి అంతిమ అధికారం కాదు. దేవుడే దానిని ప్రకటిస్తాడు. అది దేవుని సొత్తు. దేవుడే దానికి అధికారాన్ని ఇస్తాడు.

అధ్యాయం - రెండు

# రక్షించే శక్తి

ద గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్టు: బైబిల్ని విశ్వసించేవారి వేడుక" లోని 2, 3 శీర్షికలలోని వాక్యానుసారమైన విషయం కొత్త నిబంధనలోని సత్యాలను బలంగా నొక్కిచెబుతున్నాయి. 2వ ఆర్టికల్, మన ఆధ్యాత్మిక జీవితానికి అవసరమైన శక్తి కోసం దేవుని వైపు, ఆయన సువార్త వైపు చూడాలని దృష్టిసారిస్తుంది. 3వ ఆర్టికల్లోని ధృవీకరణలో, ఇందులో 'శుభ వార్త' ఎక్కడుంది అనే సందేహాన్ని మనలో కలిగించవచ్చు. ధృవీకరణ 2 ఇలా చెప్పుతుంది:

> సువార్తనే దేవుని రక్షించే శక్తి అని, అది నమ్మిన ప్రతి ఒక్కరిని ఎలాంటి తారతమ్యమూ లేకుండా రక్షిస్తుందని

(రోమా. 1:16), ఈ సువార్త దేవుని శక్తి ద్వారానే పనిచేస్తుందని (1 కొరింథీ. 1:18) మేము ధృవీకరిస్తున్నాము.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఇలా చెబుతోంది:

సువార్త యొక్క శక్తి ఉపదేశకుని వాగ్ధాటిలోనో సువార్తికుని నైపుణ్యంలోనో, హేతుబద్ధమైన వాదనల ప్రభావంలో ఉందని చెప్పే మాటను మేము తిరస్కరిస్తాము (1 కొరింథీ. 1:21; 2:1–5).

"గ్రీసుదేశస్థులకును గ్రీసుదేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను. కాగా నావలననైనంతమట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" అని పౌలు రాశాడు (రోమా 1:14-16). ఇక్కడ సువార్త యొక్క అర్థాన్ని, అందులోని అంశాలను వివరిస్తూ రక్షణ విషయంలో సువార్త *దేవుని శక్తియైయున్నదని* పౌలు అంటున్నాడు.

బైబిల్ని విశ్వసించే చారిత్రక క్రైస్తవ్యానికి ఈ ప్రకటన చాలా ప్రాథమిక సిద్ధాంతం, కాబట్టి దీనిని ఇప్పుడు ఎందుకు ధృవీకరించాల్సి వస్తోందని మనం ఆశ్చర్యపోవచ్చు. సువార్త అనేది రక్షణ విషయంలో దేవుని శక్తి అనే స్పష్టమైన వాస్తవాన్ని ఎందుకు ప్రత్యేకంగా గుర్తుచేయాలి? అలాగే, సువార్త శక్తి సువార్తికుని నైపుణ్యంపై, బోధకుని వాగ్ధాటిపై లేదా హేతుబద్ధమైన వాదనల చాకచక్యంపై ఆధారపడి ఉంటుందనే ఆలోచనలను ఎందుకు ఖండించాలి? నేటి కాలంలో ఈ ప్రకటన అవసరం అని నేను భావిస్తున్నాను. ఎందుకంటే

మనం దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయడానికి బదులుగా, మార్కెటింగ్ పద్ధతులను అధ్యయనం చేయడంలో ఎక్కువ శ్రద్ధ పెడుతున్నాము. అలాగే ప్రజలను రక్షణలోకి తీసుకురావడానికి మన కార్యక్రమాలు సహాయపడతాయని మనం ఆశించడం అలవాటు చేసుకున్నాం. ప్రజల జీవితాలను మార్చే శక్తి మన కార్యక్రమాలలోనూ మన పద్ధతులలోనూ ఉందని మనం భావించడం మొదలుపెట్టాం. సువార్తను స్పష్టంగా, ధైర్యంగా బోధిస్తే అది మనం ఎంచుకున్న పద్ధతులపై ప్రతికూల ఫలితం చూపిస్తుందని భయపడేంతగా మన పద్ధతులకు మనం అలవాటు పడిపోయాం.

సువార్తను ధైర్యంగా, స్పష్టంగా ప్రకటించినప్పుడు విభేదాలు వస్తాయని లూథర్ హెచ్చరించాడు. చాలామంది ఆ విభేదాలను తీవ్రంగా నివారించాలని చూస్తారు. కొన్నిసార్లు సువార్త మన సంఘంలో విభేదాలను సృష్టిస్తుందని భయపడి, దానిని మరుగుచేయడానికి మనం ప్రయత్నిస్తాం. దేవుడు తన శక్తిని, పరిశుద్ధాత్మ శక్తిని సువార్తకు ఇచ్చాడని మర్చిపోయి, సువార్తపైన తప్ప మిగతా అన్నింటిపై దృష్టి పెడతాం.

రక్షణ విషయంలో సువార్త దేవుని శక్తి అని పౌలు చెప్పినప్పుడు, ఈ సందేశంలోనే మానవులను రక్షించడానికి అవసరమైన పరలోకపు వనరులను దేవుడు నిక్షిప్తం చేశాడు అని అతడు చెబుతున్నాడు. దేవుడే తన సువార్తను శక్తితో నింపుతాడు. పరిశుద్ధాత్ముడు సువార్తతో కలిసివెళ్లి, లోకాన్ని పాపం గురించి, నీతి గురించి ఒప్పించి, వారికి విశ్వాసమూ నిత్యజీవమూ కలిగేలా వారిని జీవింపచేస్తాడు. మనం ఆ శక్తిని పక్కన పెట్టి, మన సొంత పద్ధతులను వాడితే, సంఘం యొక్క అసలు లక్ష్యాన్ని విస్మరించినట్లే.

మనం పదేపదే గుర్తుంచుకోవలసింది ఏమిటంటే, మన సంఘాలలో దేవుని యొక్క, పరిశుద్ధాత్మ యొక్క శక్తివంతమైన

సన్నిధిని చూడాలనుకుంటే, సువార్త ప్రకటన ద్వారానే ఆ శక్తి విడుదల అవుతుందని గుర్తుంచుకోవాలి. అవును, దానివల్ల విభేదాలు వస్తాయి. అవును, కొంతమందికి అది అభ్యంతరకరంగా ఉంటుంది. మనుషులను రక్షణలోకి తీసుకొచ్చే దేవుని శక్తికి మనం నమ్మకస్తులుగా ఉన్నప్పుడు మనం చెల్లించే మూల్యం ఇదే.

సువార్త యొక్క శక్తి ఉపదేశకుని వాగ్ధాటిపై ఆధారపడి ఉండదని తిరస్కరణ చెబుతుంది. వాగ్దాటిని కలిగి వుండడం తప్పు కాదు. అలాగే బోధకులు తమ వరాలను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించడంలో కూడా తప్పు లేదు. ఉపన్యాసాలు ఎలా ఇవ్వాలి, ప్రసంగాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి విషయాలలో బైబిలు కళాశాలు ఇచ్చే శిక్షణ బోధకులకు సహాయపడుతుంది. కానీ సువార్త యొక్క ప్రభావం ఆ పద్ధతులపై, ఉపన్యాస నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుందని మనం నమ్మము. పౌలు ఇలా రాశాడు:

> సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి. అని వ్రాయబడియున్నది,
>
> ఇందు విషయమై జ్ఞానుల
> జ్ఞానమును నాశనము చేతును.
> వివేకుల వివేకమును శూన్యపరతును.
>
> జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈ లోకపు తర్కవాది యేమయ్యెను? ఈ లోక జ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసియున్నాడు గదా? దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను

> వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. (1 కొరింథీ. 1:18-21) తర్వాత పౌలు ఇలా రాశాడు:
>
> సహోదరులారా, నేను మీయొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చినవాడను కాను. నేను, యేసుక్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీమధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని. బలహీనతతోను భయముతోను ఎంతో వణకుతోను మీయొద్ద నుంటిని. మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని. (1 కొరింథీ. 2:1-5)

పౌలు తన మాటలలో ఏదో లోపం ఉన్నట్లు సూచించాడు. అయితే అతని పత్రికలను చూస్తే, పౌలు స్పష్టంగా మాట్లాడలేని వ్యక్తి అని ఎవరూ అనలేరు. కనీసం అతని రచనల ద్వారా, పౌలు చాలా అనర్గళంగా మాట్లాడగలడని స్పష్టమవుతుంది. పౌలు అసాధారణమైన జ్ఞానాన్ని, లోతైన ఆలోచనలను, బలమైన తార్కిక శక్తిని ప్రదర్శించాడు. అయితే పౌలు తన నమ్మకాన్ని మానవ సామర్థ్యాలపై ఉంచలేదు. తన నైపుణ్యాలలోనూ తన పద్ధతుల్లోనూ శక్తి లేదని, అది దేవునిలోనే ఉందని అతడు నమ్మాడు. దేవుని దృష్టిలో

జ్ఞానంగా ఉన్న విషయాలు, ఈ లోకం దృష్టిలో తరచూ వెర్రితనంగా పరిగణించబడతాయి. ఇక్కడ మనం తిరస్కరిస్తున్నది ఉపన్యాస నైపుణ్యాన్నో సువార్త పద్ధతులనో హేతుబద్ధమైన వాదనల విలువనో కాదు. కానీ రక్షణను కలుగజేసే శక్తి వాటిలో ఉందనే నమ్మకాన్ని తిరస్కరిస్తున్నాం.

3వ ఆర్టికల్లో, మానవుని పాపపు స్థితి మీదకి మన దృష్టిని మరల్చుదాం. ధృవీకరణ 3 ఇలా చెప్పుతుంది:

> సువార్త ప్రకారం, మానవులందరూ దేవునికి వ్యతిరేకంగా పాపం చేస్తూ తిరుగుబాటు చేస్తూనే ఉన్నారని, వాళ్లు మార్పు చెందకపోతే ప్రతి ఒక్కరూ దేవుని శిక్షకు గురై నిత్య నాశనానికి గురవుతారని మేము ధృవీకరిస్తున్నాము.

> దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:

> పతనమైన మానవ స్వభావాన్ని తిరస్కరించే వాదనను, మానవులు సహజంగా మంచివారు దైవిక స్వభావం కలిగినవారు అనే వాదనను మేము తిరస్కరిస్తున్నాం.

సువార్త నిజంగా మంచి వార్త. అది క్రీస్తు యొక్క దైవ మానవ స్వభావాల గురించి ఆయన చేసిన కార్యాలను గురించి చెబుతుంది. అంతేకాదు క్రీస్తు మన నిమిత్తం చేసిన కార్యం వలన కలిగే ప్రయోజనాలను మనం ఎలా పొందవచ్చో కూడా తెలియజేస్తుంది. అయితే మానవులందరూ పాపపు స్థితిలో, దేవునికి వ్యతిరేకంగా ఉన్నారని చెప్పడం ఎలా సువార్తలో భాగం అవుతుంది? ఈ విషయం ఈ డాక్యుమెంట్లో ఎందుకు చేర్చబడింది? ఈ ప్రశ్నకు

జవాబు తెలుసుకోవడానికి, మనం మళ్ళీ పౌలు చెప్పిన మాటలను చూద్దాం.

రోమా పత్రిక 1వ అధ్యాయంలో, పౌలు సువార్తను పరిచయం చేసి, అది రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తి అని వివరిస్తున్నాడు. సువార్త ప్రత్యక్షతను గురించి కూడా చెబుతున్నాడు. ఆ తర్వాత సువార్త యొక్క సారాన్ని వివరిస్తున్నాడు. అయితే దానికంటే ముందు, మానవుల పాపపు స్థితి గురించి మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. పౌలు ఇలా రాశాడు: “దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది.” (రోమా 1:18).

రోమా పత్రిక 1-3 అధ్యాయాలలో, పౌలు సువార్త ఎందుకు అవసరమో వివరిస్తున్నాడు. సువార్త అనేది మనలను నాశనం చేస్తున్న వ్యాధికి విరుగుడుగా ఉన్నది. ఏ వైద్యుడైనా రోగాన్ని నయం చేయడానికి ముందు, రోగిని పరీక్షించి, రోగాన్ని నిర్ధారించాలి. అదే విధంగా మనం సువార్తను మంచి వార్తగా వినడానికి ముందు, మనకు అసలు ఎందుకు సువార్త అవసరమో అర్థంచేసుకోవడానికి ముందు, మొదటి దానిలోని చెడు వార్తను మనం అర్థంచేసుకోవాలి.

దేవుని ధర్మశాస్త్రాన్ని చూపించి వివరించడం ద్వారా, సువార్త యొక్క అవసరాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చరిత్రలో ప్రొటెస్టెంట్ కాపరులు, బోధకులు సహాయం చేశారు. ప్రజలు దేవుని ధర్మ శాస్త్రాన్ని అర్థంచేసుకుని, దానిని ఉల్లంఘించామని తెలుసుకుని, దేవుని తీర్పుకు గురవుతామనే సత్యాన్ని గ్రహించనంత వరకు, వారికి సువార్త మంచి వార్తలా అనిపించదు. అందుకే నేడు చాలామంది సువార్తను విని, “అయితే ఏంటి?” అని అంటున్నారు.

ఎందుకంటే దేవుని ముందు తిరుగుబాటుదారులుగా తాము ఉన్న ప్రమాదకరమైన పరిస్థితిని వారు గ్రహించలేకపోతున్నారు.

సువార్త యొక్క ప్రధాన సందేశం దేవునితో సమాధానపడడం. సమాధానపడటానికి మొదటి మెట్టు, దేవునికి దూరంగా ఉన్నామనే భావన. ఈ రోజు చాలామంది సువార్త పట్ల శ్రద్ధ కనబరచకపోవడానికి కారణం, దేవునికీ తమకూ మధ్య నిజమైన దూరం ఉందని వారు నమ్మకపోవడమే. అయితే మానవులందరూ దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని బైబిలు, ముఖ్యంగా రోమా పత్రిక 2, 3 అధ్యాయాల్లో బోధిస్తుంది. అందరూ దేవుని సత్యాన్ని వక్రీకరించారు. దేవుని సృష్టిలోనే తిరుగుబాటుదారులుగా ఉంటూ మనం ఆయనను దేవునిగా ఘనపరచడానికి లేదా కృతజ్ఞత కలిగి ఉండటానికి నిరాకరిస్తున్నాం (రోమా 1:21). ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. దేవుని న్యాయపీఠం ముందు నిలబడినప్పుడు లోకం మొత్తం దోషులుగా ఉంటారు; నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు. మేలు చేయువాడు లేడు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:10-12, 23). మనం ఈ సత్యాన్ని అర్థంచేసుకోకపోతే, సువార్త యొక్క ప్రాముఖ్యతను నిజంగా గ్రహించలేము.

విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడటం ఎందుకు ముఖ్యమైనది? దేవుడు నీతిమంతుడు, మనం కాదు కాబట్టి ఇది చాలా ముఖ్యమైనది. భూమ్యాకాశాలను పరిపాలించే దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు. ఆయన మనలను తన సంపూర్ణ నీతిని బట్టి తీర్పుతీరుస్తాడు. అయితే మనం అన్యాయస్థులం. ఒకవేళ దేవుడు తన నీతి ప్రమాణాల ప్రకారం మనకు తీర్పు తీరిస్తే, మనం ఆయన విధించే నిత్య శిక్షకు గురవుతాం. మనం ఈ విషయాలను అర్థం చేసుకోనంతవరకు, నీతిమంతులుగా

తీర్చబడటం అనే సిద్ధాంతం మనకు ప్రాముఖ్యత లేనిదిగానే అనిపిస్తుంది. అయితే దేవుడు నీతిమంతుడని, మనం దుర్నీతిపరులమని అర్థంచేసుకుంటే, అప్పుడు “పాపాత్ముడు పరిశుద్ధుడైన, నీతిమంతుడైన దేవుని దృష్టిలో ఎలా నీతిమంతుడుగా తీర్చబడతాడు?” అనే ప్రశ్న మన జీవితంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న అవుతుంది (రోమా 3:21-28). 3వ ఆర్టికల్లోని తిరస్కరణలో, మానవ స్వభావం పతనమైనదని తిరస్కరించే వాదనను మానవులు సహజంగా మంచివారు దైవిక స్వభావం కలిగినవారు అనే వాదనను మేము తిరస్కరిస్తున్నాం.

లిగోనియర్ సంస్థ నిర్వహించిన “స్టేట్ ఆఫ్ థియాలజీ” సర్వే ప్రకారం, బైబిల్ని నమ్మే క్రైస్తవులలో 55% మంది, “ప్రతి ఒక్కరూ కొద్దిగా పాపం చేసినప్పటికీ, చాలామంది ప్రజలు స్వతహాగా మంచివారు” అనే ప్రకటనతో ఏకీభవించారు. ఈ అభిప్రాయం జన్మ పాపాన్నీ, మనకు రక్షకుడు అవసరం అనే సత్యాన్నీ తృణీకరిస్తుంది. ఇది చాలా భయంకరమైనది. ఎవరైనా ఈ విషయాన్ని నమ్మితే, వారు ఇసుకపై కట్టిన ఇంటిపై ఆధారపడిన వారుగా ఉంటారు. దేవుని తీర్పు దినాన వారు తప్పించుకోలేరు. బైబిలు ప్రకారం, మనం పాపంలో పుట్టాం, దేవుని న్యాయమైన తీర్పుకు లోబడి ఉన్నాం (ఎఫెసీ. 2:1-3). మనం స్వతహాగా మంచివారం కాదు, మనల్ని మనం రక్షించుకోలేము; మనకు ఒక రక్షకుడు అవసరం. మన పాపం కారణంగా, మనకు సువార్త అవసరం.

అధ్యాయం మూడు

# యేసు: ఏకైక రక్షకుడు

ధృవీకరణలన్నింటిలో అమెరికా ప్రజలు అత్యధికంగా వ్యతిరేకించేది, 4వ ధృవీకరణ అని అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఒకే ఒక్క మతం ప్రత్యేకమైనదని చెప్పడం బహుళవాదం యొక్క (pluralism), సాపేక్ష వాదం (relativism) యొక్క మూలాలను దెబ్బతీస్తుంది. ఇది అమెరికా విలువలకు పూర్తిగా విరుద్ధమైనదిగా మనం చెప్పవచ్చు. "మీరు ఏమి నమ్మినా పర్వాలేదు, మీరు చిత్తశుద్ధితో ఉంటే చాలు, అన్ని మార్గాలు పరలోకానికే దారితీస్తాయి" అనే భావజాలం మనల్ని ముంచెత్తింది. మనుషులు ఒకే ఒక మార్గానికి కట్టుబడి ఉండాలని కోరుకునే సంకుచిత మనస్తత్వం గలవాడా దేవుడు? అయితే వాస్తవానికి, మన సిద్ధాంతాల డాక్యుమెంట్ రూపకర్తలు లేఖనాల యొక్క స్పష్టమైన బోధకు కట్టుబడి ఉన్నారు.

ధృవీకరణ 4 ఇలా చెప్పుతుంది:

యేసుక్రీస్తు మాత్రమే రక్షణకు ఏకైక మార్గం అని, ఆయనే దేవునికి మానవజాతికి మధ్యనున్న ఏకైక మధ్యవర్తి అని మేము ధృవీకరిస్తున్నాము (యోహాను 14:6; 1 తిమోతి 2:5).

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:

కేవలం యేసుక్రీస్తు ద్వారా, ఆయన సువార్త ద్వారా కాక వేరే మార్గం ద్వారా రక్షణ పొందవచ్చు అనే భావజాలాన్ని మేము ఖండిస్తున్నాము. ఇతర మతాలను యథార్థ మనసుతో ఆరాధించేవారు యేసుక్రీస్తు యందు వ్యక్తిగత విశ్వాసం లేకుండా రక్షించబడతారు అనే నిరీక్షణను బైబిల్ ఇవ్వడం లేదు.

యేసు తన శిష్యులకు ఇలా ప్రకటించాడు: “నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు” (యోహాను 14:6). క్రీస్తు మాత్రమే దేవునికి, మానవులకు మధ్య ఉన్న ఏకైక మధ్యవర్తి అని అపోస్తలుడైన పౌలు రాశాడు: “దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను. దీనినిగూర్చిన సాక్ష్యము యుక్త కాలములయందు ఇయ్యబడును” (1 తిమోతి 2:5–6).

మధ్యవర్తి అంటే రెండు వర్గాల మధ్యనున్న విభేదాలను తొలగించడానికి వారి మధ్య నిలబడే వ్యక్తి. బైబిల్‌లో, ముఖ్యంగా

పాత నిబంధనలో, ఇలాంటి మధ్యవర్తులు చాలామంది ఉన్నారు. ఉదాహరణకు, మోషే పాత నిబంధనకు మధ్యవర్తిగా పనిచేశాడు. అతడు దేవునితో మాట్లాడేటప్పుడు ఇశ్రాయేలు ప్రజల తరపున మాట్లాడాడు, అలాగే దేవుని మాటలను ప్రజలకు చేరవేశాడు. పాత నిబంధనలోని ప్రవక్తలు కూడా మధ్యవర్తులుగా పనిచేశారు. వారు దేవుని తరపున ప్రజలతో మాట్లాడేవారు. వారు దేవునికి, ప్రజలకు మధ్య నిలబడ్డారు. కాబట్టి దేవుడు ప్రవక్తలకు తనను తాను ప్రత్యక్షపరచుకుని మాట్లాడేవాడు. ఆ తర్వాత వారు "యెహోవా సెలవిచ్చినదేమనగా" అని ప్రజలకు చెప్పేవారు. అదే విధంగా ఇశ్రాయేలు యాజకులు, అహరోను సంతానంలో నుంచి వచ్చిన యాజకులు ప్రజల తరపున దేవునితో మాట్లాడి విజ్ఞాపన చేసేవారు. ఇశ్రాయేలు యొక్క రాజు కూడా ఒక రకమైన మధ్యవర్తే; ఎందుకంటే అతడు తన సొంత శక్తితో కాకుండా, దేవుని ప్రతినిధిగా ప్రజలను పాలించేవాడు. అందుకే పాత నిబంధన ధర్మశాస్త్రం ప్రకారం నీతిగా పాలించే విషయంలో, రాజును జవాబుదారీగా దేవుడు ఎంచాడు.

యేసుక్రీస్తు మాత్రమే దేవునికి, మానవులకు మధ్యనున్న ఏకైక మధ్యవర్తి అని చెబుతూ ఇతర మధ్యవర్తుల పాత్రను పౌలు తిరస్కరించడం లేదు. బదులుగా మధ్యవర్తిత్వంలో క్రీస్తు పాత్ర యొక్క విశిష్టతపై అతడు దృష్టిపెడుతున్నాడు. క్రీస్తు యొక్క మధ్యవర్తి పాత్ర పూర్తిగా ప్రత్యేకమైనది. ఈ ప్రత్యేకత ఆయన మధ్యవర్తిత్వ కార్యంలో మాత్రమే కాకుండా ఆయన వ్యక్తిత్వంలో కూడా ఉంది. క్రీస్తు మాత్రమే దైవ-మానవుడు అనేదే ఆయన వ్యక్తిత్వం. ఆయన శరీరధారిగా వచ్చిన దేవుడు, మనకు తోడుగా ఉన్న దేవుడు. దేవునికి, మానవులకి మధ్య సమాధానాన్ని, విమోచనను తీసుకురావడానికి దేవుడు ఏమి చేశాడు? దేవుని కుమారుడు మానవత్వాన్ని ధరించుకొని, దేవునికీ ఆయన ప్రజలకూ

మధ్య సమాధానం తీసుకురావడానికి నిలబడ్డాడు. ఆ మధ్యవర్తిత్వ కార్యంలో, ముఖ్యంగా ప్రాయశ్చిత్తం అనే కార్యంలో, సమాధానాన్ని తీసుకురావడానికి అవసరమైన దాన్ని చేయడానికి క్రీస్తు మాత్రమే, కేవలం క్రీస్తు మాత్రమే అర్హుడు.

కర్ డ్యూస్ హోమో (దైవ-మానవుడు ఎందుకు?) అనే పుస్తకంలో, కాంటర్బరీకి చెందిన ఆన్సెల్మ్, మన రక్షణ విషయంలో మధ్యవర్తి దైవత్వాన్ని మానవత్వాన్ని ఎందుకు కలిగి ఉండాలో వివరించాడు. ఇప్పుడు క్రైస్తత్వాన్ని ప్రపంచంలోని ఇతర మతాలన్నిటి కంటే ప్రత్యేకంగా, భిన్నంగా చేసింది ఏమిటి? జవాబు చాలా సులభం: ఆ ప్రత్యేకత క్రీస్తే. మరే ఇతర మతానికీ దైవ-మానవ స్వభావాలు కలిగిన మధ్యవర్తి లేడు. ఈ ప్రపంచంలో మరే మతానికీ దేవునికి, మానవునికి మధ్యనున్న అగాధాన్ని పూడ్చగల ప్రాయశ్చిత్తం లేదు. ఏ ప్రపంచ నాయకుడూ మత నాయకుడూ మృతుల్లో నుండి తిరిగి లేవలేదు. కన్ఫ్యూషియస్‌కు జ్ఞానం ఉంది, కానీ అతడు చనిపోయాడు. చనిపోయిన వాడిగానే ఉండిపోయాడు. మహమ్మద్ మరణించాడు. బుద్ధుడు మరణించాడు. అలాగే మిగిలిన వారందరి పరిస్థితి కూడా అదే. అయితే క్రీస్తుకు మాత్రమే దేవుణ్ణి, మానవుణ్ణి సమాధానపరచగల సామర్థ్యం ఉంది. ఆయన తప్ప మరెవరూ పాపరహితులు కారు. క్రీస్తే రక్షణకు ఏకైక మార్గం అని మేము నమ్ముతున్నాము, ఎందుకంటే ఆయన మాత్రమే సమాధానం తీసుకురావడానికి చేయాల్సిన మధ్యవర్తిత్వ కార్యాన్ని చేయడానికి అవసరమైన అర్హతలను కలిగి ఉన్నాడు.

“దేవుడు ఒకే ఒక్క రక్షకుణ్ణి ఎందుకు ఇచ్చాడు? అంత సంకుచితంగా ఆయన ఎందుకు ఉన్నాడు?” అని కొందరు అడుగుతారు. కానీ వారు నిజంగా అడగాల్సిన ప్రశ్న: “దేవుడు అసలు

మనకు రక్షకుణ్ణి ఎందుకు ఇవ్వాలి? మనందరినీ శిక్షించి, మనకు రావలసిన శిక్షను విధించడం ద్వారా తన న్యాయాన్ని ఆయన ఎందుకు ప్రదర్శించలేదు? మనకు రావలసిన శిక్షను భరించడానికి, మనకు అత్యవసరమైన నీతిని ఇవ్వడానికి మన స్థానంలో నిలబడే ఒక మధ్యవర్తిని ఇవ్వడానికి దేవుడు తన అపారమైన కృపలో ఎందుకు అసాధారణమైన ప్రయత్నం చేశాడు?" ప్రజలు ముఖ్యంగా క్రైస్తవులు, క్రీస్తు యొక్క ప్రత్యేకతను తక్కువ చేసి చూడకూడదు. దేవుడు తన కుమారుని విషయంలో ఎంతో రోషం కలిగి ఉంటాడు. యేసు దేవునికి ఏకైక అద్వితీయ కుమారుడు. కొత్త నిబంధనలో మూడుసార్లు నేరుగా దేవుని స్వరాన్ని మనుషులు విన్నట్లు నమోదు చేయబడింది. అందులో రెండుసార్లు ఆయన తన కుమారుని గురించి పరలోకం నుండి ఇలా ప్రకటించాడు: "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు; ఈయన మాట వినుడి" (మత్తయి 3:17; 17:5; *యోహాను 12:28*). నిత్యత్వం అంతటి నుండి దేవుడు క్రీస్తుకు నియమించిన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. ఎందుకంటే ఘనత, మహిమ, ఆధిపత్యం, శక్తి పొందడానికి ఆయన మాత్రమే అర్హుడు. దేవుడు అంతటను అందరును క్రీస్తును అంగీకరించి, ఘనపరచాలని మనుషులకు ఆజ్ఞాపిస్తున్నాడు. దేవుడు మరి ఏ ప్రత్యామ్నాయాన్నీ అంగీకరించడు.

ఒకే ఒక మధ్యవర్తి ఉన్నాడని చెప్పడానికి ముందు, దేవుడు ఒక్కడే అని పౌలు స్పష్టం చేయడం గమనించండి. దేవుడు విగ్రహారాధనను తీవ్రంగా వ్యతిరేకించిన పాత నిబంధన అంతటిలోనూ ఈ ప్రత్యేకత ప్రకటించబడింది. మొదటి ఆజ్ఞే, ఈ ప్రత్యేకతను తెలియజేసే ఆజ్ఞ: "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" (నిర్గమ. 20:3). దేవుడు అన్య దేవతల ఆరాధనను ఖండించాడు. ఆయన అబద్ధ మతాల విషయంలో సంతోషంగా ఉండడు. అయితే వాటిని తన మహిమకు వ్యతిరేకంగా జరిగే తీవ్రమైన తిరుగుబాటుగా చూశాడు.

పౌలు ఈ విషయాలనన్నింటిని కలిపి ఇలా చెబుతున్నాడు. దేవుడు ఒక్కడే. ఆ దేవునికి ఒక్కడే కుమారుడు. దేవునికి, మానవాళికి మధ్య ఒకే ఒక్క మధ్యవర్తి ఉన్నాడు. బహుళవాదంలో (అన్ని మతాలు సమానమే) పూర్తిగా మునిగిపోయిన ప్రజలకు ఇది అంగీకరించడం కష్టం. అయితే ఈ విషయంలో వారు క్రీస్తుతోనూ ఆయన యొక్క అపోస్తలులతోనూ విభేదించాల్సి ఉంటుంది. ఇతర మతాలలోని దేవతలను యథార్థమైన మనసుతో ఆరాధించేవారు, యేసుక్రీస్తుపై వ్యక్తిగత విశ్వాసం లేకపోయినా రక్షించబడతారు అనే నిరీక్షణను బైబిలు ఏ విధంగానూ ఇవ్వట్లేదు.

ఇతర ప్రపంచ మతాలను ఆచరించేవారు కూడా క్రీస్తు ద్వారా రక్షింపబడగలరని కొందరు నమ్ముతారు. వారు వేరొక దేవునికి ఆరాధన చేయడం ద్వారా, అజ్ఞానంతో క్రీస్తునే ఆరాధిస్తున్నారని వాదిస్తారు. ఈ వాదన ప్రకారం, ఎవరు నిజమైన భక్తితో, చిత్తశుద్ధితో ఉన్నా, వారికి దేవుడు క్రీస్తు నెరవేర్చిన కార్యాల ప్రయోజనాలను అందిస్తాడు. అయితే 4వ తిరస్కరణ దీనిని ఖండిస్తూ, రక్షణ పొందడానికి క్రీస్తు ఎంత అవసరమో, క్రీస్తుపై వ్యక్తిగత విశ్వాసం కూడా అంతే అవసరం అని చెబుతున్నది. అపోస్తలుడైన పౌలు మార్స్ హిల్‌లో (అరెయొపగు సభలో) గ్రీకులకు చెప్పినట్లు: "ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పుతీర్చ బోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపో. కార్య. 17:30–31). క్రీస్తును ఆరాధించాల్సిన, విశ్వసించాల్సిన సార్వత్రిక అవసరం ప్రజలందరికీ ఉంది.

ఆర్టికల్ 5ను చూద్దాం. ధృవీకరణ 5 ఇలా చెప్పుతుంది:

సంఘం దేవునిచే ఆజ్ఞాపించబడిందని, అందువల్ల జీవం కలిగిన ప్రతి వ్యక్తికి సువార్తను ప్రకటించాల్సిన దైవిక బాధ్యత సంఘానికి ఉందని మేము ధృవీకరిస్తున్నాము (లూకా 24:47; మత్తయి 28:18–19).

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:

ప్రజలు ఏ జాతికి చెందినవారైనా ఏ సమూహానికి చెందినవారైనా వారి సంస్కృతి ఏదైనా సువార్తను ప్రకటించేటప్పుడు వాటిని పట్టించుకోకుండా సువార్తను ప్రకటించాలి. దీనికి విరుద్ధమైన ప్రతి భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము (1 కొరింథీ. 9:19–22). సంఘం ప్రపంచవ్యాప్తమైనదిగా ఉండాలని అనగా ప్రతి జాతికీ భాషకూ దేశానికీ చెందిన ప్రజలతో నిండినదిగా సంఘం ఉండాలని దేవుడు ఉద్దేశించాడు (ప్రకటన 7:9).

ఆర్టికల్ 5 సంఘం యొక్క లక్ష్యాన్ని ధృవీకరిస్తున్నది. ఈ లక్ష్యాన్ని సంఘానికి ప్రభువైన యేసే నిర్వచించాడు. సువార్తను ప్రకటించడంలో సంఘం నిమగ్నమవ్వాలని ఆయన ఆదేశించాడు. సంఘానికి ప్రభువు, శిరస్సు అయిన ఆయనకు లోబడి ఉండాలంటే, సంఘానికి సువార్త ప్రకటించడం అనేది ఎప్పుడూ ఒక ప్రత్యామ్నాయం కాదు. ప్రాణం ఉన్న ప్రతి మనిషికి సువార్తను ప్రకటించమని సంఘాన్ని ఆయన ఆదేశించాడు.

చారిత్రాత్మక క్రైస్తవ్యం ఎదుర్కోవలసిన గొప్ప అపవాదులలో

ఒకటి, ఈ ఆజ్ఞకు విధేయత చూపడంలో సంఘం ఎంతో అయిష్టాన్ని ప్రదర్శించడమే. ఈ రోజు ప్రపంచంలో లక్షలాది మందికి యేసుక్రీస్తు గురించి అస్సలు తెలియదు. మనం ఈ మహా ఆదేశాన్ని నెరవేర్చలేదు. సంఘంగా మనం నిర్వర్తించవలసిన బాధ్యతను మనం నిర్వర్తించలేదు.

ఆర్టికల్ 5 యొక్క తిరస్కరణ ఇలా చెబుతుంది: “ప్రజలు ఏ జాతికి చెందినవారైనా ఏ సమూహానికి చెందినవారైనా వారి సంస్కృతి ఏదైనా సువార్తను ప్రకటించేటప్పుడు వాటిని పట్టించుకోకుండా మనం సువార్తను ప్రకటించాలి. దీనికి విరుద్ధమైన ప్రతి భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము.” వివిధ సంఘాలు తరచుగా జాతి, సంస్కృతి, సామాజిక వర్గం, ఆర్థిక స్థితి, నేపథ్యం వంటి అంశాలను బట్టి, తమకు దగ్గరగా ఉండే వ్యక్తులపై దృష్టిపెడతాయి. మనం తరచుగా మనకు తెలిసిన మార్గంలోనే వెళ్తాము. మనలాంటి వ్యక్తులపైనే మన సువార్త పరిచర్యను కేంద్రీకరించే ధోరణి మనలో ఉంటుంది. అయితే ఆర్టికల్ 5 యొక్క తిరస్కరణ మనం అలా పక్షపాతం చూపించకూడదని చెబుతోంది. ప్రతి నేపథ్యానికి, ప్రతి జాతికి, ప్రతి మతానికి చెందిన ప్రజలకు మనం సువార్తను ప్రకటించాలి. కొన్నిసార్లు మనం ఇతర ప్రపంచ మతాలలో ఉన్నవారికి సువార్త ప్రకటించడానికి ఇష్టపడము. ఎందుకనో వారు సంఘం యొక్క సువార్త పరిచర్యకు అనర్హులని మనం అనుకుంటాం. అయితే దేవుని ప్రజలకు దేవుడు ఇచ్చిన ఆజ్ఞ ఏంటంటే, ఏ భేదమూ లేకుండా ప్రతి భాషకూ ప్రతి దేశానికీ ప్రతి జాతికీ ప్రాణమున్న ప్రతి మనిషికి సువార్తను ప్రకటించడం. ఇది ఒక అద్భుతమైన బాధ్యత. అయితే దీనిని నెరవేర్చడంలో మనం విఫలమయ్యాం.

అధ్యాయం నాలుగు

# దైవ-మానవుడైన యేసు

సువార్తలో ముఖ్యమైన అంశం: యేసుక్రీస్తు యొక్క దైవత్వం. క్రొత్త నిబంధనలో మనం కనుగొన్నట్లుగా సువార్త సారాంశం, యేసుక్రీస్తు దైవ మానవ స్వభావాలపైన ఆయన చేసిన కార్యంపైన కేంద్రీకృతమై ఉంటుంది. మనం క్రీస్తు యొక్క వ్యక్తిత్వానికి (దైవ మానవ స్వభావాలు) ఆయన చేసిన కార్యానికి తేడా చూపిస్తున్నప్పటికీ, వాటిని విడదీయకూడదు. ఆయన దైవ మానవ స్వభావాల్లోని ప్రాముఖ్యత, ఆయన చేసిన కార్యాన్ని విలువైనదిగా, శక్తివంతమైనదిగా చేస్తుంది. ఆయన చేసిన కార్యం ద్వారానే మనం ఆయనెవరో లోతుగా అర్థం చేసుకోగలుగుతాము. కాబట్టి ఆయనెవరో, ఆయన మన కోసం ఏమి సాధించాడో అనే వాటి మధ్య ఒక బలమైన సంబంధం ఉంది. ఇదే ఆరవ ఆర్టికల్లోని ప్రధానాంశం. 6వ ధృవీకరణ ఇలా చెబుతోంది:

> యేసుక్రీస్తు దేవుని వాక్యమని (లేదా లోగోస్, యోహాను 1:1), త్రిత్వంలో రెండవ వ్యక్తి అని, తండ్రి పరిశుద్ధాత్మల మాదిరిగానే నిత్యుడు అని, తండ్రి పరిశుద్ధాత్మలు కలిగి ఉన్న స్వభావాన్నే కలిగినవాడు అని (హెబ్రీ 1:3) విశ్వసించడం సువార్తకు పునాది అని మేము ధృవీకరిస్తున్నాము.
>
> దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:
>
> యేసుక్రీస్తు పరిపూర్ణ దైవత్వాన్ని తగ్గించే, తృణీకరించే అభిప్రాయం రక్షణకు ఉపయోగపడుతుందని చెప్పే భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము.

మనం గమనించిన మొదటి విషయం ఏమిటంటే, యేసును మొదట 'దైవ వాక్యం' అని ధృవీకరించారు. ఇది యోహాను 1వ అధ్యాయాన్ని సూచిస్తుంది. అక్కడ యేసు, నిత్యమైన 'లోగోస్'గా అనగా 'వాక్యం'గా పేర్కొనబడ్డాడు: "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద నుండెను, వాక్యము దేవుడైయుండెను" (యోహాను 1:1). తర్వాత "ఆ వాక్యము శరీరధారియై మన మధ్య నివసించెను" అని చదువుతాము (యోహాను 1:14). ఇది *లోగోస్ క్రీస్తు శాస్త్రం* అని పిలువబడే సిద్ధాంతానికి సంబంధించినది.

యోహాను తన సువార్తలో చెప్పిన దైవ వాక్యం లేదా నిత్య *లోగోస్* అనే భావన క్రైస్తవ చరిత్రలోని మొదటి మూడు శతాబ్దాలలో ఎంతో ప్రాముఖ్యత పొందింది. గ్రీకు తత్వశాస్త్ర సాంప్రదాయాలతో పరిచయం ఉన్నవారు, ప్రాచీన గ్రీకు తత్వశాస్త్రంలో *లోగోస్* అనే పదం యొక్క పూర్తి అర్థాన్ని అర్థం చేసుకున్నారు. *లోగోస్* అనేది విశ్వంలో క్రమాన్ని ఐక్యతను తీసుకొచ్చే ఒక సహజాతీతమైన

నియమం. గ్రీకులకు, *లోగోస్* కేవలం ఒక అర్ధం కాని నియమం మాత్రమే. దీనిని వాళ్లు ఒక వ్యక్తిగా పరిగణించలేదు. యోహాను ఈ పదాన్ని గ్రీకు తత్వశాస్త్రం నుండి తీసుకున్నప్పటికీ, దానిని యథాతథంగా వాడలేదు. బదులుగా ఒక వ్యక్తిత్వం కలిగిన దేవుని గురించిన హెబ్రీ భావనను ఈ పదానికి అతడు ఆపాదించాడు.

యేసు నిత్యుడని మేము ధృవీకరిస్తున్నాము. ఆయనను సృష్టించబడినవానిగా చూపించే అన్ని ప్రయత్నాలను మేము తిరస్కరిస్తున్నాము. 6వ ధృవీకరణ దీన్ని మరింత స్థిరపరుస్తుంది. ఇది క్రీస్తును తండ్రి, పరిశుద్ధాత్మలతో సమానంగా నిత్యుడని, తండ్రి పరిశుద్ధాత్మను కలిగి ఉన్న స్వభావాన్నే కలిగి ఉన్నాడని వివరిస్తుంది. ఇది క్లుప్తంగా త్రిత్వ సిద్ధాంతాన్ని నిర్వచిస్తుంది. ప్రారంభ శతాబ్దాల్లో జరిగిన గొప్ప సంఘ సభలను, ముఖ్యంగా నైసియా సభ, చాల్సెడాన్ సభలను మనకు గుర్తుచేస్తుంది. 4వ శతాబ్దం ప్రారంభంలో ఏరియస్ అనే వ్యక్తి బోధలకు సంబంధించి సంఘం ఎదుర్కొన్న సంక్షోభం కారణంగా, నైసియాలో సమాలోచనసభ జరిగింది. ఈ సభలో నుంచి నైసియా విశ్వాస ప్రమాణం మనకు అందించబడింది. ఏరియస్, తన సహచరులతో కలిసి, త్రిత్వాన్నీ, క్రీస్తు దైవత్వాన్నీ తిరస్కరించాడు. దేవుడు చేసిన మొదటి ప్రాణి క్రీస్తు అని, ఆ తర్వాత క్రీస్తు/*లోగోస్* అనే వ్యక్తి ప్రపంచాన్ని సృష్టించాడని ఏరియస్ వాదించాడు. అయితే *లోగోస్* ప్రపంచానికి సృష్టికర్త అయినప్పటికీ, లోగోస్ కూడా సృష్టించబడిన ఒక ప్రాణి మాత్రమే. అందువల్ల ఆయనకు ఒక ప్రారంభం ఉంది. ఒక సృష్టించబడిన వ్యక్తిగా ఆయన నిశ్చయంగా దేవుని కంటే తక్కువవాడని ఏరియస్ వాదించాడు.

ఈ *లోగోస్* కొన్ని విషయాలలో దేవుని లాంటివాడని ఏరియస్ వాదించాడు. *లోగోస్* "దేవునితో పోలిన స్వభావాన్ని" కలిగి

ఉన్నాడని చెప్పడానికి హోమోయ్ఉఃసియోస్ అనే పదాన్ని అతడు ఉపయోగించాడు. *లోగోస్* తన ఉనికిలో తండ్రిని "పోలిన" స్వభావాన్ని కలిగి ఉన్నాడు కానీ తండ్రి "కలిగివున్న దైవ స్వభావాన్ని" కలిగి లేడని ఏరియస్ అన్నాడు. అంటే *లోగోస్*కు దైవిక ఉనికిలో భాగం లేదు, ఆయన దేవుడు కాదని అర్థం.

4వ శతాబ్దంలో, త్రిత్వ సిద్ధాంతాన్ని విశ్వసించిన సంఘం ఏరియనిజంను ఖండించాయి. త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తులు ఒకే స్వభావాన్ని కలిగి ఉన్నారు అని అర్థం వచ్చే హోమోవూసియోస్ అనే పదాన్ని వాడాలని పట్టుబట్టారు. నాలుగవ శతాబ్దం నుండి త్రిత్వానికి సంబంధించిన సాంప్రదాయ సిద్ధాంతం ఏమిటంటే, దైవత్వంలోని ముగ్గురు వ్యక్తులు (తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ) వేర్వేరు వ్యక్తులు అయినప్పటికీ, వాళ్ల స్వభావం ఒకటే. అందువల్ల 6వ ధృవీకరణలో "దైవ వాక్యమైయున్న వ్యక్తి తండ్రి, పరిశుద్ధాత్మలతో సమానమైన నిత్యత్వాన్ని కలిగినవాడు. తండ్రి పరిశుద్ధాత్మలు కలిగి ఉన్న స్వభావాన్ని కలిగినవాడు" అని చెప్పబడిన మాటకు ఇదే అర్థం. యేసుక్రీస్తు సంపూర్ణ దైవత్వాన్ని అంగీకరించడం, రక్షణార్థమైన విశ్వాసానికి ప్రాథమికమైనది, అవసరమైనది. ఏరియన్లు చేసినట్లుగా ఒక వ్యక్తి క్రీస్తును రక్షణ కోసం ఆశ్రయిస్తూ, అదే సమయంలో ఆయన దైవత్వాన్ని తిరస్కరించకూడదు.

నైసియా, చాల్సిడాన్ సభల తర్వాత ఏరియనిజం పూర్తిగా అంతరించిపోలేదు. చర్చ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ ఆఫ్ లాటర్-డే సెయింట్స్ (మోర్మన్‌లు), యెహోవా సాక్షులు క్రీస్తు దైవత్వాన్ని నిరాకరించడంలో ఏరియనిజం సిద్ధాంతాన్ని అనుసరిస్తారు. ఈ మతాలు యేసుకు ఉన్నతమైన స్థానం ఇచ్చినా, తండ్రితో ఆయనకున్న సహనిత్యత్వాన్ని ఒకే స్వభావాన్ని నిరాకరించడం ద్వారా ఏరియన్ విధానాన్ని పాటిస్తాయి. ఉదాహరణకు, ఈ

లోకం ప్రారంభానికి ముందే క్రీస్తు ఉనికిలో ఉన్నాడని మోర్మన్‌లు నమ్ముతారు. అయితే ఆయన నిత్యత్వాన్ని వాళ్ళు తృణీకరిస్తారు. ఇక్కడే ఏరియనిజంతో వారికున్న సంబంధం స్పష్టమవుతోంది: దేవుడు మొదట క్రీస్తును సృష్టించాడు. ఆ తర్వాత క్రీస్తు లోకాన్ని సృష్టించాడు. కాబట్టి క్రీస్తు లోకానికి ముందు ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ లేడు. ఆయన సృష్టించబడిన ప్రాణిగానే మిగిలిపోయాడు. క్రీస్తు సృష్టి అంతటిలో అత్యంత ఘనత పొందిన వాడైనప్పటికీ ఆయన కేవలం ఒక సృష్టి మాత్రమే.

ఏరియనిజం సంఘం యొక్క దైవశాస్త్రానికి మాత్రమే కాకుండా, దాని ఆరాధనకు కూడా ఒక సమస్యను సృష్టించింది. క్రైస్తవ్యం చారిత్రక యూదా మతం నుండి వచ్చింది. క్రొత్త నిబంధన పాత నిబంధనను తిరస్కరించదు. సృష్టించబడిన ఏ ప్రాణినైనా ఆరాధించడాన్ని స్పష్టంగా పాత నిబంధన నిషేధించింది. సృష్టించబడినది ఎంత ఉన్నతమైనదైనా సరే దానిని ఆరాధించడం విగ్రహారాధనే అవుతుంది. ఈ కారణంగానే యేసు ఒక ఉన్నతమైన దూత అని చెప్పే ఆలోచనను క్రొత్త నిబంధనలోని కొలస్సీ, హెబ్రీ వంటి పత్రికలు చాలా తీవ్రంగా ఖండించాయి. దేవదూతల కంటే క్రీస్తు ఉన్నతుడని, నిజంగా తండ్రి పరిశుద్ధాత్మలు కలిగి ఉన్న దైవ స్వభావాన్నే ఆయన కలిగి ఉన్నాడని లేఖనాలు స్పష్టంగా చెబుతున్నాయి.

క్రైస్తవ సువార్తకు క్రీస్తు దైవత్వం ఎంత ముఖ్యమో, ఆయన మానవత్వం కూడా అంతే ముఖ్యం. మనం దీనిని ధృవీకరణ 7 లో చూడవచ్చు:

> యేసుక్రీస్తు శరీరధారియైన దేవుడు అని మేము ధృవీకరిస్తున్నాము (యోహాను 1:14). దావీదు

> వంశంలో కన్యకకు ఆయన జన్మించాడు (రోమా 1:3), ఆయన నిజమైన మానవ స్వభావం కలిగినవాడై దేవుని ధర్మశాస్త్రానికి లోబడ్డాడు (గలతీ. 4:5), పాపం విషయంలో తప్ప అన్ని విషయాల్లో మనలాగే ఉన్నాడు (హెబ్రీ. 2:17; 7:26–28). సువార్తను నమ్మడానికి క్రీస్తు యొక్క నిజమైన మానవత్వంపై విశ్వాసముంచడం చాలా ముఖ్యమని మేము ధృవీకరిస్తున్నాము.
>
> దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:
>
> క్రీస్తు మానవత్వాన్ని, ఆయన శరీరధారణనూ పాపము లేని స్వభావాన్నీ తిరస్కరిస్తూ ఈ సత్యాలు సువార్తకు ముఖ్యమైనవి కాదని నమ్మేవారు కూడా రక్షణ పొందగలరు అనే భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము (1 యోహాను 4:2–3).

ఐదవ శతాబ్దంలో జరిగిన చాల్సిడాన్ సభలో, క్రీస్తు నిజమైన మానవుడు, నిజమైన దేవుడు అని, ఆయనకు రెండు విభిన్న స్వభావాలు ఉన్నాయని (అనగా మానవ స్వభావం, దైవిక స్వభావం ఉన్నాయని) సంఘం అంగీకరించింది. 4వ శతాబ్దంలో సంఘం, క్రీస్తు యొక్క దైవ స్వభావాన్ని ఎంతో జాగ్రత్తగా ధృవీకరించింది. ఆయన దైవత్వం మాదిరిగానే ఆయన మానవత్వాన్ని ప్రకటించడం కూడా అంతే ముఖ్యం. ఆయన మానవత్వంలోనే క్రీస్తు మన మానవ ప్రతినిధిగా కొత్త ఆదాముగా మారాడు. ఆయన ధర్మశాస్త్రానికి లోబడి, పరిపూర్ణమైన నీతి జీవితాన్ని జీవించి, మన పాపాలకు ప్రాయశ్చిత్తంగా తనను తాను బలిగా సిలువపై అర్పించుకున్నాడు.

ఆయన చేసిన విమోచనా కార్యానికి ఆయన మానవత్వంలో పరిపూర్ణమైన జీవితాన్ని పాపములేని జీవితాన్ని జీవించడం చాలా కీలకం. మనకు రక్షకునిగా ఉండే అర్హత పొందాలంటే, యేసు పాపం లేనివాడై ఉండాలి. యేసు సంపూర్ణ విధేయతగల జీవితాన్ని గడపాలి. ఒకవేళ ఆయన పాపం చేసి ఉంటే, ఆయన మన కోసం, మన పాపాల కోసం ప్రాయశ్చిత్తం జరిగించడం అటుంచితే, కనీసం ఆయన తన కోసం కూడా ప్రాయశ్చిత్తం చేయడానికి అర్హత పొందలేడు. ఈ విధంగా క్రీస్తు యొక్క పాపములేని జీవితం మన విమోచనా కార్యానికి ఎలా ముడిపడి ఉందో మనం చూడవచ్చు.

శరీరధారిగా వచ్చిన దేవుడే యేసు అని ఇక్కడ ధృవీకరించబడింది. “ఆ వాక్యము శరీరధారియై, మన మధ్య నివసించెను” అనే వాక్యాన్ని మనం గుర్తుచేసుకుందాం (యోహాను 1:14). ఆయన ఇమ్మానుయేలు, అంటే మనతో ఉన్న దేవుడు. ఆయన కన్యకకు పుట్టిన దావీదు సంతతి. అవును, క్రీస్తు లోకంలోకి వచ్చిన విధానం అద్భుతమైనది. అయితే మానవ స్వభావం ప్రకారం, ఆయన దావీదు వంశానికి చెందినవాడు.

కొత్త నిబంధన యేసును దావీదు కుమారునిగా, అదే సమయంలో దావీదుకు ప్రభువుగా పేర్కొనడం మన గమనాన్ని ఆకర్షిస్తుంది. కీర్తన 110:1 ఇలా చెబుతుంది: “ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నా కుడి పార్శ్వమున కూర్చుండుము.” దావీదు వంశం నుండి వచ్చిన ఈయన, అదే సమయంలో దావీదుకు ప్రభువు కూడా. బైబిల్ ప్రకారం, ఆయనను దావీదు యొక్క గొప్ప కుమారుడని పిలుస్తారు. కొత్త నిబంధనలో క్రీస్తు, దావీదు వంశీయుడై ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే పాత నిబంధనలోని మెస్సియా గురించిన ప్రవచనాలు, మెస్సియా

దావీదు వంటి రాజుగా ఉంటాడని, యూదా గోత్రం నుండి రావాలని చెప్పాయి. యాకోబు తన కుమారులకు ఇచ్చిన పితృస్వామ్య ఆశీర్వాదాలలోనే, రాజ్యము యూదా గోత్రానికి వాగ్దానం చేయబడింది (ఆది. 49:10). యేసు తన మానవ వంశావళి ప్రకారం, యూదా గోత్రానికి చెందినవాడు అని కొత్త నిబంధన స్పష్టం చేస్తున్నది. అందువల్ల ఆయన యూదా గోత్రపు సింహంగా, రాజులకు రాజుగా, ప్రభువులకు ప్రభువుగా ఉండటానికి అర్హత పొందాడు. ఈ విధంగా పాత నిబంధనలోని మెస్సియా గురించిన ప్రవచనాలను ఆయన నెరవేర్చాడు.

క్రైస్తవ సిద్ధాంతం ప్రకారం, క్రీస్తు మానవత్వాన్ని, ఆయన శరీరధారణను, ఆయన పాపము లేని జీవితాన్ని తిరస్కరించే వ్యక్తులు రక్షణ పొందలేరని 7వ ఆర్టికల్ స్పష్టంగా చెబుతున్నది. ఇది చాలా బలమైన తిరస్కరణ. ఎందుకంటే యేసు మానవత్వాన్ని అంగీకరించడం రక్షణకు ఎంత ముఖ్యమో ఇది నొక్కిచెబుతున్నది. ఈ డాక్యుమెంట్ యొక్క రచయితలు, సంఘం ఎదుర్కొన్న తొలి అబద్ధ బోధలలో ఒకదాన్ని దృష్టిలో పెట్టుకున్నారు. ఈ బోధ, క్రొత్త నిబంధనలోనే ప్రస్తావించబడింది. అదే డోసెటిజం అనే తప్పుడు బోధ. దీనిని నమ్మే వారు భౌతిక ప్రపంచం పట్ల ప్రతికూల దృక్పథంతో ప్రభావితమైన వారు., యేసుకు నిజమైన మానవ శరీరం ఉందని వీరు నమ్మలేదు. భౌతికమైనది సహజంగానే అసంపూర్ణమైనది కాబట్టి, దేవుడు మానవ శరీరంతో రావడం అసాధ్యమని వారు నమ్మారు. గ్రీకులకు నిజమైన అడ్డుబండ, పునరుత్థానం కాదు; శరీరధారణ.

తన పత్రికలలో, క్రీస్తు-విరోధి యొక్క ఆత్మ గురించి చాలా గట్టిగా యోహాను మాట్లాడాడు. యోహానుకు, ఇతర కొత్త నిబంధన రచయితలకు, దేవుని నిజమైన శరీరధారణను, యేసు యొక్క నిజమైన మానవత్వాన్ని తిరస్కరించేవారు ఎవరైనా

క్రీస్తు విరోధే. కొత్త నిబంధన యేసు యొక్క మానవ స్వభావాన్ని నొక్కిచెబుతున్నది. అందువల్ల ఈ డాక్యుమెంటును రూపొందించిన రచయితలు క్రీస్తు దైవత్వం గురించి, మానవత్వం గురించి ధృవీకరిస్తున్నారు. 5వ ఆర్టికల్ క్రీస్తు ఒక్కడే దేవునికి, మనుషులకు మధ్యవర్తి అని చెప్పింది. ఎందుకంటే కేవలం ఆయనకు మాత్రమే దైవత్వం, మానవత్వం అనే రెండు స్వభావాలు ఉన్నాయి.

చాలా శతాబ్దాలుగా క్రైస్తవ చరిత్రలో క్రీస్తు దైవత్వంపై అనేక దాడులు జరిగాయి. 4వ శతాబ్దంలో ఏరియన్ వివాదం ప్రారంభమైంది. తరువాత 5వ శతాబ్దంలో చాల్సిడాన్ సభ (క్రీ.శ. 451) జరిగింది. 19వ శతాబ్దంలో, క్రీస్తు దైవత్వంతో సహా అన్ని అద్భుతాలను తృణీకరించే ఉదారవాద మత సిద్ధాంతాలు వచ్చాయి. ఇవి 20వ శతాబ్దంలో కూడా అలాగే కొనసాగాయి. 19వ శతాబ్దపు ఉదారవాదం యొక్క ప్రభావం మన కాలంలోని ప్రధాన సంఘాలపై పడటం వల్ల, క్రీస్తు దైవత్వాన్ని పూర్తిగా అంగీకరించడం సంఘం ఎదుర్కొంటున్న ప్రధాన వివాదాలలో ఒకటిగా మారింది. క్రీస్తు దైవత్వం దాడికి గురైవుతున్న సంఘ చరిత్రలోని యుగాలలో ఒకటైన ప్రస్తుత కాలంలో మనం జీవిస్తున్నామని అర్థం చేసుకోవాలి. క్రీస్తును కేవలం ఒక మానవుడిగా తగ్గించేవారిని ఎదుర్కోవడానికి మనం క్రీస్తు దైవత్వాన్ని నిశ్చయంగా చెప్పాలి. అదే సమయంలో, మనం ఆయన మానవత్వాన్ని విస్మరించకుండా జాగ్రత్తపడాలి. ఆయన దైవత్వం, మానవత్వం రెండింటినీ సమతుల్యంగా నమ్మి తీరాలి, ప్రకటించి తీరాలి.

అధ్యాయం ఐదు

# పరిపూర్ణమైన బలి అర్పణ

కొత్త నిబంధన సువార్త యొక్క సారాంశం సిలువ సందేశంలో ఉంది. క్రీస్తు తన మరణం ద్వారా, దేవునికి ఆయనను నమ్ముకున్న వారందరికీ మధ్య సమాధానాన్ని కలుగజేసే ఒక కార్యాన్ని చేశాడు. అందుకే యేసుక్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని అపోస్తలుడైన పౌలు నిశ్చయించుకున్నాడు (1 కొరింథీ 2:2). ఇది ఆర్టికల్ 8లోని ప్రధాన అంశం. ధృవీకరణ 8 ఇలా చెప్పుతుంది:

> దేవుని నిత్య ప్రణాళిక ప్రకారం, క్రీస్తు తన విధేయత ద్వారా పరిపూర్ణమైన బలిని అర్పించి, మన పాపాలకు

ప్రాయశ్చిత్తం చేశాడు. తద్వారా తండ్రిని శాంతింపజేసి, మన తరపున దేవుని న్యాయాన్ని సంతృప్తిపరిచాడు. క్రీస్తు చేసిన ఈ ప్రాయశ్చిత్తం సువార్తలో ఒక ముఖ్యమైన అంశమని మేము ధృవీకరిస్తున్నాము.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:

క్రీస్తు జరిగించిన ప్రాయశ్చిత్తబలి, విశ్వాసుల నిమిత్తం దేవుని న్యాయాన్ని సంపూర్ణంగా సంతృప్తిపరచింది. సువార్త గురించి బైబిల్ చేసే ఉపదేశానికి ఈ మాట అనుగుణంగానే ఉంది. ఈ సత్యాన్ని తృణీకరించే ఏ భావజలాన్నైనా మేము తిరస్కరిస్తున్నాము.

ప్రాయశ్చిత్తం అంటే పాపానికి చెల్లించే వెల. మనం వ్యక్తిగతంగా ఈ వెల చెల్లించలేము, ఎందుకంటే దేవుని న్యాయమైన డిమాండ్లను సంతృప్తిపరచగల ఏ రకమైన బలి అర్పణను ఆయనకు అర్పించే సామర్థ్యం మనకు లేదు. దేవుని స్వభావమే ప్రాయశ్చిత్తబలిని ఆవశ్యకమైనదిగా చేస్తుంది, ఎందుకంటే దేవుడు పూర్తిగా న్యాయవంతుడు. ఆయన ఎంత న్యాయవంతుడు అంటే, ఆయన పాపాన్ని చూసీ చూడనట్లుగా వదిలివేయడు. ఆయన తన సొంత యథార్థత పట్ల నీతి పట్ల తనకున్న నిబద్ధతను వదులుకోడు. మనం ముందు చూసినట్లుగా, సువార్త మంచి వార్త అవడానికి కారణం, ఇది ప్రతి మానవుడు ఎదుర్కొనే అతి ముఖ్యమైన గందరగోళానికి జవాబు ఇస్తుంది: మనం పాపులం కాబట్టి, మనం న్యాయవంతులము కాదు, నీతిమంతులము కాదు. దేవుడు మారనివాడు. ఆయన శాశ్వతంగా న్యాయవంతుడు,

నీతిమంతుడు. కాబట్టి ప్రశ్న ఏమిటంటే, అన్యాయస్తుడైన మానవునికి న్యాయవంతుడైన పవిత్రుడైన దేవుని తీర్పు నుండి బయటపడగలననే నిరీక్షణ ఎక్కడుంది?

ఈ సమస్యకు పరిష్కారం దేవుని శాశ్వత ప్రణాళికలో ఉంది. ఈ ప్రణాళికలో ఆయన తన ప్రజల పాపాలు కప్పబడే విధంగా, తన సొంత న్యాయం సంతృప్తి చెందే విధంగా రక్షణ మార్గాన్ని అందించాడు. దేవుడు తన సొంత నీతి విషయంలో రాజీపడడు. సువార్తలో, దేవుడు తాను నీతిమంతుడును, భక్తి హీనులను నీతిమంతులుగా తీర్చేవాడిలా తనను తాను బయలుపరచుకున్నాడు (రోమా 3:25-26). ఇక్కడ ముఖ్యంగా పరిగణించవలసిన కార్యం ఏమిటంటే, తన ప్రజల కోసం ప్రాయశ్చిత్తం చేయడానికి క్రీస్తు సిలువపై చేసిన కార్యం. క్రీస్తు విధేయతతో అర్పించిన ఈ ప్రాయశ్చిత్తం, తండ్రి ఉగ్రతను చల్లార్చి, మన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసి, దైవిక న్యాయాన్ని సంతృప్తిపరిచే ఒక పరిపూర్ణమైన బలి.

ప్రాయశ్చిత్తం గురించి చర్చించేటప్పుడు తరచుగా ప్రస్తావనకు వచ్చే రెండు పదాలు *ఎక్స్పియేషన్ (పాపపరిహారం)*, *ప్రొపిషియేషన్ (శాంతింపజేయుట)*. *ఎక్స్పియేషన్* అంటే మన నుండి పాపాలను తొలగించడం. పాత నిబంధనలో ప్రాయశ్చిత్త దినాన, జంతువులను బలి ఇచ్చేవారు (లేవీ. 16). నిజానికి, ప్రధాన యాజకుడు ప్రాయశ్చిత్త బలి అర్పించడానికి ముందు, తన శుద్ధీకరణ కోసం అనేక జంతువులను బలి ఇవ్వాలి. ఆ తర్వాత యాజకుడు మేక తలపై (బలిపశువు) తన చేతులుంచి, ఆ మేకను శిబిరం నుండి, అంటే దేవుని సన్నిధి నుండి దూరంగా అరణ్యంలోకి పంపేవాడు. ఇది ప్రజల పాపాలు దేవుని సన్నిధి నుండి తొలగించబడడాన్ని సూచిస్తుంది. దీనినే మనం పాప క్షమాపణ అని పిలుస్తాం, అంటే

పాపం దూరమైపోవడం.

"మన అపరాధాలను ఆయన మన నుండి పడమటికి తూర్పు ఎంత దూరమో అంత దూరపరచి యున్నాడు" (కీర్తన 103:12). ఇటువంటి భాషను "పాప పరిహారం" అనే ఆలోచనను తెలియజేయడానికి బైబిల్ ఉపయోగిస్తుంది. కాబట్టి మన పాపాలు తొలగించబడే కార్యం నెరవేర్చబడుతుంది, ఎందుకంటే దేవుడు మన అపరాధాన్ని, పాపాన్ని చట్టబద్ధంగా మన ఖాతా నుండి మన పాపాలను మోసే క్రీస్తుకు బదిలీ చేస్తాడు. సిలువ గురించి నూతన నిబంధన యొక్క అపోస్తలుల అభిప్రాయాన్ని అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన లేఖనం యెషయా 53. ఇది తన ప్రజల అతిక్రమాన్ని భరించే ప్రభువు సేవకుని గురించి చెబుతుంది. మన పాపాలను ఆయన మీద మోపి ఆయనను నలగగొట్టుటకు, శిక్షించుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఇదే పాప పరిహారం, అనగా మన పాపాలు మన ఖాతా నుండి క్రీస్తుకు బదిలీ చేయబడ్డాయి. సిలువపై, క్రీస్తు మన స్థానంలో తనను తాను పరిపూర్ణమైన బలిగా అర్పించుకుని, మనకు రావలసిన శిక్షను ఆయన తనపై వేసుకున్నాడు.

పాత నిబంధనలో, దేవుని ధర్మశాస్త్రాన్ని ఉల్లంఘించడం అంటే ఆయన శాపం కిందకు రావడమే. అదే విధంగా మనం దేవునికి విరుద్ధంగా పాపం చేసినప్పుడు, ఆయన శాపం కిందకు, అంటే దుష్టత్వంపై ఆయన ఇచ్చే తీర్పు కిందకు వస్తాము. మనంతట మనమే ఆయన తీర్పును ఎదుర్కొనవలసి వస్తే, మనం దేవుని ఉగ్రతకు పూర్తిగా లోనవుతాము. అయితే గలతీ పత్రికలో పౌలు మన శాపాన్ని క్రీస్తు ఆయనపై వేసుకున్నాడని చెబుతున్నాడు (గలతీ. 3:13). ఆయన మనకు ప్రత్యామ్నాయంగా ఈ కార్యం చేశాడు. మనకు రావలసిన శాపాన్ని మన స్థానంలో యేసు

భరించాడు. దీని అర్థం, ఇంతకు ముందు తిరస్కరణ చెప్పినట్లుగా, క్రీస్తు మన *బదులుగా* ప్రాయశ్చిత్తం చేశాడు. ఈ వెల అసలైన అపరాధి కాకుండా, ఒక ప్రతినిధి ద్వారా చెల్లించబడుతుంది. చట్టపరమైన కోణం నుండి చూస్తే, మనమందరం దేవునికి విరుద్ధంగా పాపం చేసి, ఆయన పరిపూర్ణతను బట్టి ఒక రుణాన్ని, ఒక నైతిక రుణాన్ని పోగుచేసుకున్నాము. మనం మన రుణాలను తిరిగి చెల్లించలేని రుణస్తులం.

మనం *డబ్బుకు సంబంధించిన రుణం* అని పిలిచే దానికి, *నైతిక* రుణం అని పిలిచే దానికి మధ్య వ్యత్యాసం ఉంది. ద్రవ్య రుణం అంటే మనం ప్రజలకు డబ్బు బాకీ పడినప్పుడు వచ్చేది. ప్రభువు తన శిష్యులకు నేర్పించిన ప్రార్థనలో "మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము" అని ఉంది (మత్తయి 6:12). ఈ మాటను చెప్పినప్పుడు మనం డబ్బు గురించి కాదు, నైతిక రుణాల గురించి మాట్లాడుతున్నాము. దీనికి నాకు ఇష్టమైన ఉదాహరణ ఒకటి ఉంది. ఒక చిన్న అబ్బాయి ఐస్క్రీం పార్లర్‌లోకి వెళ్లి, రెండు స్కూప్‌ల చాక్లెట్ ఐస్క్రీం అడుగుతాడు. సర్వర్ అతనికి కోన్‌ను ఇచ్చి, "రెండు డాలర్లు అవుతుంది" అని చెబుతుంది. ఆ బాలుడు తన జేబులో చేయి పెట్టి, ఒక డాలర్ బిల్లు తీసి, "మా అమ్మ నాకు ఒక డాలర్ మాత్రమే ఇచ్చింది" అని చెప్పడంతో అతని ముఖంలో నిరాశ కనిపిస్తుంది. అతడు మొత్తం డబ్బు చెల్లించలేడు, కాబట్టి అతడు చెల్లించాల్సిన మొత్తం ఇంకా అలాగే అప్పుగా మిగిలిపోతుంది. ఇది గమనించి, నేను జోక్యం చేసుకుని ఆ అబ్బాయి తరపున సర్వర్‌కు ఒక డాలర్ ఇచ్చానని అనుకోండి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, అప్పు ఇప్పుడు చెల్లించబడింది. అయితే నా డబ్బును సర్వర్ తీసుకోవాలా? అవును. నేను ఆ పిల్లవాడు చెల్లించాల్సిన డబ్బును అతని

తరుపున ఇస్తున్నాను. ఇప్పుడు ఆ అప్పు చెల్లించబడినందున సర్వర్ తప్పనిసరిగా ఆ చెల్లింపును తీసుకోవాలి. అప్పు ఎవరి పేరు మీద ఉందో ఆ వ్యక్తి తరపున చెల్లింపు జరిగితే, ఎవరు చెల్లించారు అనేది ముఖ్యం కాదు.

మరొక సందర్భాన్ని ఊహించుకోండి. నేను దుకాణంలో నిలబడి ఉన్నాను. సర్వర్ కిచెన్లో ఉంది. ఆ చిన్న అబ్బాయి పరిగెత్తుకుంటూ వచ్చి, కౌంటర్ వెనుకకు వెళ్లి, రెండు స్కూప్‌ల ఐస్‌క్రీమ్‌ను తీసుకుని, కోన్‌లో పెట్టుకుని, డబ్బు చెల్లించకుండా బయటకు పారిపోవడానికి ప్రయత్నిస్తాడు. సర్వర్ అతణ్ణి పట్టుకుని, "ఏం చేస్తున్నావు?" అని అడుగుతుంది. ఆ అబ్బాయి ఐస్‌క్రీమ్ దొంగిలించాడు కాబట్టి, ఆమె పోలీసులకు ఫోన్ చేస్తుంది. ఒక పోలీస్ అధికారి వచ్చి, ఆ సర్వర్ ఆ చిన్న అబ్బాయి ఐస్‌క్రీం దొంగిలిస్తుండగా పట్టుకున్నానని వివరిస్తుంది. ఇదంతా చూసిన తర్వాత, నేను "నా దగ్గర రెండు డాలర్లు ఉన్నాయి. నేను ఆ రెండు డాలర్లు చెల్లిస్తాను, దీన్ని ఇక్కడితో మర్చిపోదాం" అని అంటాను. ఆ సర్వర్ ఆ పరిష్కారాన్ని అంగీకరించడానికి బాధ్యత వహిస్తుందా? లేదు. ఎందుకంటే ఇక్కడ కేవలం ఆర్థిక రుణం మాత్రమే కాదు, నైతిక రుణం కూడా ఉంది. ఎవరైనా తప్పు చేసినప్పుడు, వారి తరపున ఒక ప్రతినిధి శిక్షను భరించడానికి ముందుకు రావచ్చు. అయితే నష్టపోయిన వ్యక్తికి ఆ ప్రత్యామ్నాయ చెల్లింపును అంగీకరించాలా వద్దా అని నిర్ణయించుకునే హక్కు ఉంటుంది.

క్రీస్తు ప్రాయశ్చిత్తంలో, తండ్రి తన కుమారుడు అర్పించిన బలిని అంగీకరించాడు. ఆయన న్యాయం పూర్తిగా సంతృప్తి చెందింది. *పాపపరిహారం (ఎక్స్పియేషన్)* అనేది మన నుండి మన పాపాలను తొలగించడం లేదా క్షమించడం గురించినది కాగా, *ప్రాయశ్చిత్తం (ప్రొపిషియేషన్)* అనేది దేవునితో మన సంబంధానికి

సంబంధించినది. ఈ ప్రాయశ్చిత్తం ద్వారా దేవుని నీతియుక్తమైన డిమాండ్లను క్రీస్తు, దేవునికి తృప్తి కలిగేలా నెరవేర్చాడు. ప్రాయశ్చిత్తం ద్వారా క్రీస్తు, దేవుని డిమాండ్లను పూర్తిగా నెరవేర్చాడు. దీనివల్ల, ప్రాయశ్చిత్తం చేసిన యేసు ఎవరికైతే ప్రాతినిధ్యం వహిస్తాడో వారందరికీ క్రీస్తు జరిగించిన విమోచనా కార్యపు ప్రయోజనాలను అందించడానికి దేవునికి సాధ్యమవుతుంది.

"క్రీస్తు జరిగించిన ప్రాయశ్చిత్తబలి దేవుని న్యాయాన్ని సంతృప్తిపరచింది. క్రీస్తును నమ్మేవారికి ప్రత్యామ్నాయంగా వెల చెల్లించింది" అనే సత్యాలను తిరస్కరించే ప్రాయశ్చిత్తం గురించిన సిద్ధాంతాలు సంఘ చరిత్రలో అనేకం వచ్చాయి. కొన్ని సిద్ధాంతాలు ప్రాయశ్చిత్తాన్ని కేవలం మానవ త్యాగానికి ఒక ఉదాహరణగా, పాపం విషయంలోనూ నీతి విషయంలోనూ దేవుడు ఎంత తీవ్రంగా ఉంటాడో లోకానికి చూపించడానికి దేవుడు ఇచ్చిన ఒక పాఠంగా మాత్రమే చూసాయి. అయితే ఆర్టికల్ 8 లోని తిరస్కరణ, ఈ అబద్ధపు సిద్ధాంతాలను ఖండిస్తూ, క్రీస్తు జరిగించిన ప్రాయశ్చిత్తబలి తన ప్రజలకు ప్రత్యామ్నాయంగా చేసినదనీ దేవుని న్యాయాన్ని సంతృప్తిపరచిందనీ ధృవీకరిస్తుంది.

ప్రాయశ్చిత్తం గురించి చర్చించిన తర్వాత, మన ధృవీకరణల డాక్యుమెంట్ మన రక్షణకు సంబంధించిన మరొక ముఖ్యమైన సత్యాన్ని తెలియజేస్తుంది. దీనినే ద్వంద్వ ఆరోపణ (double imputation) అంటారు. ధృవీకరణ 9 ఇలా చెప్పుతుంది:

> క్రీస్తు మన పక్షంగా చేసిన రక్షణ కార్యంలో ఆయన జీవితం మరణం రెండూ ఉన్నాయి అని మేము ధృవీకరిస్తున్నాము (గలతీ. 3:13). మన పక్షంగా దేవుని ధర్మశాస్త్రంలోని అన్ని ఆజ్ఞలను నెరవేర్చిన క్రీస్తు యొక్క పరిపూర్ణ విధేయతపై

విశ్వాసముంచడం సువార్తకు చాలా ముఖ్యమని మేము ప్రకటిస్తున్నాము.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా రాయబడి ఉంది:

క్రీస్తు నెరవేర్చిన పరిపూర్ణ నీతి జీవితాన్ని గురించి ప్రస్తావించకుండా, కేవలం క్రీస్తు మరణం ద్వారా మాత్రమే రక్షణ వస్తుందని భావించడాన్ని మేము తిరస్కరిస్తున్నాము.

ఒక వైపు, దేవుడు మన అపరాధాన్ని పాపాన్ని మనకు బదులుగా క్రీస్తుకు బదిలీ చేశాడు. ఇంకోలా చెప్పాలంటే, ఆయన ఖాతాలోకి జమచేశాడు. దానికి తోడు, క్రీస్తు తన పరిపూర్ణ విధేయత గల జీవితంలో పొందిన యోగ్యతనూ నీతినీ మన ఖాతాకు దేవుడు బదిలీ చేస్తాడు. అప్పుడే మన రక్షణ పూర్తవుతుంది. కాబట్టి సువార్త అనేది కేవలం క్రీస్తు మరణం గురించిన సందేశం మాత్రమే కాదు, అది క్రీస్తు జీవితం గురించిన సందేశం కూడా. మన రక్షణకు క్రీస్తు జీవితం, మరణం రెండూ అవసరమే. క్రీస్తు గుడ్ ఫ్రైడే నాడు భూమి మీదకి వచ్చి, మరణించి, తిరిగి పరలోకానికి వెళ్ళడం వలన మనకు రక్షణ రాలేదు. బదులుగా ఆయన ఒక స్త్రీకి జన్మించి, తన జీవిత ప్రారంభం నుండి మరణం వరకు ధర్మశాస్త్రంలోని ప్రతి అంశానికి లోబడ్డాడు. ఆయనే దేవుని నిబంధనా జనులకు నిజమైన ప్రతినిధి, చివరి ఆదాము. మానవజాతికి ప్రతినిధియైన మొదటి ఆదాము చూపిన అవిధేయత వలన లోకంలోకి మరణం, దాని వినాశకర పరిణామాలు వచ్చాయి. అలాగే చివరి ఆదాము చూపిన విధేయత ద్వారా మనం స్వస్థత పొంది, దేవునితో

సమాధానపడగలమని నూతన నిబంధన చెబుతుంది (1 కొరింథీ. 15:21-22, 45).

క్రీస్తు మరణం ద్వారా పాపానికి న్యాయంగా రావాల్సిన తీర్పు/శిక్ష పూర్తిగా విధించబడింది. అయితే ఆయన జీవితం ద్వారా పరలోకం చేరుకోవడానికి అవసరమైన నీతి యోగ్యతలు సాధించబడ్డాయి. మనకు ఈ రెండూ అవసరమే. మన అపరాధాన్ని తొలగించేది ఒకటి కావాలి. ఆ ప్రాయశ్చిత్తం అదే చేస్తుంది. ఒకవేళ క్రీస్తు కేవలం ఈ కార్యం మాత్రమే చేసి ఉంటే, మనం మళ్ళీ మొదటికే వచ్చేవాళ్ళం. అది మనకు నిర్దోషత్వాన్ని ఇచ్చి ఉండేది కానీ, నీతిని ఇచ్చి ఉండేది కాదు. నీతి అనేది సాధించవలసినది. దాన్ని మనం సొంతంగా సాధించలేము. అందుకే క్రీస్తు మనకోసం చనిపోయాడని మాత్రమే కాకుండా, మనకోసం జీవించాడని కూడా సువార్త చెబుతుంది. మన అపరాధాన్ని తండ్రి క్రీస్తుకు ఆపాదించడంతో దానిని ఆయన తీసుకుంటాడు. క్రీస్తు యోగ్యతను మనకు ఆపాదించడం ద్వారా నీతిని మనకిస్తాడు.

మన పక్షంగా దేవుని ధర్మశాస్త్రంలోని అన్ని ఆజ్ఞలను నెరవేర్చిన క్రీస్తు యొక్క పరిపూర్ణ విధేయతపై విశ్వాసముంచడం రక్షణకు చాలా అవసరం. మనం క్రీస్తుపై విశ్వాసముంచినప్పుడు, ఆయన దైవ మానవ స్వభావాలనే కాకుండా మన కోసం ఆయన చేసిన కార్యంలో కూడా నమ్మకం ఉంచుతాము. సువార్తను నమ్మడం అంటే, మన సొంత నీతితో దేవుని న్యాయాన్ని ఎన్నటికీ సంతృప్తిపరచలేమని గుర్తించి, దానికి బదులుగా క్రీస్తు తన మరణం ద్వారా అలాగే తన జీవితం ద్వారా మనకోసం చేసిన వాటిపై పూర్తి నమ్మకముంచడం, దానిపై ఆధారపడటం.

సువార్త మనకు చెప్పేది ఏమంటే, యేసుక్రీస్తుపై విశ్వాసం ద్వారా మనం నీతిమంతులుగా తీర్చబడ్డాము. దీని వెనుక నిగూఢంగా

ఉన్న సత్యం ఏమిటంటే, దేవుని ముందు నీతిమంతులుగా తీర్చబడటం అనేది కేవలం క్రియల ద్వారానే సాధ్యం. అయితే ఇది ఎలా సాధ్యం? మనం విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతాము అనే సిద్ధాంతాన్ని గట్టిగా సమర్థించడం లేదా? అయితే నీతిమంతులుగా తీర్చబడటం కేవలం క్రియల ద్వారా ఎలా సాధ్యం? ఎందుకంటే *మనం యేసుక్రీస్తు యొక్క క్రియల* ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డాము. మనం విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డాము అని చెప్పినప్పుడు, దాని అర్థం ఇదే. మనకు బదులుగా వేరొకరు చేసిన క్రియలపై మనం విశ్వాసం ఉంచడమే నీతిమంతులుగా తీర్చబడడానికి ఆధారం. యేసు చేసిన క్రియలే నీతిని, దేవుని వాగ్దానాల ఆశీర్వాదాన్ని సంపాదించాయి. ఆయన సత్క్రియలే ద్వారానే దేవుడు మానవజాతితో చేసుకున్న ఆదిమ నిబంధన నెరవేరింది. ఆదాము తన క్రియలలో విఫలమైన చోట, క్రీస్తు తన క్రియలలో విజయం సాధించాడు. మనం ఆయనపై విశ్వాసముంచినప్పుడు, ఆయన క్రియల ద్వారానే మనం విమోచించబడతాము. చివరికి, క్రియల ఆధారంగా తీర్పు జరుగుతుంది. మనం దేవుని ముందు మన సొంత క్రియల ఆధారంగా లేదా క్రీస్తు క్రియల ఆధారంగా నిలబడతాము. ఒకవేళ మనం మన క్రియల ఆధారంగా నిలబడితే, అది మనకు చెడు వార్త అవుతుంది అని నేను మీకు హామీ ఇస్తున్నాను. క్రీస్తు క్రియల ఆధారంగా మనం నిలబడితే, అప్పుడు మనం సువార్త యొక్క శుభవార్తపై నిలబడినవారమవుతాము.

అధ్యాయం ఆరు

# పునరుత్థానం, నీతిమంతులుగా తీర్చబడుట

క్రొత్త నిబంధనలోని ఆదిమ సంఘం క్రీస్తు సందేశాన్ని ప్రకటించినప్పుడు, ఆ సందేశంలో యేసు జీవితానికి సంబంధించిన సారాంశం ఉంది. ఈ సారాంశంలో సిలువ, ప్రాయశ్చిత్తం, పునరుత్థానం ఉన్నాయి. *"ఆయన తిరిగి లేచాడు"* అనే మాట క్రొత్త నిబంధన సందేశాన్ని, చారిత్రక క్రైస్తవ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి చాలా ముఖ్యం. ఈ విషయం "ది గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్" అనే ధృవీకరణ డాక్యుమెంట్లోని 10వ ఆర్టికల్ లో కూడా ప్రతిబింబిస్తుంది. ధృవీకరణ 10 ఇలా చెప్పుతుంది:

క్రీస్తు శరీరంతో మరణం నుండి తిరిగి లేవడం అనేది వాక్యానుసారమైన సువార్తకు చాలా ముఖ్యం అని మేము నమ్ముతున్నాము (1 కొరింథీ. 15:14).

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా రాయబడి ఉంది:

క్రీస్తు యొక్క దేహము పునరుత్థానం గురించిన చారిత్రక వాస్తవాన్ని నిరాకరించే సువార్తను మేము తిరస్కరిస్తాము.

యేసు పునరుత్థానంలో మనం మొదటగా చూసేది ఏమిటంటే, క్రీస్తు స్వయంగా నిర్దోషిగా నిరూపించబడ్డాడు. స్వభావసిద్ధంగా ఆయన పాపరహితుడు; పాపానికి దేవుడు విధించే శిక్ష మరణం కాబట్టి, మరణానికి క్రీస్తుపై ఎటువంటి హక్కు లేదు. పాపం లేని వ్యక్తిని దేవుడు నిరంతరం శిక్షించడం అన్యాయం అవుతుంది. క్రీస్తు స్వచ్ఛందంగా మన పాపాన్ని తనపై వేసుకున్నాడని మనకు తెలుసు. తన నేరానికి కాదుగాని, మన నేరానికి సిలువపై ఆయన శ్రమను అనుభవించాడు. అయినప్పటికీ దేవుడు పునరుత్థానం ద్వారా తన కుమారుని నిర్దోషత్వాన్ని, నీతిని ప్రకటిస్తున్నాడు. అందుకే మరణం ఆయనను బంధించి ఉంచడం అసాధ్యం అని లేఖనాలు చెబుతున్నాయి (అపొ. కార్య. 2:24). ఎవరూ మరణం నుండి తిరిగి రాలేరు కాబట్టి, పునరుత్థానాన్ని నమ్మలేమని హేతువాదులు అంటారు. అయితే క్రొత్త నిబంధన దీనికి విరుద్ధంగా చెబుతుంది : ఆయన నిర్దోషి కాబట్టి, ఆయన మృతులలో నుండి తిరిగి రాకుండా ఉండడం అసాధ్యం.

సువార్తకు పునరుత్థానం ఇంత ముఖ్యమవ్వడానికి రెండవ కారణం ఏంటంటే, క్రీస్తు మన పాపాల కొరకు ప్రాయశ్చిత్తం చేశాడని, మనం నీతిమంతులుగా తీర్చబడటం కోసం ఆయన మరణం నుండి తిరిగిలేచాడని క్రొత్త నిబంధన ప్రకటిస్తుంది. దేవుని ముందు మనం నీతిమంతులుగా తీర్చబడటం అనేది పూర్తిగా క్రీస్తు చేసిన కార్యంపై ఆధారపడి ఉంది. ఒకవేళ ఆయన పరిపూర్ణమైన నీతి గల జీవితాన్ని గడిపి, చనిపోయి, సమాధిలోనే ఉన్నాడు అనుకుందాం. ఆయన అర్పించిన బలిని తండ్రి అంగీకరించాడని నమ్మడానికి మనకు ఎలాంటి ఆధారమూ ఉండేది కాదు. అయితే పౌలు అరేయొపగు అనే స్థలంలో చేసిన ప్రసంగంలో చెప్పినట్లుగా, తండ్రియైన దేవుడు పునరుత్థానం ద్వారా తన కుమారుణ్ణి నిర్దోషిగా నిరూపించి, ఆయన చేసిన సమాధాన పరిచర్య సత్యమని చూపిస్తున్నాడు (అపొ. కార్య. 17:22–31). మరణం నుండి ఆయనను లేపడం ద్వారా, దేవుడు తన కుమారుడు చేసిన బలితో తాను సంతృప్తి చెందానని సాక్ష్యమిస్తున్నాడు.

మనం విస్మరించకూడని విషయం ఇది. క్రీస్తు పునరుత్థానం గురించి క్రైస్తవులు ఆలోచించినప్పుడు, దాని వల్ల మనకు కలిగే ప్రధాన ప్రయోజనం, మనం కూడా మరణాన్ని జయించి నిత్యం జీవిస్తామనే నిరీక్షణ గురించే ఆలోచిస్తుంటారు. నిస్సందేహంగా, క్రీస్తు కేవలం తన కోసమే కాకుండా, తిరిగి లేవబోయే వారందరిలో ప్రథమ ఫలంగా లేచాడని క్రొత్త నిబంధన మనకు చూపిస్తుంది. ఆయన ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తాడో, వారందరికీ క్రీస్తు పొందిన ఆశీర్వాదాన్ని పంచుతానని దేవుడు వాగ్దానం చేశాడని ఇది రుజువు చేస్తుంది (1 కొరింథీ. 15:23). యేసు పునరుత్థానం ద్వారా నిత్యజీవమనే నిరీక్షణ మనకు నిరూపించబడి, ధృవీకరించబడింది. అయితే మనం మరణాన్ని జయిస్తామనే ఆ అద్భుతమైన

ప్రయోజనం గురించి ఆలోచించేటప్పుడు, పునరుత్థానానికి, మనం నీతిమంతులుగా తీర్చబడటానికి మధ్యనున్న సంబంధాన్ని మనం మర్చిపోకూడదు. మనం మరణాన్ని జయించడానికి కారణం ఏమిటంటే, క్రీస్తు తన ప్రాయశ్చిత్తం ద్వారా పరిపూర్ణ విధేయత ద్వారా సమాధి శక్తిని ఓడించాడు. ఈ విషయంలో, పునరుత్థానం మనం నీతిమంతులుగా తీర్చబడడం నుండి విడదీయరానిది. అందుకే ఇది సువార్తకు అత్యవసరం.

పునరుత్థానం లేదని చెబుతూనే క్రైస్తవ్యాన్ని స్థాపించాలని చూసినవారిని అపొస్తలుడైన పౌలు ఎదుర్కోవలసి వచ్చింది. పునరుత్థానం నిజంగా జరిగింది అని రుజువు చేస్తూ, 1 కొరింథీ 15వ అధ్యాయంలో శక్తివంతంగా అతడు వాదించాడు. పౌలు చెప్పినట్లుగా, పునరుత్థానం లేకపోతే క్రీస్తు కూడా లేపబడలేదు. అప్పుడు దాని ప్రభావం ఏమిటి? దానివల్ల ఏమి జరుగుతుంది? ఈ వాదాన్ని పట్టుకుని, అది ఎలాంటి తార్కికమైన, విషాదకరమైన పరిస్థితికి నడిపిస్తుందో పౌలు వివరించాడు. క్రీస్తు ఇంకా సమాధిలోనే ఉంటే, ఆయనకు ఎవరైనా ఎందుకు విలువనివ్వాలి? పౌలు చెప్పినట్లుగా, క్రీస్తు తిరిగి లేవకపోతే మనం ఇంకా మన పాపాలలోనే ఉండిపోయాం. అంటే మనం నిర్దోషులమని నమ్మడానికి మన దగ్గర ఎలాంటి ఆధారమూ ఉండదు. మనం దేవుని విషయమై అబద్ధ సాక్షులుగా కనబడతాము. క్రీస్తు తిరిగి లేచాడని, ఆయన్ని దేవుడే లేపాడని మనం లోకానికి చెబుతున్నాం. ఒకవేళ ఇది నిజం కాకపోతే మన బోధ, మన విశ్వాసం రెండూ వ్యర్థమే. అప్పుడు మనం మనుషులందరి కంటే దౌర్భాగ్యులమై ఉంటాము. ఇంతకుముందే చనిపోయినవారు కూడా శాశ్వతంగా నశించినట్లే. మనకు మరణం తర్వాత ఎలాంటి నిరీక్షణా ఉండదు.

పునరుత్థానం అనే ముఖ్యమైన వాస్తవాన్ని విస్మరించి, క్రైస్తవ్యాన్ని కేవలం ఒక నైతిక వ్యవస్థగా కుదించడం మూర్ఖత్వం అని పౌలు అంటున్నాడు. గతంలో (4వ, 5వ, 19వ, మరియు 20వ శతాబ్దాలలో) యేసు దేవుడు కాదని కొందరు చెప్పినప్పుడు, వారు పునరుత్థానాన్ని కూడా తీసేసి, క్రైస్తవ్యాన్ని మార్చడానికి ప్రయత్నించారు. నేను చాలా సంవత్సరాలు ఒక బోధకుడి దగ్గర ఉన్నాను. క్రీస్తు నిజమైన చారిత్రక పునరుత్థానాన్ని అతడు నమ్మేవాడు కాదు. దానికి ఒక సాంకేతిక అర్థాన్ని మాత్రమే ఇచ్చి, "క్రొత్త నిబంధనలోని పునరుత్థాన సందేశం ఏమిటంటే, మనం ధైర్యంగా లేచి కొత్త రోజును ఎదుర్కోవచ్చు" అని అతడు చెప్పేవాడు. ఆ మాట నాకు క్రొత్త నిబంధన బోధలా కాకుండా, ఫ్రెడ్రిక్ నీషే అనే తత్వవేత్త చెప్పినట్లుగా అనిపించింది. అందుకే నేను అతనితో అన్నాను: "ఒకవేళ క్రీస్తు నిజంగా సమాధిలోనే ఉండిపోతే, నేను రేపు ఉదయం లేవకుండా పడుకుంటాను. ఇదొక అబద్ధపు నిరీక్షణ ఐతే, నేను క్రైస్తవుడిగా ఉంటూ ఒక్క నిమిషం కూడా సమయాన్ని వృథా చేసుకోదలుచుకోవడం లేదు." నిజమే, పునరుత్థానం నిజం కాకపోతే, అత్యంత దౌర్భాగ్యులలో నేను ఒకణ్ణి అవుతాను. ఎందుకంటే పునరుత్థానుడైన ప్రభువుకు కాక చనిపోయిన యజమానికి సేవ చేయడానికి నా జీవితాన్ని అంకితం చేసాను కాబట్టి!

20వ శతాబ్దంలో, క్రొత్త నిబంధనకు వేరే రకంగా అర్థంచెప్పడానికి ఒక ప్రయత్నం జరిగింది. వారి ప్రకారం, పునరుత్థానం అనేది శిష్యులకు కలిగిన ఒక ముఖ్యమైన అనుభవం మాత్రమే. ఆ అనుభవం ద్వారా, వారికి యేసు ఎవరో, ఆయన రాకడ ఉద్దేశం ఏంటో ఒక్కసారిగా తెలిసింది అంటారు. పునరుత్థానం తర్వాత యేసు కనిపించినట్లు చెప్పే క్రొత్త నిబంధనలోని కథనాలన్నీ కేవలం ఉపమానాలు మాత్రమే. శిష్యులు యేసును కేవలం మనసులో,

ఆలోచనల రూపంలో మాత్రమే చూశారని, ఆయన ఎవరో అప్పుడు గుర్తించారని ఆ కథనాలు సూచిస్తాయి. మరణం నుండి తిరిగి వచ్చిన వ్యక్తిని తమ కళ్ళతో నిజంగా చూసినట్లుగా, వారికి వాస్తవమైన అనుభవం కలగలేదని వారు వాదించారు.

మన ధృవీకరణల డాక్యుమెంట్ ప్రకారం, మీరు క్రీస్తు యొక్క నిజమైన చారిత్రాత్మకమైన దేహ పునరుత్థానాన్ని గనుక నిరాకరిస్తే, మీరు సువార్త యొక్క మూల సత్యాన్నే నిరాకరించినట్లు. అప్పుడు మీకు ఉండే ఏ విశ్వాసమైనా, క్రొత్త నిబంధన ద్వారా మనకు అందిన నిజమైన సువార్తపై ఉన్న విశ్వాసం కాదు. మరోసారి, మన ధృవీకరణల డాక్యుమెంట్ చెబుతున్నది ఏమిటంటే: క్రీస్తు యొక్క దేహ పునరుత్థానం అనే చారిత్రక వాస్తవాన్ని తిరస్కరించే ఏ సువార్త కూడా చెల్లదని మేము ప్రకటిస్తున్నాము.

ఈ తిరస్కరణలో ఉపయోగించబడిన మూడు ముఖ్యమైన అర్హతలను గుర్తుంచుకోవడం అవసరం. ఒకటి, పునరుత్థానం *చారిత్రకమైనది*. రెండు, అది *వాస్తవమైనది*. మూడు, అది *దేహసంబంధమైనది*. సువార్త యొక్క ప్రధాన వాదన ఏమిటంటే: నజరేయుడైన యేసు నిజంగా మృతులలో నుండి తిరిగి లేచాడు. ఆయన ఏ శరీరంతోనైతే మరణించాడో అదే శరీరంతో తిరిగి లేచాడు. అది కొత్త శరీరం కాదు. అది మార్చబడిన శరీరం. అది మహిమపరచబడిన శరీరం. అయినప్పటికీ సమాధిలో ఉంచబడిన శరీరానికి, సమాధి నుండి బయటకు వచ్చిన శరీరానికి మధ్య శాశ్వత సంబంధం ఉంది. ఇది భౌతిక పునరుత్థానం. ఇది నిర్దిష్ట స్థలంలో, నిర్దిష్ట సమయంలో జరిగిన నిజమైన పునరుత్థానం.

ఇప్పుడు మనం నీతిమంతులుగా తీర్చబడుట అనే సిద్ధాంతంపై దృష్టిసారించే 11వ ఆర్టికల్ గురించి చూద్దాం. ధృవీకరణ 11 ఇలా చెప్పుతుంది:

> క్రీస్తును మాత్రమే విశ్వసించడం ద్వారా నీతిమంతులుగా తీర్చబడతాము అనే బైబిలు బోధ సువార్తకు అత్యంత అవసరం అని మేము దృఢంగా ధృవీకరిస్తున్నాము (రోమా 3:28, 4:5; గలతీ. 2:16).
>
> దానికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:
>
> క్రీస్తును మాత్రమే విశ్వసించడం ద్వారా నీతిమంతులుగా తీర్చబడతాము అనే అపొస్తలుల బోధను తిరస్కరిస్తూనే, వాక్యానుసారమైన సువార్తను నమ్ముతున్నాను అని చెప్పుకునే వ్యక్తి యొక్క భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము. అంతేకాక నిజమైన సువార్తలు ఒకటి కంటె ఎక్కువ ఉన్నాయి అనే భావనను కూడా మేము తిరస్కరిస్తున్నాము (గలతీ. 1:6–9).

క్రీస్తు యొక్క దైవ మానవ స్వభావాలు ఆయన జీవితమరణ పునరుత్థానాలే సువార్తకు ఆధారం. అందుకే ఈ డాక్యుమెంట్ ఎక్కువ భాగం క్రీస్తు, శరీరధారణ, దైవత్వం, ప్రాయశ్చిత్తం, పునరుత్థానం మొదలగు వాటి గురించిన ముఖ్యమైన చారిత్రక సత్యాలను నొక్కిచెబుతోంది. అయితే సువార్త అంటే కేవలం యేసు ఎవరో చరిత్రలో ఆయన ఏమి చేశాడో చెప్పడం మాత్రమే కాదు. యేసు సాధించిన వాటి ద్వారా మనకు కలిగే ప్రయోజనాలు కూడా ఈ శుభవార్తలో ఉన్నాయి. అంతేకాక ఆ ప్రయోజనాలను మనం ఎలా పొందాలో కూడా ఇది వివరిస్తుంది. అంటే మనం క్రీస్తుతో ఎలా అనుసంధానం అవుతాము, ఆ తర్వాత ఆయన మనకు రక్షణను ఎలా కలుగజేస్తాడు, ఆయన

మనకు రక్షకుడిగా ఎలా ఉంటాడు అనే సందేశం కూడా సువార్తలో అంతర్భాగం.

రోమా 1వ అధ్యాయంలో, దేవుని సువార్త బయలుపరచబడిందని అపొస్తలుడైన పౌలు ప్రకటిస్తున్నాడు. ఆ తర్వాత కొన్ని అధ్యాయాలలో ఆ సువార్త యొక్క సారాంశాన్ని వివరిస్తాడు. మనం నీతిమంతులుగా తీర్చబడతాము అనే సిద్ధాంతం యొక్క ప్రాముఖ్యత గురించి అతడు వివరిస్తున్నాడు. ఎందుకంటే క్రీస్తు మనకోసం నెరవేర్చిన కార్యం యొక్క ఫలితమే ఈ నీతిమంతులుగా తీర్చబడడం. ఆయన యొక్క దైవ మానవ స్వభావాల ద్వారా జీవితమరణ పునరుత్థానాల ద్వారానే మనం దేవుని దృష్టిలో నీతిమంతులుగా నిలబడగలుగుతాము. మన ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల ద్వారా కాదు, కేవలం విశ్వాసం ద్వారా మాత్రమే మనం నీతిమంతులుగా తీర్చబడతాము అనే ఈ ఆలోచన సువార్తలో అంతర్భాగం.

మనం క్రీస్తు ద్వారా మాత్రమే కేవలం విశ్వసించడం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతాము అనే సత్యాన్ని సంస్కరణ కాలం నుండి క్రైస్తవ సంఘం ఒప్పుకుంది. నిజానికి, నీతిమంతులుగా తీర్చబడడం అనే సిద్ధాంతాన్ని లాటిన్‌లో చెప్పడానికి వాడే పదం *“సోలా ఫీడే”*. దీని అర్థం మనం విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతాము. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడటం అంటే, మనం కేవలం క్రీస్తును నమ్మడం ద్వారా మాత్రమే నీతిమంతులు అవుతాము. సంఘ సంస్కర్తలు బోధించిన దాని ప్రకారం, మనం నీతిమంతులుగా తీర్చబడడానికి కేవలం విశ్వాసం అనేది ఏకైక సాధనం. క్రీస్తు మన కోసం చేసిన పని వల్ల కలిగే ప్రయోజనాలను మనం విశ్వాసం ద్వారానే పొందుతాము; క్రీస్తు చేసిన కార్య ఫలాన్ని విశ్వాసం ద్వారా మాత్రమే స్వీకరిస్తాము.

11వ ఆర్టికల్ ఏం చెబుతుందంటే, క్రీస్తును నమ్మడం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతాము అనే అపొస్తలుల బోధను తిరస్కరిస్తూనే, వాక్యానుసారమైన సువార్తను నమ్ముతున్నారని చెప్పే వాటిని మేము తిరస్కరిస్తాము. ఈ విషయం క్రైస్తవ చరిత్రలో అతిపెద్ద వివాదానికి దారితీసింది. ఇది 16వ శతాబ్దంలో మొదలై, ప్రొటెస్టెంట్ సంఘ సంస్కరణకు దారితీసింది. 16వ శతాబ్దంలో జరిగిన చర్చంతా సువార్త పైనే కేంద్రీకృతమైంది. *సోలా ఫీడేను* (విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు) అనే సిద్ధాంతాన్ని నమ్మినవారు, బైబిలు బోధించిన అపొస్తలులు బోధించిన సువార్త కోసమే పోరాడారు. ప్రొటెస్టెంట్లు, రోమన్ కేథలిక్ చర్చి మధ్య జరిగిన వివాదం ప్రధానంగా, నిజమైన సువార్త ఏమిటి అనే దాని గురించే. రోమన్ కేథలిక్ చర్చి *సోలా ఫీడేను* అంటే విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు అనే సిద్ధాంతాన్ని తిరస్కరించి, ఖండించింది.

గలతీయులకు రాసిన పత్రికలో, యూదుల మత సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ పౌలు ఇలా రాశాడు: క్రొత్త నిబంధనలో చెప్పబడిన సువార్త తప్ప, మరే సువార్తను మనం అంగీకరించకూడదు (గలతీ. 1:6–9). నిజమైన సువార్త అనేది ఒక్కటే; మనం విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతామని ఆ సువార్త చెబుతుంది. ఈ తిరస్కరణ ఏం చెబుతుందంటే ఒక వ్యక్తి సువార్తను నమ్ముతున్నానని చెప్పుకుంటూ, అదే సమయంలో విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు అనే బోధను కాదంటే, అతడు నమ్మేది వాక్యానుసారమైన సువార్తను కాదు. అది ఇంకేదైనా కావచ్చు కానీ, క్రొత్త నిబంధనలోని సువార్త మాత్రం కాదు. కాబట్టి దాన్ని చెడ్డ వార్తగా పరిగణించాలి.

ఈ ధృవీకరణలు వాక్యానుసారమైన, నిజమైన సువార్తకు అత్యవసరం. ఇవి లేకపోతే, సువార్త యొక్క మూల సత్యమే మనకు ఉండదు. 16వ శతాబ్దంలో మాదిరిగానే, ఈ రోజుల్లో కూడా నీతిమంతులుగా తీర్చబడడం అనే సిద్ధాంతంపై చాలా వివాదాలు ఉన్నాయి. ఆ వివాదాలకు ప్రధాన కారణం ఏమిటంటే, ఆ సిద్ధాంతం యొక్క అసలు అర్థం చాలామందికి తెలియకపోవడమే. మనం ఇప్పుడున్న ఈ పరిస్థితి చాలా ప్రమాదకరమైనది. ఎందుకంటే విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు అనే అంశాన్ని సువార్తతో క్రొత్త నిబంధన విడదీయరాని విధంగా ముడిపెట్టింది. కాబట్టి మనకు నీతిమంతులుగా తీర్చబడడం అనే సిద్ధాంతం గురించి అర్థం కాకపోతే, సువార్త కూడా నిజంగా అర్థం కాదు. మనం సువార్తను ప్రకటించాలంటే, విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు అనే సిద్ధాంతాన్ని తప్పకుండా బోధించాలి.

అధ్యాయం ఏడు

# ఆపాదన (లెక్కించడం)

“ది గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్: ఎన్ ఇవాంజెలికల్ సెలబ్రేషన్” అనే డాక్యుమెంట్లోని ధృవీకరణల ఆర్టికల్లో, 12వ ధృవీకరణ చారిత్రక “బైబిల్ని విశ్వసించే” వారి దైవశాస్త్రానికి, సాంప్రదాయ రోమన్ కేథలిక్ సంఘ బోధకు మధ్యనున్న తేడాను చాలా క్లుప్తంగా వివరిస్తుంది. ధృవీకరణ 12 ఇలా చెప్పుతుంది:

> మన పాపాలను క్రీస్తుకు, ఆయన నీతిని మనకు ఆపాదించడం (లెక్కించడం) ద్వారానే మన పాపాలు పూర్తిగా క్షమించబడి, మనం పూర్తిగా దేవునిచే అంగీకరించబడతాం అనే ఈ సిద్ధాంతం సువార్తకు

> అత్యంత అవసరం అని మేము ధృవీకరిస్తున్నాము (2 కొరింథీ. 5:19–21).

ఈ అంశానికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:

> క్రీస్తు నీతి మనలో ప్రవేశపెట్టబడటం ద్వారానో, మనలో సహజ సిద్ధంగా ఉన్నదని (కొందరు భావించే) నీతి ద్వారా గాని మనం నీతిమంతులుగా తీర్చబడతామనే బోధను మేము తిరస్కరిస్తున్నాము.

మార్టిన్ లూథర్ చేసిన పనుల ద్వారా సంస్కరణ ప్రారంభమైన తర్వాత, రోమన్ కేథలిక్ సంఘం ట్రెంటులో సభను నిర్వహించి ప్రొటెస్టెంట్ దృక్పథాన్ని శాపగ్రస్తమైనదిగా ప్రకటించడానికి ముందు, రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం జరిగింది. జర్మనీలోని రెజెన్స్‌బర్గ్‌లో ప్రొటెస్టెంట్ సంఘసంస్కర్తల ప్రతినిధులు, కేథలిక్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ రెండు వర్గాలను రాజీకి తెచ్చేందుకు సయోధ్యను కుదిర్చేందుకు ఈ ప్రతినిధులు ప్రయత్నించారు. మొదట్లో ఈ ప్రయత్నం పనిచేస్తున్నట్లు కనిపించినా, అది ఎక్కువ కాలం నిలబడలేదు.

ఆ రెండు వర్గాలు మధ్య రాజీ కుదుర్చుకోలేకపోవడానికి ప్రధాన కారణం, నీతిమంతులుగా తీర్చబడడానికి అంతిమ ఆధారం ఏమిటనే విషయమే. దేవుడు ఒక వ్యక్తిని తన దృష్టిలో నీతిమంతుడని దేని ఆధారంగా ప్రకటిస్తాడు? ఈ వివాదం, ప్రధానంగా రెండు పదాలపైన దృష్టిసారించింది. మొదటి పదం *'ఆపాదించడం' (Imputation).* ఇది బైబిల్ని విశ్వసించే వర్గానికి ఇష్టమైన పదం. రెండవది, 'ప్రవేశపెట్టడం.' దీనిని రోమన్

కేథలిక్ చర్చి గట్టిగా నొక్కిచెప్పింది. ఈ తేడాను అర్థంచేసుకునే ముందు, మనం ఒక విషయాన్ని గమనించాలి. మనం క్రీస్తు నీతి ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతామని రెండు వర్గాలూ నమ్మాయి. అయితే ముఖ్యమైన ప్రశ్న ఏంటంటే, ఏ విధంగా మనం క్రీస్తు నీతి ద్వారా నీతిమంతులుగా తీర్చబడతాము? క్రీస్తు నీతి మనం నీతిమంతులుగా తీర్చబడటంలో ఎలా, ఏ పద్ధతిలో ఉపయోగపడుతుంది? ఈ తేడాను అర్థంచేసుకోవడానికి, ముందుగా మనం రోమన్ కేథలిక్ అభిప్రాయాన్ని చూద్దాం.

రోమన్ కేథలిక్ చర్చి అభిప్రాయం ప్రకారం, మనుషులు బాప్తీస్మం తీసుకున్నప్పుడు నీతిమంతులుగా తీర్చబడే ప్రక్రియ మొదలవుతుంది. నీతిని పొందడానికి బాప్తీస్మం ఒక సాధనం, మనుషులు వేసే తొలి అడుగు. బాప్తీస్మం సమయంలో ఆ వ్యక్తి ఆత్మలోకి క్రీస్తు యొక్క నీతి ప్రవేశపెట్టబడుతుంది. *'ప్రవేశపెట్టడం' (infusion)* అంటే వారు ఏమంటారంటే, నీతిమంతునిగా తీర్చే కృప, అంటే క్రీస్తు నీతి మూలంగా కలిగే కృప, విశ్వాసి ఆత్మలోకి కుమ్మరించబడుతుంది. ఈ కృపను పొందిన వ్యక్తి దానితో సహకరించాలి, సమ్మతించాలి. ట్రెంట్ సభ ప్రకారం, విశ్వాసిలో ప్రవేశపెట్టబడిన నీతి ఉన్నప్పుడు, ఆ నీతి ఆ వ్యక్తిలో మమేకమై పోయినప్పుడు మాత్రమే దేవుడు ఆ వ్యక్తిని తన దృష్టిలో నీతిమంతునిగా ప్రకటిస్తాడు.

ఒక వ్యక్తిలో నీతి ప్రవేశపెట్టబడినప్పుడు, దానికి సహకరిస్తూ జీవించినప్పుడు, అతడు రక్షణలో నిలిచి ఉంటాడు. అతడు మరణకరమైన పాపం చేసేంత వరకు మాత్రమే ఆ స్థితిలో కొనసాగుతాడు. ఆ పాపాన్ని మరణకరమైనది అని ఎందుకు అంటారంటే, అది ఆత్మలో సహజ సిద్ధంగా ఉన్న కృపను, బాప్తీస్మం ద్వారా ప్రవేశపెట్టబడిన కృపను చంపేస్తుంది. ఆ కృప

నాశనమయ్యాక, ఆ వ్యక్తి మళ్లీ నీతిమంతునిగా తీర్చబడాలి. ఈ విధంగా తిరిగి నీతిమంతునిగా తీర్చబడటం 'ప్రాయశ్చిత్తము' చెల్లించడం (penance) అనే మరొక సంస్కారం ద్వారా లభిస్తుంది. రోమన్ కేథలిక్ చర్చి, ప్రాయశ్చిత్తము చెల్లించడం అనే సంస్కారాన్ని, తమ ఆత్మల విషయంలో ఓడ బద్దలైన వారిలా ఉన్నవారికి, ఒడ్డుకు చేర్చే రెండవ దోనెగా (పడవగా) నిర్వచించింది. ఒక వ్యక్తి తన రక్షణను కోల్పోతే, దాన్ని మళ్లీ పొందే ఏకైక మార్గం, కొత్తగా కృపను అతనిలోకి ప్రవేశపెట్టడమే. అది ఇప్పుడు ప్రాయశ్చిత్తము చెల్లించడం అనే సంస్కారం ద్వారా లభిస్తుంది. మొదటిగా లూథర్‌తో వివాదం మొదలవడానికి కారణం, ఈ ప్రాయశ్చిత్తము చెల్లించడం అనే సంస్కారానికి సంబంధించిన సమస్యలే. ముఖ్యంగా, పాప పరిహార పత్రాల ద్వారా ప్రాయశ్చిత్తము చెల్లించడం అనే సమస్య వల్లనే ఆ వివాదం రేగింది.

రోమన్ కేథలిక్ చర్చికి వ్యతిరేకంగా, "మనం నీతిమంతులుగా తీర్చబడడం, కృపను మనలో ప్రవేశపెట్టడం' ద్వారా కాదు, 'ఆపాదించడం' ద్వారా లభిస్తుంది" అని సంస్కర్తలు బోధించారు. ఆపాదించడం అంటే, దేవుడు ఒక న్యాయపరమైన లేదా చట్టపరమైన ప్రకటన ద్వారా, ఒక వ్యక్తి యొక్క పాపాన్ని లేదా నీతిని మరొకరి ఖాతాలో వేయడం. నీతిమంతులుగా తీర్చబడే విషయంలో, ఈ ఆపాదన అనేది రెండు వైపులా జరుగుతుంది. మొదట, ఇది మనందరి పాపాలను, వాటి శిక్షను సిలువపై ఉన్న క్రీస్తు పైకి బదిలీ చేస్తుంది. ప్రాయశ్చిత్త బలిలో, క్రీస్తు పాపభారాన్ని మోసేవాడు అయ్యాడు. దేవుడు మన అపరాధాలను మన నుండి ఆయనకు బదిలీ చేసినప్పుడు, క్రీస్తు ఆ భారాన్ని మోశాడు. పాత నిబంధనలోని ప్రాయశ్చిత్త దినం యొక్క ఆచారాన్ని క్రీస్తు నెరవేర్చాడు. ఆ ప్రాయశ్చిత్త దినమున, ప్రధాన యాజకుడు

విడువబడే మేక తలపై చేతులు ఉంచి, ప్రజల పాపాలను ఆ మేకకు ఆపాదించేవాడు. పాపం, అపరాధం ఆ మేకకు బదిలీ అయిన తర్వాత, దాన్ని అరణ్యంలోని చీకటిలోకి విడిచిపెట్టేవారు. ఆపాదించడం అనే ఆలోచన పాత నిబంధన బలులలో లోతుగా పాతుకు పోయింది. అదేవిధంగా, దేవుని న్యాయమైన ప్రకటన ద్వారా మన పాపాలు సిలువపై క్రీస్తుకు బదిలీ చేయబడ్డాయి.

అయితే నీతిమంతులుగా తీర్చబడడం అనే మన కథలో ఇది కేవలం సగ భాగం మాత్రమే. క్రీస్తు మన అపరాధాల కొరకు శిక్షను చెల్లించిన తర్వాత, మనం నిర్దోషులుగా ఉండవచ్చు. అయితే మనకు నీతి లేదా ప్రత్యేకమైన అర్హత ఏమీ ఉండదు. నిర్దోషిగా ప్రకటించేటప్పుడు, దేవుడు తన నీతి ధర్మాన్ని మనలో నెరవేర్చబడాలని కోరుకుంటాడు. మనం ముందే చెప్పుకున్నట్లు, క్రీస్తు తన ప్రజల కోసం చనిపోవడమే కాక, మన కోసం జీవించాడు కూడా. క్రీస్తు మరణం మన రక్షణకు ఎంత ముఖ్యమైనదైనా సరే, మన రక్షణ కేవలం క్రీస్తు మరణంతో పూర్తి కాలేదు. యేసు కేవలం పరలోకం నుండి శుక్రవారం వచ్చి, సిలువకు వెళ్ళి, తిరిగి పరలోకానికి వెళ్ళిపోలేదు. ఆయన శిశువుగా జన్మించి, పుట్టిన క్షణం నుండీ దేవుని ధర్మశాస్త్రం మొత్తానికి లోబడ్డాడు. ఆయన తన జీవితమంతా ప్రతి విషయంలో దేవుని ధర్మాన్ని నెరవేర్చడానికి జీవించాడు. తద్వారా, తన పరిపూర్ణమైన నీతి ద్వారా దేవుని ఆశీర్వాదాన్ని సంపాదించుకున్నాడు. మనం నీతిమంతులుగా తీర్చబడడంలో ఆపాదన రెండువైపులా జరుగుతుంది. ఒకవైపు మన అపరాధం క్రీస్తుకు ఆపాదించబడుతుంది. మరొక వైపు, ఆయన నీతి మనకు ఆపాదించబడుతుంది.

రోమన్ కేథలిక్ చర్చి దృష్టిలో, నీతిమంతులుగా తీర్చబడడానికి మూలకారణం మొదట బాప్తీస్మం, ఆ తర్వాత ప్రాయశ్చిత్తము

చెల్లించడం అనే సంస్కారం. అయితే సంస్కర్తల దృష్టిలో, నీతిమంతులుగా తీర్చబడడానికి సాధనం కేవలం విశ్వాసం మాత్రమే. ఈ విశ్వాసం ద్వారానే మనం క్రీస్తును హత్తుకుంటాము. క్రీస్తు నీతి మనకు ఆపాదించబడుతుంది. అంటే, క్రీస్తును నమ్మిన వారందరి ఖాతాలోకి క్రీస్తు నీతి లెక్కించబడుతుంది లేదా బదిలీ అవుతుంది. రోమన్ కేథలిక్ చర్చి ఈ ఆపాదన అనే సిద్ధాంతాన్ని తిరస్కరించింది. ఎందుకంటే అది చట్ట విరుద్ధత అవుతుందని వారు భావించారు. దేవుడు ఒకరి నీతిని మరొకరికి బదిలీ చేస్తే, అది సత్యంపై ఆధారపడి ఉండదు. కాబట్టి అది దేవుణ్ణి అబద్ధంలో పాలివాడైనట్లు చేస్తుందని వారు వాదించారు. కేథలిక్ చర్చి అడిగిన ప్రశ్న ఏంటంటే న్యాయవంతుడు, పరిశుద్ధుడు అయిన దేవుడు, నిజానికి నీతిమంతుడు కాని వ్యక్తిని ఎలా నీతిమంతుడని లెక్కించగలడు? ఆ వ్యక్తి వాస్తవానికి నీతిమంతుడు కానప్పుడు, దేవుడు అతణ్ణి ఎలా నీతిమంతుడని ప్రకటించగలడు? ఈ ఆపాదన అనే సిద్ధాంతం దేవుని న్యాయాన్ని, నిజాయితీని దెబ్బతీస్తుందని, ఆయన పరిశుద్ధతను తగ్గిస్తుందని రోమన్ కేథలిక్ చర్చి భావించింది.

ఈ వాదనకు సంస్కర్తలు ఇలా జవాబు ఇచ్చారు. ఇది న్యాయపరమైన చర్య నిజమే, అయితే ఇందులో చట్ట విరుద్ధత ఏమీ లేదు. మొదటిగా విశ్వాసం ద్వారా మనకు ఆపాదించబడిన నీతి నిజమైనది. అది క్రీస్తు నీతి. అందులో కల్పితమైనది ఏమీ లేదు. రెండవదిగా, దేవుడు ఒకరి ఖాతా నుండి మరొకరి ఖాతాకు ఏదైనా బదిలీ చేస్తే, అది నిజమైన బదిలీ. నిజమైన విశ్వాసం ఉన్న మనుషులకు, నిజమైన నీతిని నిజంగా ఆపాదించడం జరుగుతుంది. మనం ఆపాదన అనే సిద్ధాంతాన్ని నిరాకరిస్తే, కేవలం క్రీస్తు నీతిని మన ఖాతాకు బదిలీ చేయడాన్ని మాత్రమే కాదు,

సిలువ యొక్క ప్రాముఖ్యతను కూడా తిరస్కరించాల్సి వస్తుంది. ఎందుకంటే సిలువపై క్రీస్తు మన స్థానంలో చనిపోతున్నాడు. దేవుడు మనపై కోపాన్ని కుమ్మరించడానికి బదులు క్రీస్తుపై ఆ కోపాన్ని కుమ్మరించాడు. అంటే ఆపాదన ద్వారా మన నేరాన్ని దేవుడు క్రీస్తుకు బదిలీ చేశాడని అర్థం.

కేవలం విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం అనేది సువార్తకు అత్యంత అవసరం. *సోలా ఫీడే* అనేది లేకపోతే, మీకు సువార్త లేనట్లే. అదేవిధంగా, ఆపాదన అనే అంశం విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం అనే సిద్ధాంతానికి తప్పనిసరి. కాబట్టి మీకు ఆపాదన అనే సిద్ధాంతం లేకపోతే, మీకు *సోలా ఫీడే* ఉండదు. *సోలా ఫీడే* లేకపోతే, మీకు సువార్త కూడా ఉండదు. ఈ ఆపాదన అనే సిద్ధాంతం లేకుండా, మీకు సువార్త లేదు. ఎందుకంటే యేసు నీతి మన ఖాతాకు బదిలీ అవుతుందనే ఈ ఆలోచనపైనే సువార్త నిలబడుతుంది లేదా కుప్పకూలిపోతుంది.

ఈ సిద్ధాంతాలు మన అనుదిన జీవితాలకు, ఆచరణకు ఎంత ముఖ్యమైనవో అని మనం తరచుగా ఆశ్చర్యపోతూ ఉంటాం.. అయితే పరిశుద్ధుడైన న్యాయవంతుడైన దేవునితో మనం రక్షణ సంబంధంలో ఎలా నిలబడగలం అని తెలుసుకోవడం కంటే మన జీవితానికి మరేదీ ముఖ్యమైనది కాదు. మన రక్షణ గనుక కొంచెమైనా సరే మన నీతిపై ఆధారపడి ఉంటే, మనకు రక్షణ నిరీక్షణ ఉండేది కాదు. ఎందుకంటే దేవుడు తన సృష్టి నుండి ఆశించే ప్రమాణాన్ని చేరుకోగలిగే ఏకైక నీతి, క్రీస్తు సంపాదించిన నీతి మాత్రమే. సువార్తలో మనం వినే సత్యం ఇదే, మనం గట్టిగా హత్తుకునే సత్యం కూడా ఇదే.

అధ్యాయం ఎనిమిది

# క్రీస్తు నీతి

ఆర్టికల్ 12 ప్రకారం, మనం నీతిమంతులుగా తీర్చబడటం అనేది మనలో ఉన్న నీతిని బట్టి కాదుగాని క్రీస్తు నీతిని మనకు ఆపాదించడం ద్వారా మాత్రమే జరుగుతుంది. మొదటిగా, ఆర్టికల్ 13 కూడా దాదాపు ఆర్టికల్ 12 చెప్పిన విషయాన్నే మళ్ళీ చెబుతోందని మనకు అనిపించవచ్చు. అయితే ఈ నీతిని ఆపాదించడం, మనల్ని నీతిమంతులుగా తీర్చడంలో క్రీస్తు పాత్ర, సువార్తకు చాలా ముఖ్యం. అందుకే ఈ సిద్ధాంతల డాక్యుమెంట్ రూపొందించిన మేము ఈ విషయాన్ని మరింత స్పష్టంగా, ఇంకా ఖచ్చితంగా చెప్పడానికి ఆర్టికల్ 13 అవసరమని భావించాము. ధృవీకరణ 13 ఇలా చెప్పుతుంది:

> మనం దేని ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డామో, ఆ క్రీస్తు నీతి పూర్తిగా ఆయనదే అని, ఆయన మన ప్రమేయం లేకుండా, తన పరిపూర్ణ విధేయత ద్వారా దానిని సంపాదించాడని మేము ధృవీకరిస్తున్నాము. మనం నీతిమంతులుగా తీర్చబడటానికి ఏకైక కారణం, క్రీస్తు నీతి. దేవుని న్యాయమైన (చట్టబద్ధమైన) ప్రకటన ద్వారా ఆ నీతి మనదిగా లెక్కించబడుతుంది, ఆపాదించబడుతుంది, లేదా పరిగణించబడుతుంది.
>
> దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:
>
> మన జీవిత కాలంలో ఏ దశలోనైనా చేసిన ఏ పనులైనా క్రీస్తు నెరవేర్చిన కార్యానికి యోగ్యతను అదనపు యోగ్యతను జతచేస్తాయనే భావజాలాన్ని, నీతిమంతులుగా తీర్చబడటానికి అవసరమైన అర్హతను సంపాదిస్తాయి అనే భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము (గలతీ. 2:16; ఎఫెసీ. 2:8–9; తీతు. 3:5).

మనం క్రీస్తు నీతి గురించి మాట్లాడినప్పుడు, అది ఆయన పరిపూర్ణ విధేయత ద్వారా సంపాదించిన నీతిని సూచిస్తుంది. దైవశాస్త్ర పండితులు పూర్వం క్రీస్తు విధేయతను రెండు రకాలుగా విభజించారు. ఒకటి *నిష్క్రియాత్మక విధేయత* (పాసివ్: శ్రమలను అనుభవిస్తూ చూపించిన విధేయత), రెండవది ఆయన యొక్క సంపూర్ణ *క్రియాత్మక విధేయత* (ఆక్టివ్: క్రియల రూపంలో చూపించిన విధేయత). ఈ పదాలు ఈ డాక్యుమెంట్లో లేనప్పటికీ, ఈ ప్రకటనకు వెనుకన్న చారిత్రక నేపథ్యాన్ని ఇవి తెలియజేస్తాయి.

క్రీస్తు యొక్క నిష్క్రియాత్మక విధేయత (పాసివ్ విధేయత ) అనేది తన జీవిత కాలంలో ఆయన ధర్మశాస్త్ర శిక్షలను అనుభవిస్తూ, చివరికి సిలువపైన మరణంతో పరాకాష్ఠకు చేరడాన్ని సూచిస్తుంది. ఆయన మన పక్షాన దేవుని తీర్పును స్వీకరించడానికి దేవుని పిలుపునకు లోబడ్డాడు. క్రీస్తు యొక్క క్రియాత్మక విధేయత (ఆక్టివ్ విధేయత ) అనేది తన జీవిత కాలంలో ఆయన ధర్మశాస్త్రాన్ని పాటించి, దాని విధులను సంపూర్ణంగా నెరవేర్చడాన్ని సూచిస్తుంది. ఆయన ప్రతి చిన్న విషయంలోనూ, దేవుని ధర్మశాస్త్రానికి సంపూర్ణ విధేయతను కనబరిచాడు.

మనం నీతిమంతులుగా తీర్చబడటానికి కారణమైన నీతి గురించి లూథర్ మాట్లాడినప్పుడు, అతడు రెండు ఉపయోగకరమైన పదబంధాలను ఉపయోగించాడు. మొదటిది *"జస్టిటియా ఎలియెనమ్"*. దీని అర్థం అన్య నీతి లేదా పరాయి నీతి. *"జస్టిటియా ఎలియెనమ్"* అనేది ఇంకొకరిచే సాధించబడిన నీతిని సూచిస్తుంది. ఇది మనది కాదు, మరొకరి నీతి. మనం నీతిమంతులుగా తీర్చబడటానికి ఉపయోగపడే నీతి, క్రీస్తు యొక్క సొంత నీతి. అది వాస్తవానికి మనది కాదు. మనం దానిని కేవలం ఆపాదన ద్వారా మాత్రమే పొందుతాము.

లూథర్ ఉపయోగించిన రెండవ పదబంధం *"ఎక్స్‌ట్రా నోస్"*. "మనకు వెలుపల" లేదా "మనకు వేరుగా" అని దీని అర్థం. మనం నీతిమంతులుగా తీర్చబడటానికి ఆధారమైన ఆ నీతి మనలో లేదు. అయితే అది క్రీస్తుచే మన కోసం సాధించబడిన నీతి. మన నీతిమంతులుగా తీర్చబడటానికి ఏకైక కారణంగా, ఈ నీతి దేవుని చట్టపరమైన ప్రకటన ద్వారా మనదిగా లెక్కించబడుతుంది, మన ఖాతాలో వేయబడుతుంది లేదా మనకు ఆపాదించబడుతుంది.

ఆర్టికల్ 13 ప్రకారం, మన జీవిత కాలంలో ఏ దశలోనైనా చేసిన ఏ పనులైనా క్రీస్తు నెరవేర్చిన కార్యానికి యోగ్యతను అదనపు

యోగ్యతను జతచేస్తాయనే భావజాలాన్ని, నీతిమంతులుగా తీర్చబడటానికి అవసరమైన అర్హతను సంపాదిస్తాయి అనే భావజాలాన్ని మేము తిరస్కరిస్తున్నాము. ఇక్కడ యోగ్యత అనే అంశం ముఖ్యంగా రోమన్ కేథలిక్ వారి దృక్పథానికి సంబంధించినది. యోగ్యత అనేది రోమన్ కేథలిక్ పశ్చాత్తాప సంస్కార ఆచరణలో కనిపిస్తుంది. మరణకరమైన పాపం చేసినవారు నీతిమంతులుగా తీర్చబడిన స్థితికి తిరిగి రావడానికి పశ్చాత్తాపం అనే ఈ సంస్కారం అవసరం. పశ్చాత్తాపం అనే ఈ సంస్కారంలో పాప సంకీర్తన (ఒప్పుకోలు), పశ్చాత్తాప చర్య, గురువు ప్రకటించే క్షమాపణ, దేవుణ్ణి సంతృప్తిపరిచే చర్యలు ఉంటాయి. వీటన్నింటినీ చేసిన తర్వాత మాత్రమే మరణకరమైన పాపం చేసినవారు తిరిగి నీతిమంతులుగా తీర్చబడిన స్థితిలోకి వస్తారు. అయితే మనకు నీతిమంతులుగా తీర్చబడటానికి లెక్కించబడే ఏకైక యోగ్యత, క్రీస్తు యోగ్యత మాత్రమే. ఆ యోగ్యత సంపూర్ణమైనది కాబట్టి దానిని పెంచడానికి గానీ, తగ్గించడానికి గానీ వీలు కాదు. క్రీస్తు యొక్క పరిపూర్ణతకు మనం ఏమీ జోడించలేము. దేవుని నీతి విధులను సంతృప్తిపరచడానికి క్రీస్తు తన సంపూర్ణ విధేయత ద్వారా మనకోసం అప్పటికే సాధించిన యోగ్యతకు మనం ఏమీ జతచేయలేము.

ఇప్పుడు మనం కొంచెం తికమకగా ఉండే విషయానికి వస్తున్నాం. మన సిద్ధాంతల డాక్యుమెంట్ నీతిమంతులుగా తీర్చబడటం, పరిశుద్ధ పరచబడటం అనే వాటి మధ్య తేడాను చూపుతుంది. ధృవీకరణ 14 ఇలా చెప్పుతుంది:

> విశ్వాసులందరిలోనూ పరిశుద్ధాత్మ నివసిస్తున్నప్పటికీ, వారు పరిశుద్ధపరచబడే, క్రీస్తు స్వరూపంలోనికి మార్చబడే ప్రక్రియలో ఉన్నప్పటికీ, ఈ మార్పులు మనకు

నీతిమంతులుగా తీర్చబడటానికి ఆధారం కావు. దేవుడు మనల్ని పాపులుగా ఉన్నప్పుడే (రోమా 4:5) కేవలం కృప ద్వారా, కేవలం విశ్వాసం ద్వారా, కేవలం క్రీస్తును బట్టి మనల్ని నీతిమంతులుగా ప్రకటిస్తాడు, పాపాలు క్షమిస్తాడు, తన బిడ్డలుగా స్వీకరిస్తాడు.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:

“దేవుడు క్రీస్తులో నీతిమంతులుగా వారిని ప్రకటించడానికి ముందే, జీవితాన్ని మార్చే దేవుని కృపకు విశ్వాసులు సహకరించడం ద్వారా స్వాభావికంగా నీతిమంతులుగా ఉండాలి” అనే వాదనను మేము ఖండిస్తున్నాం. మనం ఇంకను పాపులమై ఉండగానే నీతిమంతులుగా తీర్చబడతాము.

మనం ఇంకను పాపులమై ఉండగానే దేవుని దృష్టిలో నీతిమంతులుగా ప్రకటించబడతాము. లూథర్ చెప్పినట్లుగా, మనం *“సిముల్ యుస్టస్ ఎట్ పెక్కాటర్ ”*. అంటే మనం ఒకే సమయంలో నీతిమంతులం, అలాగే పాపులం కూడా. ఒక వ్యక్తి క్రీస్తును విశ్వసించినప్పుడు, క్రీస్తు నీతిని ఆపాదించడం ద్వారా దేవుడు అతణ్ణి నీతిమంతుడిగా ప్రకటిస్తాడని అతని ఉద్దేశం. అయితే మనం నీతిమంతులుగా తీర్చబడిన వెంటనే మన పాప స్వభావం నాశనం కాదు; మనం నీతిమంతులమైనా, పాపం చేస్తాము. అయితే నీతిమంతులుగా తీర్చబడిన ప్రతి ఒక్కరిలోనూ పరిశుద్ధాత్మ నివసిస్తాడు. నీతిమంతులుగా తీర్చబడిన ఆ క్షణం నుండే, విశ్వాసి ఆత్మలో, జీవితంలో పరిశుద్ధపరచే పనిని ఆత్మ

దేవుడు ప్రారంభిస్తాడు. కాబట్టి మనం నీతిమంతులుగా మారేంత వరకు దేవుడు మనల్ని నీతిమంతులుగా ప్రకటించడానికి ఎదురుచూడాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ మనం నిస్సందేహంగా నీతిమంతులుగా మారుతూ ఉంటాం. క్రీస్తు స్వరూపంలోనికి మార్చబడే, క్రీస్తు పరిపూర్ణతలో ఎదిగే ఆ ప్రక్రియ మన ఆధ్యాత్మిక నూతన జన్మతో, నీతిమంతులుగా తీర్చబడటంతో మొదలవుతుంది.

క్రైస్తవులు మంచి క్రియల పట్ల ఆసక్తి కలిగి ఉండడాన్ని మన సిద్ధాంతాల డాక్యుమెంట్ తిరస్కరించడం లేదనే విషయాన్ని గుర్తించడం ముఖ్యం. అపోస్తలుడైన యాకోబు ఇలా రాశాడు: “నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా?” (యాకోబు 2:14). దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే మన మంచి క్రియలు నీతిమంతులుగా తీర్చబడిన ఫలితంగా వస్తాయి. అవి మనం నీతిమంతులుగా తీర్చబడటానికి కారణమో ఆధారమో కావు. మనం నీతిమంతులుగా తీర్చబడటానికి దోహదపడే మంచి క్రియలు, కేవలం యేసు చేసిన క్రియలు మాత్రమే. నీతిమంతులుగా తీర్చబడిన తర్వాత, దాని పర్యవసానంగా మన మంచి క్రియలు వస్తాయి. విశ్వాసులందరిలోనూ పరిశుద్ధాత్మ నివసిస్తున్నాడని, వారు క్రీస్తు స్వరూపంలోనికి మార్చబడే ప్రక్రియలో ఉన్నారని ఈ సిద్ధాంతాల డాక్యుమెంట్ ధృవీకరిస్తుంది. మనం క్రీస్తు స్వరూపంలోనికి ఎదగాలి.

ముఖ్యమైన అంశం ఏమిటంటే, 14వ ధృవీకరణ “దేవుడు మనుషులను క్రీస్తులో నీతిమంతులుగా ప్రకటించడానికి ముందే, జీవితాన్ని మార్చే దేవుని కృపతో విశ్వాసులు సహకరించడం ద్వారా స్వాభావికంగా నీతిమంతులుగా ఉండాలి” అనే

వాదనను ఖండిస్తుంది. మనం ఇంకను పాపులమై ఉండగానే నీతిమంతులుగా తీర్చబడతాము.” ఇక్కడ వివాదానికి కారణమైన ముఖ్యమైన పదం “ముందు”. రోమన్ కేథలిక్ చర్చి, బైబిల్ని విశ్వసించే వారిద్దరూ కూడా, “నీతిమంతులుగా తీర్చబడటం అనేది దేవుడు ఒక వ్యక్తిని చట్టబద్ధంగా నీతిమంతుడని ప్రకటించే చర్య” అని నమ్ముతారు. అయితే దేవుడు ఆ ప్రకటనను ఎప్పుడు, ఎవరి యోగ్యత ఆధారంగా చేస్తాడు అనేదే అసలు చర్చ. ప్రొటెస్టెంట్ సంఘ సంస్కర్తలు గట్టిగా చెప్పినదేమంటే, మనం స్వతహాగా నీతిమంతులం కాక ముందే, దేవుడు మనల్ని నీతిమంతులుగా ప్రకటిస్తాడు. మనం విశ్వసించిన తక్షణం, మనం ఇంకా పాపులమై ఉన్నప్పుడే, ఆయన ఆ తీర్పును ప్రకటిస్తాడు. ఇదే సువార్తలోని మంచి వార్త. మనం యేసును నమ్మిన వెంటనే, ఆయన సాధించిన పరిపూర్ణ నీతి అంతా మనకు ఆపాదించబడుతుంది. ఫలితంగా మన పాపాలు క్షమించబడతాయి. మనం దేవుని కుటుంబంలోకి దత్తత తీసుకోబడతాము. మనం నమ్మిన వెంటనే మన సృష్టికర్త మనల్ని నీతిమంతులుగా ప్రకటిస్తాడు. ఎందుకంటే ఆ క్షణంలో ఆయన ఏమైయున్నాడో, ఏమి సాధించాడో అదంతా మన సొంతమవుతుంది.

క్రొత్త నిబంధన మనల్ని, “మీరు భయముతోను వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి” అని చెబుతుంది (ఫిలిప్పీ. 2:12). కొన్నిసార్లు మనం ఈ వాక్యం చదివినప్పుడు గందరగోళానికి గురవుతాము. ఎందుకంటే *నీతిమంతులుగా తీర్చబడటం*, *రక్షణ* అనే పదాలను తరచుగా ఒకదానికొకటి పర్యాయ పదాలుగా ఉపయోగిస్తారు. ఒక కోణంలో చూస్తే, మనం క్రీస్తును విశ్వసించిన క్షణంలోనే రక్షణలోకి ప్రవేశించడం నిజమే. అయితే మన అంతిమమైన సంపూర్ణమైన రక్షణ పరలోకంలో

మహిమ పొందినప్పుడు మాత్రమే పూర్తవుతుంది. కాబట్టి పరిశుద్ధంగా మారే ప్రక్రియ కూడా రక్షణలో ఒక భాగం. అయితే నీతిమంతులుగా తీర్చబడటం అనేది ముందు వస్తుంది. మనం నీతిమంతులుగా తీర్చబడటానికి ఏమీ చేయాల్సిన అవసరం లేదు. నీతిమంతులుగా తీర్చబడటం వలన వచ్చే ఫలాలను మన పరిశుద్ధపరచబడే ప్రక్రియలో చూపించడానికి మనం కృషి చేస్తున్నాం.

అధ్యాయం తొమ్మిది

# జీవితాన్ని మార్చే సువార్త

నిజమైన విశ్వాసంతో మనం క్రీస్తును హత్తుకున్న వెంటనే, క్రీస్తు నీతిని మనకు ఆపాదించడం ద్వారా దేవుడు మనల్ని నీతిమంతులుగా ప్రకటిస్తాడు. మనం నీతిమంతులంగా తీర్చబడినప్పటికీ, పాపం చేస్తూనే ఉంటాము. మనం నీతిమంతులుగా తీర్చబడిన క్షణం నుంచే పవిత్రీకరణ అనే ప్రక్రియ మొదలవుతుంది. ఈ ప్రక్రియలోనే మనం పరిశుద్ధులుగా మార్చబడుతుంటాం, క్రీస్తు పోలికలోకి తీర్చిదిద్దబడు తుంటాం. ఇది జీవితాంతం కొనసాగే ప్రక్రియ. 15వ ఆర్టికల్ నీతిమంతులుగా తీర్చబడటం, పరిశుద్ధపరచబడటం మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తుంది. ధృవీకరణ 15 ఇలా చెప్పుతుంది:

రక్షణార్థమైన విశ్వాసం పరిశుద్ధీకరణకు నడిపిస్తుందని, అది పరిశుద్ధాత్మ శక్తి ద్వారా జీవితంలో పరివర్తనకు అనగా క్రీస్తు స్వరూపంలోనికి మారేందుకు నడిపిస్తుందని మేము ధృవీకరిస్తున్నాము. పరిశుద్ధపరచబడటం అనగా నిరంతర పశ్చాత్తాపడుతూ జీవించడం. పాపం నుండి యేసుక్రీస్తు వైపు తిరిగి ఆయనను ప్రభువుగా, యజమానిగా చేసుకుని ఆయన మీద కృతజ్ఞతాభావంతో ఆధారపడుతూ ఆయనను సేవించే జీవితం (గలతీ. 5:22–25; రోమా. 8:4, 13–14).

దీనికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:

క్రీస్తుతో మనకు పరిశుద్ధమైన ఐక్యత ఉంది. అలాగే ప్రార్థన పశ్చాత్తాపం సిలువ మోయడం ఆత్మ ద్వారా జీవించడం అనే చర్యల ద్వారా క్రీస్తు స్వరూపంలోకి క్రమంగా మనం మారుతూ ఉంటాం. ఈ రెండింటి నుండి నీతిమంతులుగా తీర్చబడటాన్ని వేరుచేసే ప్రతీ అభిప్రాయాన్ని మేము తిరస్కరిస్తున్నాము.

నీతిమంతునిగా తీర్చబడిన వ్యక్తి, ఒకే సమయంలో నీతిమంతునిగా, పాపిగా ఉంటాడు అని మార్టిన్ లూథర్ చెప్పిన మాటను మనం 8వ అధ్యాయంలో చూసాం. క్రీస్తు యొక్క నీతి అతని ఖాతాకు బదిలీ చేయబడటం వలన అతడు నీతిమంతుడు అవుతాడు. అయితే తనలో తాను మాత్రం పాపిగానే ఉంటాడు. మనం క్రీస్తుపై విశ్వాసముంచిన వెంటనే, పాపం అనే రోగం నయం కాదు. లూథర్ చెప్పినదాని ప్రకారం, దేవుడు ఒక వ్యక్తిని

నీతిమంతునిగా ప్రకటించినప్పుడు, అది రోగిని బాగుచేసే ఒక మందును ఇవ్వడం వంటి చర్య. ఆ స్వస్థత కాలక్రమేణా జరుగుతుంది. అంటే మన పాపానికి స్వస్థత పరిశుద్ధీకరణలో జరుగుతుంది. ఈ పరిశుద్ధీకరణ అనేది జీవితాంతం కొనసాగే ప్రక్రియ. మనం చనిపోయి, బైబిలులో చెప్పినట్లుగా మహిమలోకి *ప్రవేశించే* వరకు అది పూర్తి కాదు. పరిశుద్ధీకరణ అనే సుదీర్ఘ ప్రక్రియకు ముగింపు ఈ మహిమపరచబడటమే.

మనం పరిశీలిస్తున్న ఈ సిద్ధాంతాల డాక్యుమెంట్ ప్రకారం, పరిశుద్ధీకరణ అనేది నీతిమంతులుగా తీర్చబడినవారిలో తప్పనిసరిగా కనిపించే ఫలితం. ఇది జరగడానికి అవకాశం ఉన్న పరిణామం కాదు, ఖచ్చితంగా జరిగే పర్యవసానం. ఇది చాలా ముఖ్యం, ఎందుకంటే కొంతమంది ఒక వ్యక్తి నీతిమంతునిగా తీర్చబడినా, పరిశుద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించక పోవచ్చని నమ్ముతారు. అంటే వారు జీవితాంతం 'శరీరానుసారమైన క్రైస్తవులుగా' ఉండవచ్చని వారు భావిస్తారు. ఈ నమ్మకం మనం తరచుగా గమనించే ఒక సమస్య నుండి ఏర్పడిందని నేను అనుకుంటున్నాను. అదేంటంటే ఎవరైనా సువార్తను విని దాని ద్వారా ప్రభావితమై, క్రీస్తును విశ్వసిస్తున్నట్లు ప్రకటిస్తారు; అయితే ఆ తర్వాత వారి జీవితంలో ఏ విధమైన మార్పూ బయటికి కనబడదు. కొందరు సానుకూల దృక్పథంతో స్పందించి ఆ వ్యక్తి తన విశ్వాసం గురించి చెప్పిన మాటను నమ్ముతారు. "వారు నిజమైన క్రైస్తవులే. అయితే పరిశుద్ధీకరణ ఇంకా ప్రారంభించలేదు" అని భావిస్తారు. అయితే చారిత్రక, బైబిల్ ఆధారిత క్రైస్తవ విశ్వాసం స్పష్టంగా చెబుతున్నదేమిటంటే ఒక వ్యక్తి నీతిమంతునిగా తీర్చబడిన వెంటనే, అతనిలో పరిశుద్ధీకరణ ప్రారంభమవుతుంది.

ఖచ్చితంగా, నీతిమంతునిగా తీర్చబడిన వ్యక్తిలో ఒక పెద్ద మార్పు వస్తుంది. అదే దేవుని శాపం క్రింద ఉన్న స్థితి నుండి, ఆయన దృష్టిలో నీతిమంతుడైన స్థితికి మారడం. నిజమైన విశ్వాసం లేకుండా ఎవరూ నీతిమంతులుగా తీర్చబడలేరు. అయితే ఆ విశ్వాసం నూతన సృష్టికి లేదా నూతన జన్మకు ముందా, వెనుకా అనే దానిపై క్రైస్తవుల్లో అభిప్రాయభేదం ఉంది. నూతన సృష్టి అంటే, పరిశుద్ధాత్మ ద్వారా ఒక వ్యక్తి ఆధ్యాత్మిక మరణం నుండి ఆధ్యాత్మిక జీవంలోకి మార్చబడటం. కొందరి నమ్మకం ఏమిటంటే, మొదట విశ్వాసం కలుగుతుంది, ఆ విశ్వాసం యొక్క తక్షణ ఫలితంగా ఆ వ్యక్తి నీతిమంతునిగా తీర్చబడటమే కాకుండా, నూతనంగా సృష్టించబడతాడు. ఈ రెండూ నీతిమంతునిగా తీర్చబడటంతో ముడిపడిన ముఖ్యమైన మార్పులే. అంటే ఒక వ్యక్తి విశ్వాసముంచగానే, అతడు అవిశ్వాసి ఉండక విశ్వాసిగా మారతాడు. తిరిగి జన్మించని వ్యక్తిగా ఉండక నూతన సృష్టిగా మారతాడు.

రిఫార్మ్డ్ (వాక్యానుసారమైన) థియాలజీ, విశ్వాసం, నూతన జన్మల వరుస క్రమాన్ని మారుస్తుంది. అంటే నూతన జన్మ అనేది విశ్వాసానికి ముందే జరుగుతుందని వాక్యం చెబుతుంది. ఇక్కడ 'ముందు' అంటే అది సమయాన్ని సూచించడం లేదు. నూతన సృష్టిగా చేయబడిన వ్యక్తి పదిహేను సంవత్సరాల తర్వాత విశ్వసిస్తాడని కాదు. లేదా నూతన సృష్టిగా చేయబడిన వ్యక్తి ఐదు నిమిషాల తర్వాత విశ్వసిస్తాడని కాదు. అంటే ఏకకాలంలో జరిగే వాటి గురించి వాక్యం మాట్లాడుతున్నది. అయితే తార్కిక క్రమం ప్రకారం, నూతన జన్మ ముందే జరుగుతుంది. ఎందుకంటే నిజమైన విశ్వాసం కలగాలంటే, నూతన జన్మ అనేది ఒక తప్పనిసరి షరతు, ముందస్తు అవసరం. రిఫార్మ్డ్ థియాలజీ ప్రకారం, ఒక వ్యక్తిలో

నిజమైన విశ్వాసం వ్యక్తమవ్వాలంటే, దేవుడు మొదట పరిశుద్ధాత్మ ద్వారా అతని ఆత్మలో కృపతో కూడిన కార్యం చేయాలి. ఆ కార్యం ద్వారానే అతడు ఆధ్యాత్మిక మరణం నుండి ఆధ్యాత్మిక జీవంలోకి లేపబడి, తిరిగి జన్మిస్తాడు. యేసు నీకొదేముతో చెప్పినట్లు, "ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు" (యోహాను 3:3).

నిజమైన విశ్వాసం కలిగిన వ్యక్తి, నూతనంగా జన్మించిన వ్యక్తి, అనగా తిరిగి జన్మించిన వ్యక్తియై ఉంటాడు. అందుకే నీతిమంతులుగా తీర్చబడిన వెంటనే, పరిశుద్ధీకరణ తప్పక మొదలవుతుంది: విశ్వాసం ఉండి, తిరిగి జన్మించిన వ్యక్తి అంటే, పరిశుద్ధాత్మ సహాయంతో అతని అంతరంగిక స్థితి మారిందని అర్థం. కాబట్టి అతనిలో పరిశుద్ధీకరణ అనే ప్రక్రియ లేదా క్రీస్తు సారూప్యంలోకి ఎదగడం అనే ప్రక్రియ ఖచ్చితంగా ప్రారంభమై ఉంటుంది.

పరిశుద్ధీకరణ ప్రక్రియలో నిరంతర పశ్చాత్తాపం ఉంటుంది. క్రైస్తవ జీవితాన్ని ప్రారంభించేటప్పుడు మాత్రమే పశ్చాత్తాపం చెందాలని కొంతమంది క్రైస్తవులు అనుకుంటారు. దేవుని ముందు మన పాపాలను ఒప్పుకుని, హృదయాన్ని మనస్సును మార్చుకుంటాం. దీన్నే మనం మారుమనస్సు అంటాం. ఇది సువార్తకు మన మొదటి స్పందన. అయితే మనం చర్చిస్తున్న ఈ సిద్ధాంతాల డాక్యుమెంట్, పశ్చాత్తాపం అనేది జీవితాంతం అభ్యసించవలసిన చర్య అని చెబుతుంది. మన జీవితాల్లో పాపం ఉన్నంత కాలం, ఆ పాపాన్ని ఒప్పుకోవాల్సిన అవసరం ఉంటుంది. దాని నుండి దిశ మార్చుకోవాల్సిన అవసరం ఉంటుంది. అందుకే క్రైస్తవ జీవితం అనేది పశ్చాత్తాపంతో కూడిన జీవితం. కాబట్టి మనం సిలువ దగ్గర చూపించిన ఆ మొదటి పశ్చాత్తాపం ఒక్కసారితో ముగిసిపోదు.

మనం ప్రతిరోజూ మన పాపాలను ఆయన దగ్గర ఒప్పుకోవాలని, పశ్చాత్తాపంతో కూడిన జీవితాన్ని జీవించాలని పిలువబడ్డాము. మనం పరిశుద్ధతలో ఎదుగుతున్నప్పుడు, పాపపు అలవాట్ల నుండి క్రియల నుండి మరింత ఎక్కువగా దూరమవుతాము. పాపం నుండి యేసుక్రీస్తు వైపు తిరిగి మన ప్రభువు యజమాని అయిన ఆయన మీద కృతజ్ఞత భావంతో ఆధారపడుతూ ఆయనను సేవించడమే మన జీవితాశయంగా మారుతుంది.

మనం రక్షణ పొంది, క్రీస్తుతో రక్షణార్థమైన సంబంధంలోకి వచ్చిన తర్వాత, నీతి కోసం మన అన్వేషణ ముగిసిపోదు. అది అప్పుడే మొదలవుతుంది. మనం దేవుణ్ణి కనుగొనినప్పుడు, ఆయన కోసం మన అన్వేషణ ముగిసిందని తరచుగా అనుకుంటాం. అయితే నిజానికి స్వభావసిద్ధంగా ఏ మనిషీ కూడా దేవుణ్ణి వెదకడు అని లేఖనాలు చెబుతున్నాయి. దేవుడు మనల్ని కనుగొన్న తర్వాత మాత్రమే మనం నిజంగా ఆయనను వెదకడం ప్రారంభిస్తాము. దేవుని కోసం, ఆయన రాజ్యం కోసం మన అన్వేషణ ఒక జీవితకాల ప్రయాణం. ఇది మనలను నీతిమంతులుగా ప్రకటించడంతో మొదలవుతుంది. మనం ప్రయాణం యొక్క గమ్యానికి ఇంకా చేరుకోలేదు. మనం ఇంకా మన లక్ష్యాన్ని చేరుకోలేదు. దేవుడు మనల్ని నీతిమంతులుగా ప్రకటించడం వలన మనం సురక్షితమైన స్థితిలో ఉన్నాము. అయినప్పటికీ మనం ఇంకా ఆయన స్వరూపానికి అనుగుణంగా మారే ప్రక్రియలోనే ఉన్నాము. నిరంతర ప్రార్థన, పశ్చాత్తాపం, సిలువను మోయడం, పరిశుద్ధాత్మ శక్తితో ఆయన యొక్క సన్నిధి వెలుగులో మన జీవితాన్ని పూర్తిగా జీవించడం ద్వారా మనం క్రీస్తు సారూప్యంలోనికి ఎదుగుతుంటాం.

అధ్యాయం పది

# రక్షించే విశ్వాసం

“ది గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్: ఎన్ ఇవాంజెలికల్ సెలబ్రేషన్” అనే డాక్యుమెంట్‌లోని 16వ ఆర్టికల్ రక్షణార్థమైన విశ్వాసంలోని మూడు అంశాలను ప్రకటిస్తుంది. ధృవీకరణ 16 ఇలా చెప్పుతుంది:

> సువార్తలోని సత్యాలను మానసికంగా అంగీకరించడం, మన పాప స్థితినీ అవసరాన్నీ గుర్తించడం, యేసుక్రీస్తునందు ఆయన చేసిన కార్యంనందు వ్యక్తిగతంగా నమ్మకం ఉంచి ఆధారపడడం అనే ఈ మూడు అంశాలు రక్షణార్థమైన విశ్వాసంలో భాగాలని మేము ధృవీకరిస్తున్నాము.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఈ విధంగా ఉంది:

> రక్షణార్థమైన విశ్వాసంలో సువార్తను కేవలం మనసుతో అంగీకరిస్తే చాలు అనే అభిప్రాయాన్ని, కేవలం నోటి మాటతో ఒప్పుకుంటేనే నీతిమంతులుగా తీర్చబడతామనే అభిప్రాయాన్ని మేము తిరస్కరిస్తున్నాము. అంతేకాక, రక్షణార్థమైన విశ్వాసంలోని ఏదో ఒక అంశం మన సత్క్రియల ద్వారా లభిస్తుందని చెప్పినా దానిని మేము తిరస్కరిస్తున్నాము.

సువార్తలోని సత్యాలను మానసికంగా అంగీకరించడం గురించి ఆర్టికల్ 16 మొదటిగా ధృవీకరిస్తున్నది. నీతిమంతులుగా తీర్చబడడం అనే సిద్ధాంత సారాంశాన్ని లూథర్ స్పష్టంగా వివరించినప్పుడు, కేవలం విశ్వాసం ద్వారా మాత్రమే నీతిమంతులుగా తీర్చబడటం అంటే ఏమిటనే దాని గురించి చాలా గందరగోళం ఏర్పడింది. కేవలం "నేను సువార్త సత్యాన్ని అంగీకరిస్తున్నాను" అనే మాట చెప్పడం మిమ్మల్ని పరలోకం చేర్చేందుకు సరిపోతుందా? ఈ గందరగోళం కారణంగానే, నిజమైన రక్షణార్థమైన విశ్వాసంలోని కీలక భాగాలను 16వ శతాబ్దపు సంఘసంస్కర్తలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం వచ్చింది.

రక్షణార్థమైన విశ్వాసంలో మూడు అంశాలు ఉన్నాయని సంస్కర్తలు గుర్తించారు: అవి *నోటిషియా, అస్సెన్సస్, ఫిడూషియా. నోటిషియా* అంటే సువార్తలోని సమాచారం, సారాంశం. ఏది నమ్మినా మనుషులకు రక్షణ కలుగుతుందని మేము నమ్మము. క్రొత్త నిబంధనలో విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడటం గురించి మాట్లాడినప్పుడు, అది కొన్ని సత్యాలను, అన్నిటికంటే

ముఖ్యంగా ఒక నిర్దిష్ట వ్యక్తిని నమ్మాలని చెబుతున్నది. ఆ నిర్దిష్ట వ్యక్తి క్రీస్తే. సువార్త ప్రకటించబడుతున్నప్పుడు, దానిలో యేసు ఎవరు, ఆయన ఏమి చేశాడు ఆయన సిలువపై చనిపోయాడు, మరణం నుండి తిరిగి లేచాడు అనే నిర్దిష్టమైన సమాచారం ఉంటుంది. ఇవన్నీ రక్షణార్థమైన *విశ్వాసంలోని (నోటిషియాలో)* భాగం.

రక్షణార్థమైన విశ్వాసంలో రెండవ భాగం అస్సెన్సస్. దీని అర్థం మేధస్సుపరంగా మానసికంగా అంగీకరించడం. 'యేసు మృతుల్లో నుండి లేచాడని మీరు నమ్ముతున్నారా?' అని నేను అడిగితే, "సువార్తలోని సమాచారాన్ని మీరు మనస్ఫూర్తిగా నిజమని ఒప్పుకుంటున్నారా?" అని అడుగుతున్నట్లు. సువార్త ఏం బోధిస్తుందో తెలుసుకుంటే సరిపోదు. రక్షణార్థమైన విశ్వాసం ఉండాలంటే, ఆ బోధలు సత్యమని కూడా మనం నమ్మాలి. "యేసు మరణించాడు, నిజంగా సమాధి చేయబడ్డాడు, చారిత్రాత్మకంగా మృతుల్లో నుండి తిరిగి లేచాడు" అనేవే ఆ బోధలు. యేసు రక్షకుడు అని ఎవరైనా నమ్మకపోయినా, యేసు రక్షకుడు అనే ఆ ఆలోచనే సత్యమని ఒప్పించబడకపోయినా, యేసు ఇంకా సమాధిలోనే ఉన్నాడని నమ్ముతున్నా, ఆయన సిలువ మరణమే ప్రాయశ్చిత్తం అని నమ్మకపోతే, బైబిలు ప్రకారం సంస్కర్తల ప్రకారం ఆ వ్యక్తికి "రక్షణార్థమైన విశ్వాసం" లేదు. రక్షణ పొందాలంటే, యేసు గురించి ఆయన చేసిన కార్యం గురించి చెప్పబడిన మాటలు సత్యమని ఆ వ్యక్తి మనసులో హృదయపూర్వకంగా అంగీకరించాలి.

రక్షణార్థమైన విశ్వాసంలో మూడవ అంశం కూడా ఉంది. యాకోబు వ్యంగ్యంగా ఇలా రాశాడు: "దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి

వణకుచున్నవి” (యాకోబు 2:19). “దేవుడు ఉనికిలో ఉన్నాడు” అనే విషయాన్ని మానసికంగా అంగీకరిస్తే సరిపోదని యాకోబు చెబుతున్నాడు. దేవుడు ఉన్నాడని దయ్యానికి కూడా తెలుసు. అదే విధంగా, యేసు తన గురించి తాను చెప్పుకున్నదానిని, సిలువపై ప్రాయశ్చిత్త మరణం పొందాడని, సమాధి నుండి లేచాడని మీరు మనస్ఫూర్తిగా నమ్మినా, అదంతా మీకు ఒక దయ్యంగా అర్హత పొందడానికి మాత్రమే సరిపోతుంది. ఎందుకంటే ఆ సత్యాలన్నీ దయ్యాలకు కూడా తెలుసు. మానసిక అంగీకారం లేకుండా మీరు నీతిమంతులుగా తీర్చబడలేరు. అయితే కేవలం అంగీకారం ఉన్నంత మాత్రాన నీతిమంతులుగా తీర్చబడతారనే హామీ లేదు. మనకు *ఫిడూషియా* అంటే వ్యక్తిగత నమ్మకం అవసరం, ఆ సత్యాలపైన ఆధారపడటం అవసరం. విశ్వాసం ద్వారా క్రీస్తును అంగీకరించడం గురించి హత్తుకోవడం గురించి క్రీస్తు వద్దకు రావడం గురించి లేఖనాలు మాట్లాడినప్పుడు, ఆయన రక్షకుడు అని నమ్మడం మాత్రమే కాదు, తమ సొంత రక్షకునిగా ఆయన్ని నమ్మాలని సూచిస్తున్నాయి. మన విమోచన కోసం మనం ఆయన చేసిన కార్యంపైనా, ఆయన నీతిపైనా ఆధారపడాలి. దీనినే నమ్మడం లేదా *ఫిడూషియా* అంటారు.

యేసు ప్రభువని నోటితో ఒప్పుకొని, హృదయమందు విశ్వసించిన యెడల మనం రక్షింపబడతామని బైబిలు చెబుతోంది (రోమా. 10:9). అనేక సందర్భాలలో, దేవుని ప్రజలు బహిరంగంగా తమ విశ్వాసాన్ని వెల్లడించాలని లేఖనాలు పిలుపునిస్తున్నాయి. సాధారణంగా ఒక సంఘంలో చేరడానికి ఏదో ఒక రకమైన బహిరంగ ఒప్పుకోలు అవసరం. విచారకరమైన విషయం ఏంటంటే, మన క్రైస్తవ్యాన్ని వ్యక్తిగతమైన, గోప్యమైన మతంగా ఈ రోజుల్లో సమాజం భావిస్తోంది. ఇది వ్యక్తిగత విషయం

అని చెబుతూ, చాలామంది క్రీస్తుపై తాము ఉంచిన విశ్వాసం గురించి బహిరంగంగా సాక్ష్యమివ్వడానికి వెనకాడుతున్నారు. క్రైస్తవ్యం వ్యక్తిగతమైనది అనడంలో సందేహం లేదు. విశ్వాసం ద్వారా ఒక వ్యక్తి క్రీస్తుతో కలిగి ఉండే బంధం కంటే వ్యక్తిగతమైనది మరేదీ ఉండదని నేను అనుకుంటున్నాను. అయితే క్రైస్తవ్యం గోప్యమైనది కాదు. మన విశ్వాసం ఎంత వ్యక్తిగతమైనదైనా, దేవుణ్ణి వెంబడించేవారుగా మనం ఎల్లప్పుడూ బహిరంగంగా క్రీస్తు సేవకులమని స్పష్టంగా చెప్పడానికి పిలువబడ్డాము. “మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోక మందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును” అనే తీవ్రమైన హెచ్చరికలు మనకివ్వబడ్డాయి (మత్తయి 10:33). క్రీస్తు మన విమోచకుడని మనుషుల యెదుట ఒప్పుకోవడానికి మనం ఇష్టపడకపోతే, ఆయన కూడా తండ్రి ముందు మనల్ని ఒప్పుకోడు. కాబట్టి క్రీస్తునందు విశ్వాసాన్ని బహిరంగంగా ఒప్పుకోవడం అనేది క్రైస్తవునికి ప్రత్యామ్నాయం కాదు, తప్పనిసరి.

నిజమైన విశ్వాసం లేకపోయినా “మేము విశ్వాసం కలిగినవారమే” అని చెప్పుకునేవారికి కూడా యేసు తీవ్రమైన హెచ్చరికలు జారీచేశాడు. “ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది” అని మన ప్రభువు చెప్పాడు (మత్తయి 15:8). యేసు ఇచ్చిన సందేశాలన్నిటి కంటే అత్యంత భయంకరమైనది కొండ మీద ప్రసంగం ముగింపులో ఉంది. ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ఇది చెయ్యలేదా? నీ నామమున అది చెయ్యలేదా? ” అని అడుగుతారని ఆయన చెప్పాడు. అప్పుడు ఆయన, “నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని”

అని వారితో అంటాడు (మత్తయి 7:21–23). క్రీస్తుపై నిజమైన విశ్వాసం లేకుండా, కేవలం మాటల రూపంలో విశ్వాసాన్ని ఒప్పుకునే ప్రమాదం ఉందని మన ప్రభువు మనల్ని హెచ్చరిస్తున్నాడు. మరో మాటలో చెప్పాలంటే, మనం విశ్వాసాన్ని ఒప్పుకోవడం ద్వారా కాదు, విశ్వాసాన్ని కలిగి ఉండటం ద్వారా నీతిమంతులుగా తీర్చబడతాము. మనం విశ్వాసం కలిగి ఉండకుండానే, దాన్ని ఒప్పుకోగలం. ఈ ఆర్టికల్ యొక్క తిరస్కరణలో ఉన్న విషయం ఇదే; కేవలం బయటకు కనిపించే ఒప్పుకోలు ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతామనే విషయాన్ని ఈ తిరస్కరణ తోసిపుచ్చుతుంది.

దీన్ని మనం ఆచరణాత్మకంగా చూద్దాం. అమెరికాలో, ముఖ్యంగా బహిరంగ సువార్త సభల్లో, సువార్త ప్రకటించిన తర్వాత, క్రీస్తును అంగీకరించమని పిలుపునివ్వడం తరచుగా జరుగుతుంది. దీన్నే కొన్నిసార్లు 'ఆల్టర్ కాల్' అని కూడా అంటారు. ఎవరైనా క్రీస్తును తమ రక్షకునిగా అంగీకరిస్తున్నాము అని మనస్ఫూర్తిగా ఒక ప్రార్థన చేస్తే విమోచించబడతారని ఇక్కడ అనుకుంటారు. అయితే ప్రజలు బహిరంగంగా విశ్వాసముంచామని వెల్లడించే విధంగా వారి భావోద్వేగాలను రేపడం సాధ్యమే. అయితే కేవలం ఒక ప్రార్థనను చదవడం ద్వారా దేవుని ముందు నీతిమంతులుగా తీర్చబడతామని బైబిలు బోధించడం లేదు. కేవలం చేయి ఎత్తడం ద్వారా, అలాగే బలిపీఠం వద్దకు నడవడం ద్వారా కూడా మనం నీతిమంతులుగా తీర్చబడము. మనం విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతాము. ఈ పద్ధతులన్నీ విశ్వాసాన్ని ఒప్పుకోవడానికి బయటకు కనిపించే సూచనలు మాత్రమే. నిజమైన విశ్వాసం లేకుండా కూడా ఇలాంటివి జరగవచ్చు. అయితే కేవలం మనం ముందుకు వచ్చినంత మాత్రాన లేదా చేయి ఎత్తినంత మాత్రాన లేదా ప్రార్థన చేసినంత మాత్రాన మనం

క్రీస్తు మందలో సురక్షితంగా ఉన్నామని అనుకోకూడదు. నిజంగా మనకు అవసరమైనది విశ్వాసం మాత్రమే.

చివరిగా తిరస్కరణ ఇలా చెబుతోంది: "రక్షణార్థమైన విశ్వాసంలోని ఏదో ఒక అంశం మనకు రక్షణను సంపాదించి పెడుతుందనే అభిప్రాయాన్నీ ఈ అంశాల్లో ఏ ఒక్కటైనా మన సత్క్రియల ద్వారా లభిస్తుందనే అభిప్రాయాన్నీ మేము తిరస్కరిస్తున్నాము. ఇక్కడ కొంత అయోమయానికి గురిచేసే అంశం ఉంది. ఎందుకంటే "దేవుడు పంపిన వానియందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ" అని యేసు ఒక సందర్భంలో చెప్పాడు (యోహాను 6:29). అందువల్ల నీతిమంతులుగా తీర్చే ఏకైక సత్క్రియ, విశ్వాసం అనే క్రియ అని కొంతమంది అర్థంచేసుకున్నారు. నిజమైన విశ్వాసానికి క్రియలకు మధ్యన ఏదో ఒక రకమైన సంబంధం ముడిపడి ఉందని, కాబట్టి విశ్వాసానికి క్రియలకు మధ్య తేడా ఏమీ లేదని వారు భావిస్తారు. దైవశాస్త్ర సంబంధమైన చర్చల్లో, "విశ్వసించడం ద్వారా మీలో ఏదో యోగ్యత ఉందని అని మీరు నమ్ముతున్నారా?" అని అడిగితే, క్రైస్తవులలో ఎక్కువ మంది, "ఖచ్చితంగా కాదు, నేను యేసు చేసిన పుణ్య కార్యాలపై మాత్రమే నమ్మకం ఉంచుతాను" అని చెబుతారు. అయినప్పటికీ మనసు లోపల మాత్రం, మన విశ్వాసంలో అంతర్గతంగా ఏదో గొప్పతనం ఉందని మనం తరచుగా అనుకుంటాము. దేవుడు మన విశ్వాసాన్ని ఒక మంచి గుణంగా చూసి బహుమతి ఇస్తాడని నమ్మడానికి మొగ్గు చూపుతాము.

మీరు క్రైస్తవులు ఎందుకయ్యారో, వేరే వ్యక్తి ఎందుకు క్రైస్తవుడు కాదో ఒక్కసారి ఆలోచించండి. మీరు మీ పొరుగువాడు చేయని ఏదైనా నీతి కార్యాన్ని చేసినందువల్లనా? "నా పొరుగువాని కంటే నేను మంచివాడిని కాబట్టి నేను క్రైస్తవుణ్ణి' అని ఎవరూ

బహిరంగంగా చెప్పరు. అయినప్పటికీ ఆ ఆలోచన కొన్నిసార్లు మన మనస్సుల్లోకి వస్తుంది. రక్షణార్థమైన విశ్వాసంలోకి రావడానికి మనలో ఏదో యోగ్యత ఉందని, మంచి గుణం ఉందని ఒక్క క్షణం ఆలోచించినా, అది మనకు మనం చేసుకునే తీవ్రమైన మోసం అవుతుంది. ఆగస్టస్ టోప్లడే 'రాక్ ఆఫ్ ఏజెస్' అనే పాట రాసినప్పుడు, "నా చేతితో ఏమీ తేలేను; కేవలం నీ సిలువనే హత్తుకొని యున్నాను" అని సరిగ్గా చెప్పాడు. విశ్వాసం అనేది ఇతరుల యోగ్యతను మనం పొందడానికి ఉపయోగపడే ఒక సాధనం మాత్రమే. అంతేకానీ ఏదో ఒక పుణ్య కార్యం ద్వారా దేవుని రక్షణ అనుగ్రహంపై మనకు హక్కును ఇచ్చేది కాదు.

రక్షణార్థమైన విశ్వాసంలోని అంశాలను పరిశీలించేటప్పుడు, మన రక్షణ దేవుని నుండి వచ్చిందని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం; అది దేవుని కృపపై, క్రీస్తు చేసిన కార్యంపై ఆధారపడి ఉంటుంది. మన క్రియలు ఎన్నడూ ఆయనను సంతృప్తిపరచ లేవు. క్రీస్తు జరిగించిన క్రియలు మాత్రమే దేవుణ్ణి సంతృప్తిపరుస్తాయి. మన తరపున వేరొకరు సంపాదించిన పుణ్యాన్ని, "విశ్వాసం" కేవలం స్వీకరిస్తుంది. మనం కృపకు అర్హులం అని, ఆయన దయను సంపాదించుకున్నాం అని, అందుకే దేవుడు మనల్ని ఆశీర్వదించాడు అనే ఆలోచన మన మనస్సుల్లోకి, హృదయాల్లోకి రాకుండా మనం జాగ్రత్తపడాలి.

మనం కేవలం విశ్వాసాన్ని మనుషుల ముందు ఒప్పుకోవడం ద్వారా కాదు, నిజమైన విశ్వాసాన్ని కలిగి ఉండటం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతాము. క్రైస్తవులుగా మనం క్రీస్తు గురించి సిగ్గుపడకూడదు. మనం ఆయనపై ఉంచిన విశ్వాసాన్ని ప్రజలకు తప్పక తెలియజేయాలి.

అధ్యాయం పదకొండు

# క్రీస్తు, సిద్ధాంతం

సువార్తను గురించిన ఒక పరీక్షలో మనం నూటికి నూరు శాతం మార్కులు సాధించినా, మనలో నిజమైన రక్షణార్థమైన విశ్వాసం లేకపోవచ్చు. సువార్త గురించిన జ్ఞానం కలిగి ఉన్నా, ఆ జ్ఞానాన్ని మేధోపరంగా హత్తుకున్నా కూడా, అది మనల్ని రక్షించలేదు. మనల్ని రక్షించేది, నిజానికి క్రీస్తే. దీనికి సంబంధించిన ధృవీకరణ 17 ఇలా చెప్పుతుంది:

> సత్య సిద్ధాంతం ఆధ్యాత్మిక ఆరోగ్యానికి శ్రేయస్సుకు అత్యంత అవసరమైనప్పటికీ, కేవలం సిద్ధాంతం ద్వారా మనం రక్షించబడము అని మేము ధృవీకరిస్తున్నాము. క్రీస్తు

ద్వారా మనం ఎలా రక్షణ పొందవచ్చో తెలియజేయడానికి సిద్ధాంతం అవసరం, కానీ మనల్ని రక్షించేది క్రీస్తే.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:

సువార్త యొక్క సిద్ధాంతాలను తిరస్కరించినా ఎటువంటి నష్టమూ జరగదు అనే అభిప్రాయాన్ని మేము ఖండిస్తున్నాము. సువార్తను తిరస్కరించడం ఆధ్యాత్మిక నాశనానికి దారితీస్తుంది. అంతేకాక అది మనల్ని దేవుని తీర్పుకు గురిచేస్తుంది.

"మన ఆత్మల రక్షకుడు క్రీస్తే" అని మనకు తెలుసు. ఐతే దీని అర్థం క్రీస్తు సిద్ధాంతాలు సువార్త సిద్ధాంతాలు ముఖ్యమైనవి కావు అని కాదు. సిద్ధాంతం మనల్ని రక్షించకపోయినా, అది మన ఆధ్యాత్మిక ఆరోగ్యానికి శ్రేయస్సుకు చాలా అవసరం. "తన సమకాలీనుడైన ఎరాస్మస్ పోప్ పొట్టపై కొట్టాడు, కానీ నేను పోప్‌ను సిద్ధాంతంలో దెబ్బకొట్టాను" అని మార్టిన్ లూథర్ అన్నాడు. ఈ రోజుల్లో సిద్ధాంతం గురించి ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కాబట్టి సిద్ధాంతంపై దాడిచేయడం కంటే వారి కడుపులో కత్తి దింపడమే పెద్ద నేరమవుతుంది. మరొక సందర్భంలో, తన అనుచరులలో కొందరు అసభ్యకరంగా ప్రవర్తించారని లూథర్ సవాలు చేయబడ్డాడు. అప్పుడు "సంస్కరణ ఉద్యమంలో కూడా చాలామంది చెడ్డవారు ఉన్నారని, వాళ్లు సువార్తకు అపవాదు తెస్తున్న మాట నిజమేనని" లూథర్ అంగీకరించాడు. అయితే ప్రతి విశ్వాస సమూహంలో కూడా ఈ సమస్య ఉందని లూథర్ చెప్పాడు. తమ దగ్గర ఉన్నదేమిటంటే "సరైన సిద్ధాంతం" అని అతడు నొక్కిచెప్పాడు. సరైన సిద్ధాంతం

దుష్ప్రవర్తనను సమర్థిస్తుందని లూథర్ ఉద్దేశం కాదు. అయితే దేవుడు లేఖనాలలో మనకిచ్చిన సత్యాన్ని విస్మరిస్తూ దేవుణ్ణి సంతోషపెట్టే జీవితాన్ని జీవించడం సాధ్యం కాదని, సిద్ధాంతం అందుకే ప్రాముఖ్యం అని లూథర్ చెప్పాడు.

సాధారణంగా "సిద్ధాంతం" అంటే నిర్వచించడానికి వీలుకాని మాటల జాబితా అని, అది కేవలం గ్రంథాలయాల్లో దుమ్ము పట్టిన గదులకూ విద్యా సంస్థలకూ పరిమితమైనదని, మన అనుదిన జీవితానికి ఏ మాత్రమూ సంబంధం లేనిదని మనం భావిస్తాం. అలా అనడం బైబిలు మన జీవితాలపై ఎలాంటి ప్రభావమూ చూపదు అని చెప్పడమే. సరైన సిద్ధాంతానికీ సరైన ఆచరణకూ మధ్యనున్న వ్యత్యాసం గురించి మనం మాట్లాడవచ్చు, కానీ వాటిని వేరుచేయకూడదు. ఎందుకంటే దేవుడు లేఖనాలలో మనకు బయలుపరిచిన సత్యం గురించిన సరైన అవగాహనలో నుంచే సత్యమైన జీవితం ప్రవహిస్తుంది. సువార్తను అర్థంచేసుకునే విషయంలో ఇది మరింత సత్యం.

క్రైస్తవులుగా మనం సువార్తను సరిగ్గా అర్థంచేసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే సువార్తే రక్షణ విషయంలో దేవుని శక్తి. ఈ సువార్త పరిశుద్ధ లేఖనాలలో మనకు బయలుపరచబడింది. ఇందులో క్రీస్తు యొక్క దైవ మానవ స్వభావాలు, ఆయన పాపరహిత జీవితం, ప్రాయశ్చిత్త మరణం, పునరుత్థానం అన్నీ ఇమిడి ఉన్నాయి. ఈ విషయాలన్నీ లేఖనాలలో మనకు వెల్లడైన సత్యాలు. ఇవన్నీ సువార్త సందేశంలో అంతర్భాగమై ఉన్నాయి. మనం ఈ డాక్యుమెంట్ అంతటా పరిశీలించినది, సువార్త సారాంశంలో ఉన్న నిర్దిష్ట అంశాలనే.

ఉదాహరణకు ప్రాయశ్చిత్త బలి గురించిన మీ సిద్ధాంతం తప్పుగా ఉంది అనుకోండి. ఉదాహరణకు యేసు సిలువపై చనిపోయింది

మన స్థానంలో దేవుని న్యాయాన్ని సంతృప్తిపరచడానికి కాకుండా, కేవలం నైతికంగా ఒక మాదిరి చూపడానికే అని మీరు నమ్ముతున్నారు అనుకోండి. సిలువ గురించి, ప్రాయశ్చిత్తం గురించి తప్పుడు సిద్ధాంతం కలిగి ఉండటం వలన, మీరు సువార్తను సరిగ్గా గ్రహించనట్లే. ప్రాయశ్చిత్తబలి గురించిన మీ సిద్ధాంతం తప్పయితే, మీ సువార్త సిద్ధాంతం కూడా కుప్పకూలిపోయినట్లే. మీరు క్రీస్తు పునరుత్థానాన్ని నిరాకరిస్తే, ఆ సత్యాన్ని కోల్పోవడమే కాకుండా, మీ దగ్గర సువార్త కూడా లేనట్లే. ఎందుకంటే పునరుత్థానం సువార్తలో ఒక ముఖ్యమైన భాగం. ఒకవేళ మీరు ప్రాయశ్చిత్తాన్ని, పునరుత్థానాన్ని నమ్మినా, రక్షణ పొందడానికి క్రీస్తు కార్యం వలన కలిగే ప్రయోజనాలను మీరు ఏదో విధంగా సంపాదించుకోవాలి అని మీరు నమ్మితే, అప్పటికీ మీరు సువార్తను సరిగ్గా అర్థంచేసుకోనట్లే. ఎందుకంటే క్రీస్తు కార్యం మీ జీవితంలో ఎలా పని చేస్తుందనే ముఖ్యమైన విషయాన్ని మీరు అర్థం చేసుకోలేదు.

"నాకు ఏ సిద్ధాంతాన్నీ తెలుసుకోవలసిన అవసరం లేదు. నాకు కేవలం యేసు గురించి తెలిస్తే చాలు" అని కొంతమంది అంటారు. అయితే "యేసు ఎవరు?" అనేదే ఇక్కడ ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం మొదలుపెట్టిన ఆ క్షణమే, వారు సిద్ధాంతం గురించి చర్చించడం మొదలుపెడుతున్నారు. ఆ ప్రశ్నకు జవాబు చెప్పడమంటే, క్రీస్తు గురించిన తమ సిద్ధాంతాన్ని వివరించడమే. తమకు దైవశాస్త్రం తెలుసుకోవాల్సిన అవసరం లేదని భావించే క్రైస్తవులు ముఖ్యమైన విషయాన్ని అర్థంచేసుకోలేదు. మీరు వృత్తిపరంగా దైవశాస్త్ర నిపుణులో పండితులో కానవసరం లేదు. మీరు ఒక రకంగా దైవశాస్త్రాన్ని ఎరిగిన విద్యార్థులుగా ఉండాలి, అంటే మీకు దేవుని గురించి, క్రీస్తు గురించి కొంత అవగాహన ఉండాలి. సువార్తను అర్థంచేసుకోవడానికి, మీకు దేవుని గురించిన

సిద్ధాంతం, మానవుని గురించిన సిద్ధాంతం, క్రీస్తు గురించిన సిద్ధాంతం పట్ల తప్పనిసరిగా అవగాహన ఉండాలి. కాబట్టి ఇక్కడ ప్రశ్న మీకు దైవశాస్త్రం ఉందా లేదా అనేది కాదు. మీరు కలిగి ఉన్న దైవశాస్త్రం సరైనదా కాదా? మీ సిద్ధాంతం మంచిదా కాదా? అనేదే అసలు ప్రశ్న.

సంఘంలో మనం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన చర్చల్లో ఒకటి: రక్షణ పొందాలంటే, ఏ సిద్ధాంతాలు తప్పక నమ్మాలి? అంటే ఏ సిద్ధాంతాలను ఒప్పుకోకపోతే మీరు క్రైస్తవులు కాలేరు? రకరకాల సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని సంఘం అనేక రకాలైన డినామినేషన్లుగా విడిపోయింది. ఫలితంగా అనేక తప్పుడు అభిప్రాయాలు సంఘంలోకి చొరబడ్డాయి. దేవుని సత్యాన్ని ఏ విధంగా వక్రీకరించినా అది తీవ్రంగా పరిగణించాల్సిన విషయమే. అయితే అన్ని వక్రీకరణలూ ఒకే స్థాయిలో ప్రమాదకరమైనవి కావు. అందుకే మనం తప్పనిసరైన వాటికీ, తప్పనిసరి కాని వాటికీ మధ్య తేడాను గుర్తించాలి.

“బైబిలు దోషరహితమైనది అని మీరు నమ్ముతారా?” అని నన్ను ఒకసారి ఒక వ్యక్తి అడిగాడు. “అవును, నమ్ముతాను” అని నేను చెప్పాను. అప్పుడు “ఈ సిద్ధాంతం రక్షణ పొందడానికి ఆవశ్యకమా?” అని అతడు అడిగాడు. “లేదు. రక్షణ పొందాలంటే, బైబిలు దేవునిచే ప్రేరేపించబడిందని, అందులో ఎటువంటి తప్పులూ లేవని నమ్మాల్సిన అవసరం లేదు” అని నేను చెప్పాను. రక్షణ యొక్క సందేశానికి సంబంధించి, బైబిలు దేవుని వాక్యమని నమ్మకపోయినా పర్వాలేదు. అయితే “లేఖనాలు దోషరహితమైనవి” అనే సిద్ధాంతం ముఖ్యం కాదని నేను అంటున్నానా? లేదు! నేను చెప్పేదేంటంటే, సంఘ ఉనికికి క్రైస్తవుడి ఉనికికి, సంఘ శ్రేయస్సుకు, క్రైస్తవుని శ్రేయస్సుకు మధ్య

తేడాను మనం గుర్తించాలి. బలమైన లేఖన సిద్ధాంతం సంఘం యొక్క, క్రైస్తవుడి యొక్క శ్రేయస్సుకు చాలా ముఖ్యమైనది. అయితే ఇది రక్షణ పొందడానికి తప్పక నమ్మాల్సిన సిద్ధాంతం కాదు. అయితే క్రీస్తు ప్రాయశ్చిత్తం అనేది కేవలం క్రైస్తవుని యొక్క సంఘం యొక్క శ్రేయస్సుకు సంబంధించిన విషయమా? కాదు! అది అంతకంటే ఎక్కువైనది. రక్షణ పొందాలంటే దాన్ని తప్పక నమ్మాలి. సంఘం యొక్క *ఉనికికి, శ్రేయస్సుకు* మధ్యనున్న ఈ తేడా చరిత్ర అంతటా చాలా ఉపయోగకరంగా ఉంది.

మరలా, మన సిద్ధాంతాల డాక్యుమెంట్ చెప్పిన దాని ప్రకారం, మనం ఎలా రక్షించబడతామో చెప్పడానికి సిద్ధాంతం తప్పనిసరి. మనం సువార్త గురించి ఏ సమాచారం చెప్పినా, అదే సిద్ధాంతం. కాబట్టి మనకు సిద్ధాంతం లేకపోతే, సువార్త గురించి అవగాహన ఉండదు. సిద్ధాంతం లేకపోతే, మనం ఏం నమ్మాలో కూడా తెలియదు. భూకంపం వచ్చిన తర్వాత, చెరసాల తలుపులు బద్దలైనప్పుడు, భయాందోళనలతో అపోస్తలుడైన పౌలు దగ్గరకు ఫిలిప్పీలోని చెరసాల నాయకుడు పరుగెత్తుకు వచ్చాడు. “రక్షణ పొందాలంటే నేను ఏమి చేయాలి?” అని అతడు అడిగాడు (అపొ. కార్య. 16:30). అతడు సమాచారం కోసం అడుగుతున్నాడు. రక్షణకు ఏం కావాలో తెలుసుకోవాలని కోరుకున్నాడు. అప్పుడు రక్షణ పొందడానికి అతడు ఏమి చేయాలో అపోస్తలుడు అతనికి చెప్పాడు.

ఆర్టికల్ 17 యొక్క తిరస్కరణ ఇలా చెబుతోంది: “సువార్త యొక్క సిద్ధాంతాలను తిరస్కరించినా ఎటువంటి నష్టమూ జరగదు” అనే అభిప్రాయాన్ని మేము ఖండిస్తున్నాము. సువార్తను తిరస్కరించడం ఆధ్యాత్మిక నాశనానికి దారితీస్తుంది. అంతేకాక అది మనల్ని దేవుని తీర్పుకు గురిచేస్తుంది.” ఈ డాక్యుమెంట్

'ఆధ్యాత్మిక నాశనం' గురించి మాట్లాడేటప్పుడు, అది శాశ్వతమైన ఆధ్యాత్మిక నాశనాన్ని సూచిస్తుంది. సువార్తను తిరస్కరించే ప్రతి ఒక్కరూ దేవుని తీర్పును ఎదుర్కోవలసి వస్తుంది.

దేవుడు ఇచ్చే సువార్త, మన ముందున్న అనేక మార్గాలలో ఒకటి కాదు. నేటి సంఘాలలో, ఆరాధనకు ముగింపులో ఒక రకమైన "ఆహ్వానం" ఇవ్వడాన్ని మనం చూశాం. అక్కడ పాపులను ముందుకు వచ్చి, తమ జీవితాలను క్రీస్తుకు అప్పగించుకోమని పిలుస్తారు. రక్షణ విషయంలో మనం ఎవ్వరినీ బలవంతం చేయకూడదు. అలాగే అహంకారంగా ఉండకూడదు. దీని గురించి నాకు అవగాహన ఉంది. అయితే ఈ "ఆహ్వానం" అనే పదాన్ని వాడటం వలన, ఒక తప్పుడు భావం వెళ్తోంది. మన సంస్కృతిలో, ఒక ఆహ్వానం సాధారణంగా "RSVP" (మీరు వస్తున్నట్లయితే ముందే తెలియజేయండి) అనే కార్డుతో వస్తుంది. మీరు ఆ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించడానికైనా ప్రతికూలంగా స్పందించడానికైనా స్వేచ్ఛ ఉంటుంది. ఆ ఆహ్వానాన్ని తిరస్కరించినా మీకు ఎలాంటి శిక్షా ఉండదు. అయితే "ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" అని పౌలు ఏథెన్సులో ప్రకటించాడు (అపొ. కార్య. 17:30). క్రొత్త నిబంధనలో, సువార్త ప్రకటన అనేది లోకానికి ఒక దేవుని ఆజ్ఞలా ఉంది. ప్రతి ఒక్కరూ క్రీస్తును అంగీకరించాలని, సువార్తను స్వీకరించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. సువార్తను విన్న తర్వాత కూడా దాన్ని తిరస్కరించడం అంటే, ఆధ్యాత్మిక నాశనాన్ని కోరుకోవడమే, దేవుని తీర్పుకు గురికావడమే.

సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడం కొన్నిసార్లు ప్రమాదకరం కావచ్చు. "జ్ఞానము ఉప్పొంగజేయును గాని ప్రేమ క్షేమాభివృద్ధి

కలుగజేయును" అని కొత్త నిబంధన మనకు చెబుతున్నది (1 కొరింథీ. 8:1). ఈ విషయాలను చక్కగా నేర్చుకున్నామని ప్రపంచానికి చూపించుకోవడానికి మాత్రమే దైవశాస్త్రంపై లేదా సిద్ధాంతంపై మేధోపరమైన ఆసక్తి మనం కలిగి ఉండవచ్చు. ఇతరుల దృష్టిలో మనల్ని మనం గొప్పవారిగా చూపించుకోవాలనే ప్రయత్నంతో కూడా సిద్ధాంత అధ్యయనాన్ని మొదలుపెట్టవచ్చు. ఆ రకంగా, అది మనలో అహంకారాన్ని నింపుతుంది. అందుకే సిద్ధాంతం తనంతట తానుగా ఎవరినీ ఎన్నడూ రక్షించలేదు అనే విషయాన్ని మనం అర్థంచేసుకోవడం చాలా ముఖ్యం. క్రీస్తు, కేవలం క్రీస్తు మాత్రమే రక్షకుడు. అయితే మనం సిద్ధాంతాన్ని ఆసక్తితో, శ్రద్ధగా అభ్యసించాలి. ఎందుకంటే సిద్ధాంతాన్ని శ్రద్ధగా తెలుసుకోవడం అంటే, దేవుడు తన వాక్యంలో మనకు బయలుపరిచిన విషయాలను శ్రద్ధగా అవగాహన చేసుకోవాలని అన్వేషించడమే.

అధ్యాయం పన్నెండు

# సువార్తను ప్రకటించడం

క్రీస్తు పరలోకానికి ఆరోహణమవ్వడానికి కొద్దిసేపటి ముందు, తన శిష్యులకు సంఘానికి ఇచ్చిన ఆజ్ఞే ఈ మహా ఆజ్ఞ. ఈ ఆజ్ఞ ద్వారా, ఆయన తన శిష్యులను ప్రపంచమంతటా వెళ్లి, ప్రతి మనిషికీ సువార్తను ప్రకటించాలని, అన్ని తెగల ప్రజల భాషల జాతుల నుండి శిష్యులను చేయాలని ఆజ్ఞాపించాడు (మత్తయి 28:18–20; ప్రకటన 7:9). మొదటి శతాబ్దం నుండి, ఇదే సంఘం యొక్క లక్ష్యంగా ఉన్నది. “ది గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్: ఆన్ ఇవాంజెలికల్ సెలబ్రేషన్” అనే సిద్ధాంతాల డాక్యుమెంట్ లో, చివరి ఆర్టికల్ దీనిపైనే దృష్టి పెట్టింది. ధృవీకరణ 18 ఇలా చెప్పుతుంది:

సువార్తను ప్రతి మనిషికి ప్రకటించాలని, ప్రతి చోటా ఉన్న ప్రతి ఒక్కరికీ సువార్త వినిపించి, సంఘ సహవాసంలో ఉన్న విశ్వాసులను శిష్యులుగా తయారుచేయాలని యేసుక్రీస్తు తన అనుచరులను ఆజ్ఞాపిస్తున్నాడు. ఈ సత్యాన్ని మేము ధృవీకరిస్తున్నాము. క్రీస్తుకు పూర్తిగా, నమ్మకంగా సాక్ష్యమివ్వాలంటే, మన వ్యక్తిగత సాక్ష్యం ఉండాలి, దైవభక్తితో కూడిన జీవితం ఉండాలి, పొరుగువారికి దయ చూపించాలి, దానధర్మాలు చేయాలి. ఇవి లేకపోతే సువార్త ప్రకటన నిస్సారంగా కనిపిస్తుంది.

దీనికి సంబంధించిన తిరస్కరణ ఇలా ఉంది:

సువార్తను ప్రకటించకుండా, కేవలం వ్యక్తిగత సాక్ష్యం ద్వారా దైవభక్తితో కూడిన జీవితం ద్వారా, పొరుగు వారికి దయ చూపడం ద్వారా, దానధర్మాలు చేయడం ద్వారా మాత్రమే సువార్త ప్రకటించడం అవుతుందనే అభిప్రాయాన్ని మేము తిరస్కరిస్తున్నాము.

ఒక సందర్భంలో, ప్రపంచంలో ఎవరికీ తెలియని ఒక ఊరిలో పనిచేస్తున్న ఒక మిషనరీతో మాట్లాడాను. ఇంతకు ముందెన్నడూ పశ్చిమ దేశాల వారిని చూడని ప్రజల మధ్యలో ఆమె సేవ చేస్తున్నది. ఆ మిషనరీ ఆ ప్రజల మధ్యలో కొన్ని సంవత్సరాలు కష్టపడి పనిచేసింది. చివరకు, వారు సువార్తను అర్థం చేసుకున్నప్పుడు, ఆ గ్రామ పెద్దతో సహా చాలామంది క్రీస్తును స్వీకరించారు. ఒక సందర్భంలో, ఆ గ్రామ పెద్ద మిషనరీని "యేసు ఈ భూమిపై ఎంత కాలం క్రితం జీవించాడు?" అనే

ప్రశ్న అడిగాడు. ఆ మిషనరీ, “రెండు వేల సంవత్సరాల క్రితం” అని ఆ ప్రజల భాషలో చెప్పడానికి చాలా ప్రయత్నించింది. కానీ ఆమెకి సాధ్యం కాలేదు. చివరకు తరాల గురించి మాట్లాడితే వారికి అర్థమవుతుందని అనుకుంది. అప్పుడు ఆ పెద్ద, కొన్ని పుల్లలు తీసుకుని, ప్రతి పుల్లనూ ఒక తరంగా లెక్కించాడు. అతడు “యేసు మా తరంలో ఉన్నాడా?” అని అడిగాడు. మిషనరీ, “లేదు” అంది. తర్వాత అతడు రెండో పుల్ల తీసుకుని, “మా నాన్నగారి తరంలో?” అని అడిగాడు. “లేదు” అంది. మూడో పుల్ల పెట్టి, “మా తాతగారి తరంలో?” అని అడిగాడు. “లేదు” అంది. అతడు నేలపై ఒక్కో పుల్ల పెడుతున్న కొద్దీ, అతని ముఖంలో బాధ పెరుగుతూ వచ్చింది. చివరకు, నేలపై మొదటి శతాబ్దం వరకు సరిపోయేంత పుల్లల వరుస అయిన తర్వాత, అతడు తనను తాను నియంత్రించుకోలేకపోయాడు. అప్పుడు ఆ పెద్ద, “యేసు అంత కాలం క్రితం జీవించి ఉంటే, మేము ఆయన గురించి ఇప్పుడే ఎందుకు వింటున్నాము?” అని ఆ మిషనరీని అడిగాడు.

విచారం ఏంటంటే, మనం క్రీస్తు మహా ఆజ్ఞను పాటించడంలో ఎంత నమ్మకంగా ఉండాలో, అంత నమ్మకంగా లేము. అందుకే ఈ రోజు ప్రపంచంలో క్రీస్తు పేరును ఇప్పటికీ వినని ప్రజలు చాలామంది ఉన్నారు. ఇంతకుముందు ఎన్నడూ లేనంతగా, ఈ రోజు ప్రపంచం చాలా చిన్నదైపోయింది. ప్రయాణించడానికి మనకు చాలా సౌకర్యాలు, ఆధునిక వసతులు ఉన్నాయి. కాబట్టి మహా ఆజ్ఞను నెరవేర్చడంలో మన తరానికి సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రతి మనిషికీ, ప్రతి చోటా సువార్తను ప్రకటించాలని క్రీస్తు తన అనుచరులను ఆజ్ఞాపిస్తున్నాడని 18వ ధృవీకరణ మనకు మళ్లీ గుర్తుచేస్తుంది.

ఈ రోజుల్లో కొంతమంది సువార్తీకరణకు ప్రతికూలంగా స్పందిస్తున్నారు. ఎవరి పని వాళ్ళు చూసుకోవాలి. ఇతరులు ఏ మతంలో ఉన్నా, వాళ్ళు క్రీస్తును అంగీకరించేలా ప్రభావితం చేయకూడదని వారు అనుకుంటున్నారు. కొన్ని వర్గాల ప్రజలు సమూహాలు సువార్తీకరణ సరిహద్దులకు బయట ఉన్నారని చాలా సంఘాలు భావిస్తున్నాయి. అందుకే మనలో చాలామంది సువార్తను ఇతరులకు చెప్పే విషయంలో స్తబ్దంగా ఉండిపోతున్నాము. దీనివల్ల, ప్రతి చోటా ఉన్న ప్రజలందరికీ సువార్త ప్రకటించాలనే ఆదేశాన్ని నెరవేర్చలేకపోతున్నాం.

అంతర్జాతీయ స్థాయిలో మాత్రమే కాదు, స్థానికంగా అనగా మనం నివసించే ప్రదేశాల్లో కూడా మహా ఆజ్ఞను నెరవేర్చడంలో విఫలమవుతున్నాము. మనకు ఉన్న ఆదేశం ఏమిటంటే: ప్రతిచోటా ఉన్న ప్రతి ఒక్కరికీ సువార్తను ప్రకటించడం, సంఘ సహవాసంలో విశ్వాసులను శిష్యులుగా తయారుచేయడం. మహా ఆదేశం యొక్క ఉద్దేశం: కేవలం సువార్త ప్రకటించడం మాత్రమే కాదు, బోధించడమూ శిష్యులను తయారు చేయడం కూడా. సువార్తను ప్రకటించి, *శిష్యులను చేయమని* యేసు చెప్పాడు. శిష్యుడు అంటే నేర్చుకునేవాడు, విద్యార్థి. అంటే ప్రజలు సువార్తకు స్పందించిన తర్వాత, వారు సంఘ జీవితంలో లోతుగా పాల్గొనడానికి పిలవబడ్డారు. ఎందుకంటే సంఘం కేవలం ప్రకటించడానికి మాత్రమే కాదు, క్రీస్తును అంగీకరించిన వారికి దేవుని విషయాలపై లోతైన అవగాహన కలిగించడానికి కూడా ఉంది. ఆదిమ సంఘం సువార్త ప్రకటనకు, బోధనాత్మక శిక్షణకు మధ్య తేడాను పాటించింది. సువార్తకు స్పందించిన ప్రజలను సంఘ సమూహంలోకి తీసుకువచ్చి, వారిని క్రీస్తు శిష్యులుగా, అనుచరులుగా పోషించి, శిష్యరికం నేర్పించడం అప్పుడు మొదలయ్యేది.

18వ ధృవీకరణ ఇంకా ఇలా చెబుతోంది: “క్రీస్తుకు పూర్తిగా, నమ్మకంగా సాక్ష్యమివ్వాలంటే, మన వ్యక్తిగత సాక్ష్యం ఉండాలి, దైవభక్తితో కూడిన జీవితం ఉండాలి, పొరుగువారికి దయ చూపించాలి, దానధర్మాలు చేయాలి. ఇవి లేకపోతే సువార్త ప్రకటన నిస్సారంగా కనిపిస్తుంది.” ఆర్టికల్ 18 లోని ఈ భాగం, క్రీస్తుకు సాక్ష్యం చెప్పడానికి ఉన్న వివిధ మార్గాల గురించి మాట్లాడుతోంది. కొత్త నిబంధనలో, *సువార్త ప్రకటనకు, సాక్ష్యం చెప్పడానికి* మధ్య తేడా ఉంది. అయితే నేటి క్రైస్తవులు సాక్ష్యం అనే పదాన్ని, సువార్త ప్రకటించడం అనే పదానికి పర్యాయపదంగా వాడుతున్నారు, అంటే రెండూ ఒకటే అన్నట్లుగా భావిస్తున్నారు.

క్రీస్తు గురించి సాక్ష్యం చెప్పడం అంటే, వివిధ మార్గాల్లో ఆయనపై ఇతరుల దృష్టిని మళ్లించడం. దైవభక్తితో కూడిన జీవితం జీవిస్తూ, ఇతరులకు ఆదర్శంగా ఉండటం ద్వారా మనం సాక్ష్యం చెబుతాము. ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం ద్వారా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం ద్వారా ఇతర దానధర్మాలు చేయడం వంటి దయగల పనులు చేయడం ద్వారా కూడా క్రీస్తు ఉనికిని లోకానికి చూపిస్తాము. ఇవన్నీ సాక్ష్యం చెప్పే వివిధ రకాల మార్గాలు. అయితే ఇవన్నీ సువార్త ప్రకటనలు కావు. సువార్తీకరణ అనేది సాక్ష్యం చెప్పే పద్ధతుల్లో ఒక విధానం. అయితే ప్రతి సాక్ష్యమూ సువార్తీకరణ కాదు. క్రీస్తు యొక్క సర్వాధికారాన్ని మనం అనేక మార్గాల్లో ప్రకటిస్తాము. వాటిలో సువార్త ప్రకటన కూడా ఒకటి.

ఈ విషయాన్ని మనం ఎందుకు నొక్కిచెబుతున్నాము? ఇది చాలా ముఖ్యమైనది! ఎందుకంటే “నేను మాదిరికరమైన జీవితం ద్వారానే సువార్తను ప్రకటిస్తున్నాను. నేను ఎన్నడూ మాటలతో క్రీస్తును ప్రకటించను. నా జీవితంతోనే నేను క్రీస్తును ప్రకటిస్తాను”

అని చాలామంది అంటారు. అయితే మీ జీవితం సువార్తలోని ముఖ్య విషయాలను ప్రజలకు ఎలా చెబుతుంది? వారు మీ వైపు ఇప్పటినుంచి దేవుని రాజ్యం వచ్చేవరకు చూసినా, క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్తం గురించి ఆయన పునరుత్థానం గురించి కేవలం విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడటం గురించి ఎన్నటికీ అర్థం చేసుకోలేరు. కేవలం మీ జీవితాన్ని చూడటం ద్వారా ఎవరైనా ఆ విషయాలను ఎలా తెలుసుకోగలరు? మీ దైవభక్తితో కూడిన ఆదర్శప్రాయమైన జీవితం వలన ఎవరైనా, "మీరు ఈ విధంగా ఎందుకు జీవిస్తున్నారు?" అని అడగవచ్చు. అలా అడిగినప్పుడు, మీరు వారికి సువార్తను వివరించడానికి అది ఒక అవకాశం అవుతుంది. అంతేకానీ, కేవలం మీ జీవితమే సువార్తను వారికి చేరవేయలేదు. కొన్నిసార్లు మనం సువార్తను మాటలతో ప్రకటించకుండా మౌనంగా ఉండటానికి ఒక సాకు చెబుతాము: "నేను నా అభిప్రాయాలను ఇతరులపై బలవంతంగా రుద్దను. నా అద్భుతమైన జీవితాన్ని చూసి వాళ్లే వచ్చి అడిగేంత వరకు ఎదురు చూస్తాను." అయితే మనలో చాలామంది పరిశుద్ధతలో అంత ఎత్తుకు ఎదగలేదు అనే విషయాన్ని కూడా మనం అంగీకరించాలి. అందుకే "మీరు ఎందుకంత ప్రత్యేకంగా ఉన్నారు, మాకు కూడా అది ఎలా దొరుకుతుందో చెప్పండి" అని లోకం వచ్చి మన తలుపు తట్టడం అనేది అరుదుగా జరుగుతుంది.

మరోవైపు, మనం మన పొరుగువారి అనుదిన అవసరాల గురించి ఏ మాత్రమూ పట్టించుకోకుండా, కేవలం యేసు గురించి మాత్రమే వాళ్లకు ప్రకటిస్తే, మనం ప్రకటన వారికి నిస్సారంగా వినిపిస్తుంది. నిజమే, సువార్త ప్రకటన ద్వారానే దేవుడు లోకాన్ని రక్షించాలని నిర్ణయించుకున్నాడు. ప్రజలను క్రీస్తు వైపు తీసుకురావడానికి దేవుడు తన శక్తిగా ఉపయోగించుకునేది

సువార్తనే. అయితే కొత్త నిబంధన మనల్ని ఇలా హెచ్చరిస్తోంది: "నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరుడైనను సహోదరియైనను దిగంబరులై ఆ నాటికి భోజనములేక యున్నప్పుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసినవాటిని ఇయ్యక సమాధానముగా వెళ్లుడి, చలి కాచుకొనుడి, తృప్తిపొందుడని చెప్పినయెడల ఏమి ప్రయోజనము?" (యాకోబు 2:14–16).

కేవలం "చలి కాచుకోండి, తృప్తిపొందుడని" చెబితే, అది ఎలాంటి సాక్ష్యం అవుతుంది? అది నిస్సారమైన సాక్ష్యం. 18వ ధృవీకరణ యొక్క తిరస్కరణ ఇలా చెబుతోంది: "సువార్తను ప్రకటించకుండా, కేవలం వ్యక్తిగత సాక్ష్యం ద్వారా దైవభక్తితో కూడిన జీవితం ద్వారా, పొరుగువారికి దయ చూపడం ద్వారా, దానధర్మాలు చేయడం ద్వారా మాత్రమే సువార్త ప్రకటించడం అవుతుందనే అభిప్రాయాన్ని మేము తిరస్కరిస్తున్నాము." మంచి జీవితాన్ని జీవించడం మాత్రమే సువార్త ప్రకటన కాదని మనలో చాలామంది అర్థం చేసుకోగలం. కనికరంతో దాతృత్వంతో ప్రజల లోక సంబంధమైన అవసరాలను అంటే ఆహారం, బట్టలు, ఉద్యోగం వంటి అవసరాలను తీర్చడానికి సంఘం ప్రయత్నించాలి. అయితే ఎవరికైనా కేవలం ఒక రొట్టె ముక్కనో ఒక గ్లాసు చల్లటి నీళ్లనో ఇవ్వడం ద్వారా సువార్త సారాంశం ప్రజలకు చేరదు. ఆ సహాయం అందుకున్న వ్యక్తికి సువార్త ఇంకా తెలియదు.

18వ ధృవీకరణ యొక్క తిరస్కరణలో చెప్పబడిన రెండవ రకమైన సాక్ష్యం ఏంటంటే, వ్యక్తిగత సాక్ష్యం చెప్పడం. అంటే ప్రజలు క్రీస్తును ఎలా నమ్మారు, క్రైస్తవులుగా మారిన తర్వాత వారి జీవితంలో ఏం జరిగిందనే కథను చెప్పడం. దేవుని విషయాలను

ఇతరులకు చెప్పడంలో ఇది ఒక ముఖ్యమైన భాగం. వ్యక్తిగత సాక్ష్యానికి గొప్ప విలువ ఉంది. కానీ వ్యక్తిగత సాక్ష్యం అనేది సువార్త కాదు. మన వ్యక్తిగత సాక్ష్యం తన దగ్గరకు నిరర్థకంగా తిరిగి వెళుతుందని దేవుడు వాగ్దానం చేయలేదు. దేవుడు మన వ్యక్తిగత సాక్ష్యపు శక్తిని లోకాన్ని రక్షించే సాధనంగా ఎంచుకోలేదు. మన వ్యక్తిగత సాక్ష్యం క్రీస్తు గురించి పరోక్షంగా మాట్లాడినప్పటికీ, ప్రత్యేకంగా మన గురించి, మన ప్రత్యేక పరిస్థితి గురించే మాట్లాడుతుంది. అది మనం ఎవరితో మాట్లాడుతున్నామో వారికి సంబంధం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అయితే సువార్త మాత్రం ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. సువార్త అనేది వాస్తవమైన, బలమైన సత్యం. దాన్నే మనం ప్రకటించాలి.

మనం పరిశీలించిన డాక్యుమెంట్, "ది గాస్పెల్ ఆఫ్ జీసస్ క్రైస్ట్: ఆన్ ఇవాంజెలికల్ సెలబ్రేషన్", ఈ క్రింది ప్రకటనతో ముగుస్తుంది:

> బైబిల్ని విశ్వసించేవారమైన మనం సువార్తలో ఏకమైయున్నాం. ఒకరినొకరం జాగ్రత్తగా కాచుకుంటామని, శ్రద్ధ తీసుకుంటామని, ఒకరి కోసం ఒకరం ప్రార్థిస్తామని, ఒకరినొకరం క్షమించుకుంటామని, ప్రతి చోటా ఉన్న దేవుని ప్రజలందరికీ ప్రేమతో, సత్యంతో చేరువవుతామని వాగ్దానం చేస్తున్నాము. ఎందుకంటే మనమంతా ఒకే కుటుంబంగా ఉన్నాం; పరిశుద్ధాత్మలోనూ క్రీస్తులోనూ ఏకమై ఉన్నాము.

చాలా శతాబ్దాల క్రితం, ఒక గొప్ప మాట చెప్పబడింది. తప్పనిసరైన విషయాలలో ఐక్యత ఉండాలి, తప్పనిసరి కాని విషయాలలో స్వేచ్ఛ ఉండాలి, అన్ని విషయాలలో ప్రేమ ఉండాలి. మేము ఈ సువార్త సత్యాలన్నింటినీ కూడా తప్పనిసరి అని భావిస్తున్నాము.

ఈ సిద్ధాంతాల డాక్యుమెంట్ తయారుచేయడంలో వివిధ డినామినేషన్ను నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నప్పటికీ దైవశాస్త్రానికి సంబంధించిన కొన్ని విషయాలు తమను విడదీయగలవని వాళ్లకు తెలిసినా, వారంతా సువార్త విషయంలో ఒకటిగా ఉన్నారు. క్రైస్తవులు సహవాసంగా ఒకచోట చేరడానికి సువార్త ఐక్యత తప్పనిసరి. ఎందుకంటే దేవుని పరిశుద్ధ వాక్యంలో మనకు ఇవ్వబడిన నిజమైన సువార్త, కేవలం సువార్త మాత్రమే మనల్ని రక్షిస్తుంది.

## రచయిత గురించి

డా. ఆర్.సి. స్ప్రౌల్ గారు లిగోనియర్ మినిస్ట్రీస్ స్థాపకులు. ఫ్లోరిడాలోని శాన్‌ఫోర్డ్‌లో ఉన్న సెయింట్ ఆండ్రూస్ చాపెల్‌కు మొదటి ప్రీచింగ్ టీచింగ్ మినిస్టర్‌గా సేవచేశారు. రిఫర్మేషన్ బైబిల్ కాలేజికి మొదటి అధ్యక్షులు. *టేబుల్‌టాక్* మ్యాగజైన్‌కు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్. ఆయన యొక్క రేడియో కార్యక్రమం, *"రిన్యూయింగ్ యువర్ మైండ్"*, ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వందలాది రేడియో స్టేషన్లలో, ఆన్‌లైన్‌లో ప్రసారమవుతోంది. ఆయన వందకు పైగా పుస్తకాలు రాశారు. వాటిలో *"ది హోలీనెస్ ఆఫ్ గాడ్"*, *"చోజెన్ బై గాడ్"*, *"ఎవ్రీవన్ ఈజ్ ఎ థియాలాజియన్"* వంటివి చాలా ప్రసిద్ధి చెందాయి. లేఖనాలు దోషరహితమైనవి అనే సిద్ధాంతాన్ని చక్కగా వివరించడం ద్వారా, దేవుని ప్రజలు తన వాక్యంపై నమ్మకంగా నిలబడాల్సిన ఆవశ్యకతను గట్టిగా నొక్కిచెప్పడం ద్వారా స్ప్రౌల్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

**లిగోనియర్** గ్రంథాలయం

లిగోనియర్ మినిస్ట్రీస్ ఒక అంతర్జాతీయ క్రైస్తవ శిష్యత్వ సంస్థ. దీనిని డా. ఆర్. సి. స్ప్రోల్ గారు 1971లో స్థాపించారు. దేవుని పరిశుద్ధతను సంపూర్ణంగా ప్రకటించడం, బోధించడం మరియు సమర్థించడం ద్వారా సాధ్యమైనంత మందికి సువార్తను అందించటం ఈ సంస్థ యొక్క ముఖ్య లక్ష్యం. లిగోనియర్ లైబ్రరీ బ్యాడ్జ్ ప్రపంచవ్యాప్తంగా మరియు అనేక భాషల్లో విశ్వసనీయతకు గుర్తుగా నిలిచింది. అది నమ్మకమైన బోధన మరియు విశ్వసనీయమైన ఆధ్యాత్మిక వనరుల గుర్తుగా గుర్తింపును పొందింది.

గ్రేటు కమిషన్ ద్వారా ప్రేరణ పొందిన లిగోనియర్, ప్రపంచవ్యాప్తంగా శిష్యత్వ సాధనాలను ముద్రణ మరియు డిజిటల్ రూపాల్లో అందిస్తుంది. ఇక్కడ నమ్మకమైన పుస్తకాలు, వ్యాసాలు, మరియు వీడియో బోధన సిరీస్‌లు 50 కంటే ఎక్కువ భాషల్లో అనువదించబడుతున్నాయి లేదా డబ్బింగ్ చేయబడుతున్నాయి. యేసు క్రీస్తు యొక్క సంఘములోని క్రైస్తవులకు మద్దతు ఇవ్వడము అనగా వారు ఏమి నమ్ముతారో, ఎందుకు నమ్ముతారో, అలాగే వారు నమ్మిన దానిని తమ జీవితంలో ఎలా ఆచరించలో, దానిని ఇతరులతో ఎలా పంచుకోవాలో తెలియజేయటంలో మా సహాయాన్ని అందించటమే మా యొక్క ఆశయము.

TE.LIGONIER.ORG

“అలెథియ పబ్లికేషన్ అండ్ ట్రైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్” అనే సంస్థ భారతదేశంలోని స్థానిక భాషల్లో వాక్యానుసారమైన, నమ్మకమైన, క్రీస్తుకేంద్రిత ఉపకరణాలను (పుస్తకాలను) అందుబాటులోనికి తీసుకురావడం ద్వారా స్థానిక సంఘానికి శిక్షణ నిచ్చేందుకు అంకితమైన సంస్థ. దేవుని యెడల ప్రేమలోనూ ఆయన వాక్య సత్యంలోనూ విశ్వాసుల ఎదుగుదలను చూడాలన్నదే మా ఆకాంక్ష.

అలెథియ అనే మా సంస్థ ఆరంభమైన నాటి నుంచే, నమ్మదగిన క్రైస్తవ సాహిత్యాన్ని దైవశాస్త్ర గ్రంథాలను స్టడీ బైబిళ్లను ఆధ్యాత్మిక గ్రంథాలను అనువదించడంపైన, సంఘ కాపరులకు నాయకులకు విశ్వాసులకు పంపిణీ చేయడంపైన దృష్టిసారించింది. దైవశాస్త్రపరంగా ఎంతో ఆరోగ్యకరమైన, ఆచరణలో ఎంతో సహాయపడే రిఫార్మ్ డ్ సాహిత్యాన్ని, సువార్త కేంద్రిత గ్రంథాలను అందించడం ద్వారా వివిధ క్రైస్తవ శాఖల్లోని సంఘాలకు మేము పరిచర్య చేస్తున్నాము.

శిష్యరికం, వివరణాత్మకమైన ప్రసంగం, దైవశాస్త్రపరమైన శిక్షణ తదితర ముఖ్యాంశాలకు సంబంధించిన ఉపకరణాలను అందుబాటులోనికి తీసుకురావడం వలన భారతదేశంలో క్రీస్తు సంఘాన్ని మరి ముఖ్యంగా సరైన వనరులు లేని ప్రాంతాల్లో సంఘాన్ని బలోపేతం చేయడమే మా లక్ష్యం. మీరు వ్యక్తిగతంగా భక్తిలో ఎదగడానికి, గ్రూప్ స్టడీ లకు, సంఘ పరిచర్యకు సంబంధించిన పుస్తకాల కోసం వెదుకుతున్నట్లయితే, మీకు పరిచర్య చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

మా దగ్గర అందుబాటులో ఉన్న పుస్తకాలను ఉపకరణాలను పరిశీలించమని మేము మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మీ సంఘానికి పరిచర్యకు మేమెలా తోడ్పడగలమో మాతో చర్చించేందుకు మమ్మల్ని సంప్రదించండి.

సువార్త కేంద్రిత ఎదుగుదలలో మీ భాగస్వామియైన,
అలెథియ పబ్లికేషన్ అండ్ ట్రైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్.

alethiabooks.com
alethia4india.org

# నువ్వు సువార్తను నమ్ముతున్నావా?

“దేవుడు మంచివాడు కాబట్టి మనం మంచిగా జీవిస్తే ఆయన మనల్ని అంగీకరిస్తాడు” అని చాలామంది అనుకుంటారు. అయితే ఇది సువార్త కాదు, ఎందుకంటే మనలో ఏ ఒక్కరమూ దేవుడు అంత మంచి వ్యక్తులం కాము. మనల్ని మన దారికి వదిలేస్తే, మన జీవితాలకు రావలసిన ఆయన తీర్పునే మనం పొందుకుంటాం.

ఈ చిన్న పుస్తకంలో డాక్టర్ ఆర్.సి. స్ప్రౌల్ గారు సువార్తను అనగా పాపాత్ములమైన మనకు దేవుని సువార్తను వివరిస్తున్నారు. దేవుని న్యాయమైన శిక్షావిధి నుంచి మనం ఎన్నటికీ మనల్ని మనం రక్షించుకోలేము. తన కుమారుడైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచమని దేవుడు మనల్ని పిలుస్తున్నాడు. యేసుక్రీస్తు మాత్రమే నీతిగల తన జీవితం ద్వారా, తన ప్రాయశ్చిత్త మరణం ద్వారా, విజయవంతమైన పునరుత్థానం ద్వారా మనల్ని విమోచించగలడు.

తరచుగా క్రైస్తవులు, మేధావులు అడిగే ముఖ్యమైన ప్రశ్నలకు డాక్టర్ ఆర్.సి.స్ప్రౌల్ గారు ది క్రూషియల్ క్వశ్చన్స్ బుక్లెట్ సిరీస్ లో సంక్షిప్తంగా జవాబులు చెబుతున్నారు.

**డాక్టర్ ఆర్.సి. స్ప్రౌల్**గారు లిగనియర్ మినిస్ట్రీస్ కు వ్యవస్థాపకులు. ఫ్లోరిడాలోని శాన్ఫోర్డ్ లో సెయింట్ యాండ్రూస్ చాపెల్ ను స్థాపించిన కాపరి. రిఫర్మేషన్ బైబిల్ కాలేజ్ కు మొదటి ప్రెసిడెంట్. ఈయన వంద కంటే ఎక్కువ పుస్తకాలను రచించారు. *ద హోలీనెస్ ఆఫ్ గాడ్* అనేది వాటిలో ఒకటి.

లిగోనియర్ గ్రంథాలయం

ALETHIA Publications

9 788199 839977
TELUGU
RELIGION / Practical Theology / Soteriology